మే 2018
రూ. 20

# చైతన్యం

సంకల్ప బలం

సామాజిక విలువల మాసపత్రిక



శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావు ( 1920 - 2018 )


నమ్మకద్రోహం - కుట్ర రాజకీయాలపై
ధర్మ పోరాటం





వ్యవస్థాపక సంపాదకురాలు:

**తీగవరపు శాంతి**

# చైతన్యం

సంకల్ప బలం

సామాజిక విలువల మాస పత్రిక

సంపుటి -7 మే 2018 సంచిక -8

## ఈ సంచికలో

### ధారావాహికములు:

| | |
|---|---|
| బొమ్మలు చెప్పిన బాలల.. | 16 |
| మిస్ మేఘమాల | 22 |
| కాశీ ఖండం | 26 |
| సంభాషణ సంస్కృతం | 32 |
| మా ఊరి నందుల కథ | 37 |
| ప్రహేళిక | 43 |
| రాశి ఫలాలు | 48 |

### ప్రత్యేక ఆకర్షణలు

| | |
|---|---|
| సంపాదకీయం | 4 |
| అభిప్రాయ వేదిక | 5 |
| దొంగ పిల్లి | 6 |
| లెక్కకు అందని కాలమానం | 8 |
| అమెరికా పౌరసత్వాన్ని వదులుకోవటం | 11 |
| రజని అనే బాలాంత్రపు రజనీకాంతరావు | 19 |
| అప్పుల తిప్పలాష్టకం | 28 |
| మన విద్యా వ్యవస్థ | 29 |
| డిజైనర్ గెడ్డం | 39 |
| అధిక జ్యేష్ఠ మాసం | 44 |

రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

.

# మానసిక కాలుష్యం

ప్రజలు రక రకాల కాలుష్యాలతో ఒక పక్క సతమతమవుతుంటే , వయస్సుతో సంబంధం లేకుండా చిన్న వయస్సు వారి నుండీ వయస్సు మళ్ళిన వారి వరకూ అత్యాచారాలకు పాల్పడడం ఎంతో దురదృష్టకరం. అదికూడా విరిసీ విరియని పసికందులను చిదిమేయడం అత్యంత బాధాకరం. ఎంతో గొప్పగా చెప్పుకునే మన భారత దేశ సంపద అయిన సంస్కృతి, సాంప్రదాయాలకు పుట్టినిల్లయిన మన దేశంలో ఇటువవంటి అత్యాచారాలు అనే మాట వినడానికి, వాడడానికి ఎంతో కష్టంగా ఉంటే, అటువంటివి జరిగడం ఎంతో దురదృష్టకరం. వాటికి తోడు చర్చలు జరుపుకోవలసి రావడం ,ఆత్మ హత్యలు, శిక్షలు . అసలు ఎక్కడకి వెడుతోంది మనదేశ సాంప్రదాయం?

దీనికి కారణం ఎవరు? అని ప్రశ్నవేసుకుని, కూకటి వీళ్ళతో ఈ చెడుని తొలగించ వలసిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా మనకి మన దేశ విలువల కన్నా, మనకి ఎంతసేపూ పరాయి దేశాల నుండి దిగుమతి చేసుకుని అందరి ముందూ ప్రదర్సించుకోవడం ఎంతో గొప్పగా చెప్పుకోవడం, చూపించుకోవడం మనకి బాగా అలవాటు. మనిషి మనస్సుని చెడు ఆకర్షించినట్లు, మంచి ఆకర్షించదు. కావున మనస్సుని మంచి విషయాలతో నింపి , మనశిక బలం చేకుర్చుకోవాలి ఎవరికి వారు.

.ఏది మంచి? ఏది చెడు? అనే ఆలోచించం. అది క్షణిక ఆవేశం కావచ్చు, క్షణిక ఆలోచన కావచ్చు. కాని జీవితాలను నాశనం చేస్తుంది ఆ ఆలోచన అని, జీవితం నాశనం అయితే కాని దాని విలువ తేలియదు. తరువాత ఆలోచించినా, మానశిక వ్యధ తప్ప ఏమీ మిగలదు.

వీటి నుండి తప్పించుకుని జీవితాలను సుఖ మాయం చేసుకోలేరా ? అంటే తప్పకుండా చేసుకోవచ్చును. అందుకు ముఖ్యంగా తల్లితండ్రుల పెంపకం, గురువులు సన్మార్గం లో ప్రవర్తిస్తూ , విద్యార్ధులకు నీతి నియమాలతో కూడిన విద్యా బోధన చేస్తూ , సమాజంలో పురుగులను ,దోమలను, కాలుష్యాన్ని పారద్రోలినట్లు చెడుని అణుమాత్రం కుడా ఏ ఒక్కరి దరిచేరకుండా సమాజంలో ప్రతి ఒక్కరు కృషి చేస్తే, మన సమాజం ఎలా ఉంటుంది? శిక్షలు వెయ్యడం, వాటి కోసం రకరకాల చట్టాలు చెయ్యడం, వాటిని కొందరికి మాత్రమె అమలు చెయ్యడం , ఇది ఎంతవరకు? శిక్షలు ఉండాలి, అమలు చెయ్యాలి, ఆ శిక్ష సమాజంలో అందరి ముందు వెయ్యాలి. అది కుడా వెంటనే అమలు కావాలి. ధనిక, పేద, కుల మత, పదవులతో సంబంధం లేకుండా అమలు చెయ్యాలి. అప్పుడే అది అందరికీ అర్ధం అవుతుంది.

ఈ విధంగా శిక్షలు అమలు జరపడమే కాకుడా ప్రజలలో మానశిక పరివర్తన రావాలి. పిల్లలకు చిన్నప్పటి నుండీ సామాజిక విషయాలలో అవగాహన కలిగిస్తూ , మంచి చెడులు గురించి వివరంగా చెప్పాలి. ధర్మ బోధన, నీతి గురించి రకరకాలుగా తల్లితండ్రులు పిల్లల చిన్నప్పుడు కథల రూపంలో, కొద్దిగా పెద్దవారు అయ్యాక అనుభవజ్ఞులతో మంచిమంచి స్పీచెస్ ఇప్పిస్తూ, వారు వినేటట్లు చేసి, వారి మనస్సులో పదిలంగా ఉండేటట్లు చేస్తే , అవి వారికి ఎంతో ఉపయోగ పడతాయి అనడంలో ఎటువంటి సందేహం లేదు.

అసలే మాయా ప్రపంచంలో మాయ అనే పొరలతో కమ్ముకుని జీవిస్తున్న మనం ఇంకా నాశనం అయిపోకుండా ఉండాలి అంటే అతి ముఖ్య పాత్ర వహిస్తున్న మీడియా రంగం, సినీమాలు, ఇంటర్నెట్ కుడా అత్యంత జాగ్రత్త వహిస్తూ మంచి సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి. మానసిక కాలుష్యాన్ని అరికట్టదానికి ప్రజలంతా నడుం కట్టవలసిన సమయం ఆసన్నమైంది.

భారత దేశ సంస్కృతి సాంప్రదాయాలు చాల గొప్పవి, ఉన్నత విలువలు కలిగినవి అని మరచిపోవద్దు మనం.



తీగవరపు శాంతి

# అభిప్రాయ వేదిక

స్టీఫెన్ హాకింగ్ ముఖచిత్రంతో వెలువడిన ఏప్రిల్ నెల పత్రిక చాలా సుందరంగా వుంది. పత్రికలో-ని ప్రతి శీర్షికా సూపర్బ్! పత్రికా యాజమాన్యానికి అభినందనలు.
సుబ్రహ్మణ్యం, శ్రావణి - విజయవాడ

భువనచంద్ర గారు వ్రాసిన 'గోవిందం భజ మూఢ మతే' చాలా బాగుంది. ఆయన గళంలో వింటుంటే ఇంకా బాగా అనిపించింది. రచయితకు ధన్యవాదాలు.
సుబ్బారావు, రాణి - విశాఖపట్నం

వంద ఏళ్లకు పైబడ్డ గ్రంథాలయాలు రాష్ట్రంలో 28 ఉన్నాయంటే చాలా ఆశ్చర్యం వేసింది. చక్కని సమాచారం ఇచ్చినందుకు మీకు ధన్యవాదాలు.
సదానంద్, అలాక నిరంజన్ - మలక్ పేట

అమెరికా కు వెళ్లి అక్కడ స్థిరపడాలని ఉవ్విళ్ళూరే మన యువతకు మీరు ప్రచురించిన 'అమెరికా పౌరసత్వం పొందడం ఎలా?' చాలా ఉపయోగకరంగా వుంటుంది. తోటకూర ప్రసాద్ గారు వివరాలు బాగా తెలియచేసారు.
రాజేష్, రమేష్, దినేష్, శర్మ - హైదరాబాద్

ఆహ్వానం అందుకోవటంలో ఎంత ఆసక్తి చూపిస్తామో, RSVP పంపటంలో కూడా అంత ఆసక్తి చూపాలని చక్కగా ఓ మోచేతి పొడుపు ఇచ్చారు భారతీ శర్మ గారు. అందరూ చదివి తీరాల్సిన వ్యాసం ఇది.
లక్ష్మి, సరోజ, శ్రీదేవి, శకుంతల- ముంబాయి

పోడూరి శ్రీనివాసరావు గారి 'ఒక చెదరని స్వప్నం' కవిత హాయిగా వుంది. చక్కని కవిత!
రామిరెడ్డి, రాజారావు - వరంగల్లు

రేడియేషన్ గురించి కవన శర్మ గారు చక్కగా వ్రాసారు. రచయితకు నమస్కారం.
సోమసుందరం, వీర్రాజు - తిరుపతి

మేఘమాల సీరియల్ చూస్తుంటే, త్వరలోనే 'శుభం కార్డ్' పడేట్టు కనిపిస్తుంది. ఈ రచయిత్రి నుంచి మరో మంచి సీరియల్ ని మేము ఆశించవచ్చా?
పార్వతి, వనజ, భాను - దిల్ సుఖ్ నగర్

మురళీకృష్ణ గారి కాశీఖండం చాలా బాగుంటోంది. ఇది మాకో పారాయణ గ్రంథం లాగా అయింది. చాలా గొప్ప రచన. రచయితకు ధన్యవాదాలు.
రామశాస్త్రి, రాఘవరావు, రాజబాబు - వైజాగ్

తుమ్మూరి రాం మోహనరావు గారి 'నైమిశారణ్య యాత్ర' చాలా వివరంగా ఉంది. వచ్చే నెల మేము ఈ యాత్రకు ప్లాన్ చేస్తున్నాము. ఈ రచన మాకు ఒక గైడ్ లాగా ఉపయోగపడుతుందని మా నమ్మకం.
మని, స్నేహ, కుమారి, వాని - మల్కాజ్ గిరి

దుర్గా ప్రసాదరావు గారి సంస్కృత పాఠాలు చాలా ఉపయోగకరంగా ఉంటున్నాయి. సంస్కృత పుస్తకాలు చదవాలని ఆసక్తి కలుగుతోంది.
రాజేంద్ర ప్రసాద్, రాధాకృష్ణ - అనంతపూర్

ఎలెక్ట్రాన్ గారు వ్రాసిన 'ప్రతిభ' చాలా బాగుంది. రచయిత మన విద్యా వ్యవస్థని ఔపోసన పట్టినట్టుంది. ధన్యవాదాలు.
నరసింహమూర్తి - అమలాపురం

రాశిఫలాలు, ప్రహేళిక మీ పత్రికకే హైలైట్స్. రామానందం గారి వైశాఖ మాస వైశిష్ట్యం బాగుంది.
విజయలక్ష్మి, రత్నమాల - లింగంపల్లి

# భువనచంద్ర



## దొంగ పిల్లి

"జరిగినదానిని తలుచుకుంటే గుండె పగిలిపోతోంది స్వామీజీ", కన్నీళ్ళతో అన్నాడు ఓ భక్తుడు.

"అసలెందుకు తలుచుకోవాలీ? తలుచుకుంటే కాలం తిరిగి వస్తుందా? ఒకవేళ వచ్చినా, అప్పుడైనా నీవు అనుకున్నట్టే జరుగుతుందా? పిచ్చివాడా, ఏది జరగాలో, ఎలా జరగాలో నిర్ణయించేది ఎవరూ? నువ్వా? నేనా? అది మన చేతుల్లో లేదే. జరిగేది జరుగుతుంది. అది మంచీ కావచ్చు, చెడూ కావచ్చు.నీ జీవితానికి నువ్వే సాక్షిగా వున్నప్పుడు, నీ జీవితానికి నువ్వే ప్రేక్షకుడిగా మారగలిగినప్పుడు, బాధ అనేది గాలికి మబ్బులు తేలిపోయినట్టు తేలిపోతుంది", అనునయంగా అన్నారు స్వామీజీ.

********

ఇది చాలా సున్నితమైన మాట. 'నీ జీవితానికి నువ్వే సాక్షివి'. అంటే? నీ ఎదటివాడ్ని నువ్వెలా వేరేవాడిగా చూస్తావో నిన్ను నువ్వు అలాగే చూసుకోమని. అంటే, కాసేపు నీ మనసునీ, శరీరాన్నీ విడివిడిగా వుంచి, నీ



మనసుతో నీ శరీరాన్ని, అది చేసే పనులనీ గమనించమని".

"ఎలా సాధ్యం? మనసు దూరంగా వుంటే శరీరం ఎలా పనిచేయగలదూ?"

"సాధ్యమే. స్వప్నావస్థ (కల గనే స్థితి)లో నీ శరీరం మంచం మీద పడుకునే వున్నా, నీ శరీరం ఎక్కడెక్కడో తిరిగి రావట్లేదూ?(ఆ శరీరం స్వప్న శరీరం) . అర్థం కావట్లేదు కదూ?దీన్నే నా గురువులు చెప్పారు: 'జాగ్రదవస్థ'లో ఉంటూ స్వప్నావస్థలోకి వెళ్ళడం' అని".

అసలీ అవస్థల గోల ఏమిటీ?"

"వద్దు. తెలుసు కోవలసిన అవస రం లేదు, 'ఖచ్చితంగా తెలుసుకోవాలని' మీరు అనుకుంటే తప్పు".

అయితే ఈ కథ 'అవస్థా త్రయం' గురించి కాదు. జరిగిపోయినదాన్ని తలుచుకుంటూ భోరుమన్న ఓ భక్తుడి గురించి. గడియారం లోని 'పెండ్యులమ్' లాగా మనసు లోని ఆలోచనలు ఎప్పుడూ గతంలోకో, భవిష్యత్తులోకో పయనిస్తూ వుంటాయి. అదెప్పుడూ అటూ ఇటూ

వూగుతూనే ఉంటుంది కానీ, స్థిరంగా వుండదు. అంటే 'వర్తమానంలో స్థిరంగా వుండకుండా వర్తమాన స్థితిని విస్మరిస్తుంది. ( పనిలో వున్నప్పుడు, అనగా మనసుని పనిలో పెట్టినప్పటి సంగతి వేరు)

అసలీ విచారణ ఎందుకూ? ఓ మేధావి ఇలా అన్నారు... గతం హిస్టరీ... భవిష్యత్తు మిస్టరీ. వర్తమానం 'వర్దీ' (worthy) అని. అంటే వర్తమానం అనుభవించతగినదని. ఏమి అనుభవించాలీ? విచారాన్నా? దుఃఖాన్నా? అయోమయ స్థితినా? అసలు దేనికోసం వెతుకుతున్నామో కూడా తెలియని వెతుకులాటలోని అస్పష్టతనా? కాదు, అనుభవించాల్సింది ఆనందాన్ని! దాహంతో తపించేవారికి గుక్కెడు నీళ్ళు దొరికితే ఆనందం. నిద్రలేమితో బాధ పడేవారికి కాస్సేపు సుఖనిద్ర లభిస్తే ఆనందం. ఒంటిమీద బట్టలు లేనివాడికి ఒళ్ళు కప్పుకునే బట్ట లభిస్తే ఆనందం. ఎవరూ లేరని ఏడ్చేవాడికి ఓ కుక్క పిల్ల తోడు దొరికినా ఆనందమే. అయ్యా, దీనికోసం ఓ కథ చెప్పారు స్వామీజీ.

ఓ వీధిలో ఓ దొంగపిల్లి వుంది. అది ఎవరు ఏమాత్రం ఏమరుపాటుగా వున్నా దొరలా వచ్చి పాలు తాగిపోయేది. దొంగలా వచ్చి దొరలా పాలు తాగి పోవడం పిల్లికున్న సహజగుణం. పాలు తాగిపోవడం వల్ల మనుషులకు నష్టం కలిగే మాట వాస్తవమే. అయినా, పిల్లులు లేకపోతే ఎలుకలు భీకరంగా విజ్రుంభిస్తాయి. మనిషికి ఆహారం లేకుండా చేస్తాయనే విషయం కూడా నిజాతినిజమే కదా!

ఓ రోజున ఆ వీధి మొదట్లో ఒకడు భోరున ఏడుస్తున్నాడు.

"ఎందుకు నాయనా ఏడుస్తున్నావూ?" అనునయంగా అతన్ని అడిగాడు ఓ దారినపోయే దానయ్య.

"నిన్నటి పాలండీ... మరండీ... ఆ దొంగ పిల్లి తాగిపోయిందండీ ...." వెక్కుతూ అన్నాడు ఆ పిల్లి బాధితుడు.

"నిన్నటి పాలు పిల్లి తాగిపోతే ఇవ్వాళ ఎందుకూ ఏడవడం?" ఆశ్చర్యంగా అన్నాడు దా.దా.

"రూపాయి పెట్టి కొన్న పాలండీ మరి! అంత నష్టం కలిగితే ఏడుపు రాదాండీ?" కోపంగా అన్నాడా ఆ పి. బాధితుడు.

తెల్ల మొహం వేసిన దా.దా. ఇంకొంచెం ముందుకెళ్ళాడు. అక్కడ మరొకడు ఏడుస్తున్నాడు.

"ఎందుకయ్యా ఏడుస్తావ్?" అడిగాడు దా.దా.

రేపటి పాలు పిల్లి తాగిపోతుందని కలొచ్చిందండి. అది తాగిపోతే నాకు కాఫీ ఎట్టాగండీ? హొటేల్ కి వెళ్ళాలంటే మళ్ళీ డబ్బు ఖర్చవుతాది గదండీ ...!" జవాబు చెప్పి మళ్ళీ భోరుమన్నాడు రెండో పి. బాధితుడు.

"ఓర్నీ ఏడుపు కూలా... రేపటి సంగతి ఇవాళ ఎందుకురా!" ఆశ్చర్యంగా అన్నాడు దా.దా.

"ఇవాళ కూడబెట్టేది రేపటి కోసమే గదండీ...." మళ్ళీ భోరుమన్నాడు రెండో పి. బా.

"నీ ఖర్మ" ముందుకు సాగాడు దా. దా.

వీధి చివరన ఇంకోడు ఏడుస్తున్నాడు.

"నువ్వెందుకోయ్ ఏడ్చేదీ?" కుతూహలంగా అడిగాడు దా. దా.

ఒక్క క్షణం ఏడుపు ఆపి సుదీర్ఘంగా నిట్టూర్చాడు అతను. ఆ తర్వాత, "అయ్యా ఇంతకు ముందే ఓ రూపాయి పెట్టి పాలు కొనుక్కొచ్చా. మా వీధిలో ఓ దొంగ పిల్లి వుంది. అదొచ్చి యీ పాలు తాగిపోతుందనే బాధతో ఏడుస్తున్నాను" వివరంగా చెప్పాడతను.

"పాలు కాచి, కాస్త చల్లారాక దానిమీద ఓ గట్టి మూత పెట్టొచ్చుగా?"

"అయ్యా, మూతలు పిల్లికి అడ్డంటండీ? ఒక్క దెబ్బకి ఎగరగొట్టదూ?"

"పోనీ ఓ ఉట్టి కట్టి అందులో పెట్టొచ్చుగా?"

"పిల్లులకి ఉట్టి ఓ లెక్కటండీ? తన్ని కిందపడేసి, కింద పడ్డ పాలన్నీ క్షణంలో నాకెయ్యదూ?"

"పోనీ తాగేయ్" "తాగేస్తే సాయంత్రం టీ మాటేంటండీ?"

(31 వ పేజీ చూడండి)

# వేమూరి వేంకటేశ్వరరావు



## లెక్కకు అందని కాలమానం

హిందూ పురాణాలలో (ముఖ్యంగా, విష్ణు పురాణంలో) కాలమానం ఈ దిగువ చూపిన విధంగా వర్ణించేరు. ఈ వర్ణన నేను సంప్రదించిన అన్ని గ్రంధాలలోనూ ఒకేలా లేదు. కాని, స్థూలంగా కథ ఈ దిగువ చూపిన విధంగా ఉంటుంది. ఈ దిగువ చూపిన కాలమానం నిజమా కాదా అన్న వివేచన ఇక్కడ అప్రస్తుతం. అలాగే ఈ కాల మానానికి అంతర్గత అనుగుణ్యత ఉన్నదా, లేదా అన్నది కూడా ఇక్కడ అప్రస్తుతం. ఇంత విస్తృతమైన నమూనా మన పూర్వులు నిర్మించేరంటే అది వారి ఊహాశక్తికి ఒక అపురూపమైన నిదర్శనం.

ఈ కింది లెక్క చూస్తూ ఉంటే మరొక విషయం కొట్టొచ్చినట్లు కనబడుతుంది. యుగాల, మహాయుగాల, మన్వంతరాల, సంధ్యకాలాల పొడుగులు, బ్రహ్మ ఆయుర్దాయం, మొదలైన సంఖ్యలు – అన్నీ - 432 అనే సంఖ్య చుట్టూ పరిభ్రమించే విధంగా కిట్టించినట్టు కనబడుతుంది. ఉదాహరణకి మన భూలోకంలో ఒక సంవత్సరం పొడుగు ఇదమిత్థంగా "ఇంత" అని చెప్పలేము; ఏదో ఉరమరగా 365.242199 రోజులు అని సర్దుకుపోతున్నాం. కాని ఈ దిగువ లెక్కలో సంవత్సరం పొడుగు 360 రోజులు అని సౌలభ్యం కొరకు వాడబడింది. ఈ 360 ఇక్కడ వాడకపోతే తరువాత ఆ 432 రాదు. అలాగే మానవుని ఆయుర్దాయం 100 మానవ సంవత్సరాలు అనీ, బ్రహ్మ ఆయుర్దాయం 100 "బ్రహ్మ సంవత్సరాలు" అనీ అనటం లో శాస్త్రీయత లేదు. కనుక ఈ దిగువ చూపిన లెక్కలని ఓ గుటికెడు కషాయంతో సేవించండి. మచ్చుకి ఈ కింది లెక్కచూడండి.. మన భూలోకంలో -

4,32,000 సంవత్సరములు = కలియుగం

8,64,000 సంవత్సరములు = ద్వాపర్యుగం

12,96,000 సంవత్సరములు = త్రేతాయుగం

17,28,000 సంవత్సరములు = కృతయుగం

ఈ 432 ఎక్కడనుండి వచ్చిందని అడగకండి. అదొక పెడదారి పట్టిస్తుంది.

ఈ నాలుగు యుగాల కాలాన్ని కూడితే 43,20,000 సంవత్సరాలు వస్తాయి. దీనిని ఒక మహాయుగం అంటారు.

1 మహాయుగం = 43,20,000 సంవత్సరములు = 4.32 మిలియను సంవత్సరములు

1 మన్వంతరం = 71 మహాయుగాలు = 4.32 *71 = 306.72 మిలియను సంవత్సరాలు (ఇక్కడ నక్షత్రం గుర్తు గుణకారానికి వాడేను.) ఇక్కడ 71 ఎక్కడ నుండి వచ్చిందని అడగకండి. ఇలాంటి మన్వంతరాలు 14 ఉన్నాయిట. (ఈ 71 అనే సంఖ్య 14 అనే సంఖ్య ఎక్కడినుండి ఊడిపడ్డాయో తెలుసుకోవాలంటే ఈ దిగువ ఇచ్చిన లెక్కని జాగ్రత్తగా చూడాలి.)

ప్రతి మన్వంతరం ప్రారంభంలోనూ, అంతంలోనూ కృతయుగపు ప్రమాణంలో ఒక సంధి కాలం (లేదా, సంధ్యా కాలం) ఉందని ఊహించుకుంటే ఒక కల్పం పొడుగు తెలుస్తుంది.

1 కల్పం = 14 మన్వంతరాలు + 15 సంధి కాలాలు = బ్రహ్మకి ఒక పగలు

1 బ్రహ్మ పగలు = 1 కల్పం = 306.72*14 + 1.728*15 = 4294.08 + 25.92 = 4,320 మిలియను సంవత్సరాలు = 4.32 బిలియను సంవత్సరాలు. చూశారా, ఈ 432 అనే సంఖ్య కోసం ఎంత తంటాలు పడ్డారో. ఈ 432 కి వేద కాలం నుండీ ఒక ప్రత్యేకత ఉంది.

మరొక విషయం ఏమిటంటే, ఆధునిక శాస్త్రం ప్రకారం భూమి పుట్టి దరిదాపు 4 బిలియను సంవత్సరాలు పైబడి అయింది, ఇది కేవలం కాకతాళీయం అని మనం ఎంత అనుకున్నా, పురాణాలలో ఉన్న లెక్కకీ, మన ఆధునిక లెక్కకీ ఉన్న తుల్యత కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఏది ఏమైతేనేమి – ఇటుపైన చెప్పే లెక్క అన్ని చోట్లా ఒకేలా కనిపించటం లేదు. చిన్న చిన్న తేడాలని విస్మరించి, లెక్కని స్థూలంగా చూద్దాం.
1 బ్రహ్మ రాత్రి = 1 కల్పం = 306.72*14 + 1.728*15 = 4294.08 + 25.92 = 4,320 మిలియను సంవత్సరాలు = 4.32 బిలియను సంవత్సరాలు
బ్రహ్మకి ఒక దినం = 1 పగలు + 1 రాత్రి = 8.640 బిలియను భూలోక సంవత్సరాలు.
బ్రహ్మ ఆయుర్దాయం 100 బ్రహ్మ దినాలా, 100 బ్రహ్మ సంవత్సరాలా అన్నది ఒకొక్క చోట ఒక్కోలా ఉంది. మనం బ్రహ్మ ఆయుర్దాయం 100 బ్రహ్మ దినాలు అనుకుందాం.
బ్రహ్మ ఆయుర్దాయం = 100 బ్రహ్మ దినాలు = 100 * 8.640 బిలియను భూలోక సంవత్సరాలు = 864 బిలియను భూలోక సంవత్సరాలు = 1 పర (అనగా, బ్రహ్మ దినం అన్న బ్రహ్మ సంవత్సరం అన్న ఒక్కటే!)

సృష్టి మొదలయిన దగ్గరనుండి ఇప్పటికి ఆరుగురు బ్రహ్మలు గతించేరు. గతించిన బ్రహ్మల పేర్లు: మానస, చాక్షుష, వాచిక, శ్రావణ, సత్య, అండజ. ఇప్పుడు ఏడవ బ్రహ్మ అయిన పద్మజుని కాలంలో ఉన్నాం. ఈయన వయస్సు 51 సంవత్సరాలు (దినాలు). ఇందులో ప్రథమ కల్పమైన శ్వేతవరాహ కల్పంలో ఉన్నాం. మన సంవత్సరాలకి ప్రభవ, విభవ, శుక్ల మొదలైనవి 60 పేర్లు ఉన్నట్లే, ఈ కల్పాలకి 30 పేర్లు ఉన్నాయిట. ఆవి ఇక్కడ ఏకరవు పెట్టవలసిన అవసరం లేదు. కుతూహలం ఉన్నవాళ్లకి ఈ పేర్లు పురాణాలలో దొరుకుతాయి. ఉదాహరణకి కప్పగంతుల సుబ్బరాయశర్మ, కాలచక్రం, చూడండి. http://www.samputi.com/app_data/magazines/samputi12.pdf

ఇప్పుడు మనం ఈ శ్వేతవరాహ కల్పంలో వచ్చే 14 మన్వంతరాలలో ఏడవ మన్వంతరం అయిన వైవస్వత మన్వంతరంలో ఉన్నాం. సరదా ఉన్న వాళ్లకి ఈ 14 మన్వంతరాల పేర్లు ఇక్కడ ఇస్తున్నాను: స్వాయంభువ, స్వారోచిష, ఉత్తమ, తామస, రైవత, చాక్షుస, వైవశ్వత, సూర్యసావర్ణి, బ్రహ్మసావర్ణి, ధర్మసావర్ణి, రుద్రసావర్ణి, రౌచ్య, మరియు బౌచ్య. (అల్లసాని పెద్దన రాసిన మనుచరిత్ర పై జాబితాలో రెండవ మనువైన స్వారోచిష మనువు గురించి అనుకుంటాను.)


ఈ వైవస్వత మన్వంతరంలో 27 మహాయుగాలు గడిచి, ఇప్పుడు 28 వ మహాయుగంలో ఉన్నాం. ఈ 28 వ మహాయుగంలో కృత, త్రేత, ద్వాపర్ యుగాలు గడచిపోయేయి. కలియుగం ప్రవేశించి 5111 సంవత్సరాలు (ఇది రాసిన తేదీ సా. శ. 2010).

ఇంతవరకు కాలనిర్ణయం గురించి మాట్లాడుకున్నాం. ఇప్పుడు స్థల నిర్ణయం ఎలా జరుగుతుందో చూద్దాం.

పరిపాలనా సౌలభ్యం కొరకు మనువులు భూమిని 7 భాగాలుగా విభజించి పాలించేరు. ఆ ఏడు భాగాల పేర్లు ఇవి: జంబూద్వీపం, ప్లక్షద్వీపం, క్రౌంచద్వీపం, శాల్మిక ద్వీపం, పుష్కరద్వీపం, శాకద్వీపం. (ఈ ఏడు ద్వీపాలనీ ఏడు ఖండాలుగా మనం ఊహించుకోవచ్చు: ఆఫ్రికా, ఐరోపా, ఆస్ట్రేలియా, ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా, ఆసియా (ఇండియా ఉపఖండాన్ని మినహాయించి),

మరియు ఇండియా ఉపఖండం. ఆధునిక భారత దేశం జంబూద్వీపంలో ఉంది. ఈ జంబూ ద్వీపానికి అధిపతి పేరు నాభి. ఈ నాభికి మేరూదేవి యందు ఋషభుడు కలిగేడు. ఈ ఋషభుడుకి 100 మంది సంతానం. వీరిలో పెద్దవాడు భరతుడు. ఈ భరతుడు పాలించిన ప్రాంతమే భరతవర్షం. సముద్రానికి ఉత్తరమున, హిమాలయాలకి దక్షిణమున ఉన్న ప్రాంతమే భరతవర్షం. ఆధునిక పరిభాషలో చెప్పుకోవాలంటే ఇండియన్ సబ్‌కాంటినెంట్. కనుక మనం పూజ చేసేటప్పుడు దేవుడికి మన చిరునామా నిర్ద్వంద్వంగా చెబితే ఆయన మనం కోరిన కోరికలని మన చిరునామాకి పంపుతాడు. అందుకనే..."అద్యబ్రహ్మణః, ద్వితీయపరార్థే, శ్వేతవరాహకల్పే, వైవశ్వత మన్వంతరే, కలియుగే, ప్రథమపాదే, జంబూద్వీపే, భరతవర్షే, భరతఖండే. అంటూ మనం ఉన్న కాలాన్ని, స్థలాన్ని చెప్పి అంతటితో ఊరుకోము. ఆ తరువాత మనం ఆ పూజ ఎప్పుడు చేస్తున్నామో కూడ "వేళ" చెప్పటానికి "అస్మిన్ వర్తమాన వ్యావహారిక చాంద్రమానేన (...సంవత్సరే, ....ఆయనే, ....ఋతౌ, ....మాసే,.....పక్షే, ....తిథౌ,..., అంటూ కాలనిర్ణయం చేస్తాం.

ఇక్కడ గమనించవలసిన విషయం ఏమిటంటే



మన ఉనికిని చెప్పటానికి ఒక్క స్థల నిర్ణయం చేస్తే సరిపోదు, కాల నిర్ణయం కూడా చెయ్యాలని వేదకాలం నుండీ మనవాళ్లు గమనించేరు. ఇదే విషయాన్ని ఇరవైయ్యవ శతాబ్దపు ఆరంభంలో అయిన్‌స్టయిన్ వచ్చి, సాపేక్ష సిద్ధాంతాన్ని ప్రవచించి, స్థల-కాల సమవాయం (space-time continuum) అనే భావన ప్రవేశపెట్టి, "ఈ విశ్వం చతుర్ మితీయం – అనగా, ఈ విశ్వం నాలుగు దిశలలో వ్యాపించి ఉంది" అని ఉటంకించేసరికి, "ఔరా! ఇదంతా మా పురాణాల్లో ఉందిస్మీ!" అని ఇప్పుడు అనుకుంటున్నాం.

మనవాళ్లు మరొక అడుగు ముందుకు వేసి, స్థలం, కాలం చెప్పినంత మాత్రాన్న సరిపోదు, మన ప్రవర కూడ చెప్పాలి అన్నారు. ఒక వంశవృక్షంలో ఉత్తమోత్తమమైన పూర్వుల పేర్లు చెప్పి, వారి వంశం వాడిని అని చెప్పటాన్ని "ప్రవర" చెప్పటం అంటారు. ఎవరికి తోచిన "పూర్వుల పేర్లు" వారు చెప్పకుండా ఒకే వంశంలో ఉన్నవారంతా ఒకే "పూర్వుల సమితిని" చెప్పటం ఆనవాయితీ. ఉదాహరణకి రామ శర్మ అనే వ్యక్తి ప్రవర చెబితే ఇలా ఉండొచ్చు: "చతుస్సాగర పర్యంతం గోబ్రాహ్మణేభ్యః శుభం భవతు ఆంగీరస భారద్వాజ గార్గ్య శైన్య త్రయాఋషయోః ప్రవరాన్విత గర్గ్య భారద్వాజ గోత్రః ఆపస్తంబ సూత్రః తైత్రీయ కృష్ణ యజుః శాఖాధాయి శ్రీ రామ శర్మః అహం భో అభివాదయే"

అభివాదం అంటే నమ్రతతో పూర్వులకి నమస్కరించటం. ఈ ప్రవర చెప్పేటప్పుడు ఒక్క గోత్రాన్నే కాకుండా, ఆ వ్యక్తి కుటుంబం యొక్క "సూత్రం" ఏమిటో, "వేదం" ఏమిటో, చెప్పి అప్పుడు పేరు చెబుతారు. అంటే మనం ఎవ్వరమో చెప్పాలంటే మనం ఉన్న స్థలం, కాలం, ప్రవర చెప్పాలన్నమాట. స్థలానికి అక్షాంశం, రేఖాంశం, ఎత్తు అనే మూడు అంశాలు, కాలానికి ఒక అంశం, ప్రవరకి గోత్రం, సూత్రం, వేదం, నామధేయం అనే నాలుగు అంశాలు, వెరసి ఎనిమిది చెప్పాలి. ఈ ఎనిమిదింటిని ఎనిమిది నిరూపకాలు (coordinates) గా ఉపయోగించి నివేదించినప్పుడు ఆ అష్టమితీయ స్థలంలో (8-dimensional space) లో మన ఉనికి ఒక బిందువు అవుతుంది.

# తోటకూర ప్రసాద్



## ఉన్న అమెరికా పౌరసత్వాన్ని వదులుకోవడం ఎలా?

అమెరికా పౌరసత్వం పొందిన వివిధ దేశస్థులు ప్రతి సంవత్సరం ఏవో కొన్ని కారణాల వల్ల తాము పొందిన అమెరికా దేశపు పౌరసత్వాన్ని వదులుకుంటారు. ముఖ్యంగా 2010లో అమెరికా ప్రభుత్వం చేసిన 'ఫారిన్ అకౌంట్ టాక్స్ కంప్లియన్స్ యాక్ట్' చట్టం వల్ల ఈ సంఖ్య విపరీతంగా పెరుగుతూ వచ్చింది. ఉదాహరణకు 1998 లో కేవలం 398 మంది మాత్రమే తాము పొందిన అమెరికా పౌరసత్వాన్ని వదులుకోగా, 2017 నాటికి 6,800 మంది అమెరికా పౌరసత్వాన్ని వదులుకున్నారు.

అమెరికా పౌరసత్వాన్ని వదులుకోవడం ద్వారా అమెరికా దేశపు పౌరుడుగా ఈ క్రింద పొందే ప్రయోజనాలను కోల్పోతారని గమనించాలి. అందువల్ల అమెరికా పౌరసత్వాన్ని వదులుకునే ముందు ఆలోచించి తగు నిర్ణయం తీసుకోవాలి.

* అమెరికా దేశపు పౌరునిగా అమెరికాలో జరిగే చట్టసభ ఎన్నికల్లో ఓటు వేయవచ్చు, అలాగే అమెరికా దేశ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు తప్ప దేనికైనా పోటీ చేయవచ్చు. (ఈ రెండు పదవులకు పోటీ చేయాలంటే అమెరికా దేశంలో పుట్టిన పౌరులై ఉండాలి).
* అమెరికా కేంద్ర ప్రభుత్వ సంబంధిత సంస్థల్లో ఏ ఉద్యోగం చేయడానికైనా అర్హులు.
* అమెరికా పౌరసత్వం కలిగి ఉండి ప్రపంచంలో ఎక్కడ స్థిర నివాసం ఏర్పరచుకున్నా,అమెరికా దేశం నుండి తమకు రావలసిన పెన్షన్ మరియు సోషల్ సెక్యూరిటీ ప్రయోజనాలను పొందవచ్చు. ఎక్కడ ఉన్నా ప్రతి సంవత్సరం ఆదాయపు పన్ను విధిగా చెల్లించవలసి ఉంటుంది.
* ఏ విద్యా సంస్థల్లో చదువుతున్నా, ఆ విద్యా సంబంధిత ఖర్చులకై కేంద్ర ప్రభుత్వం నుండి ధన సహాయం పొందే ప్రక్రియలో ప్రాధాన్యత పొందవచ్చు.

కొన్ని పరిమితులు:

భారతీయ మూలాలు కల్గి ఉండి అమెరికా పౌరసత్వం పొందిన వారు భారతదేశంలో –

* భారతదేశపు ప్రజాస్వామ్య ఎన్నికల్లో పాల్గొనడం కాని, ఏ పదవికి పోటీ చేయడానికి కాని అర్హులు కారు.
* భారత ప్రభుత్వ సంబంధిత ఉద్యోగాలు చేపట్టకూడదు. కాని ప్రత్యేక పరిస్థితుల్లో కొంత నిర్ణీత సమయానికి ప్రభుత్వ సలహాదారుగా పని చేయవచ్చు. అయితే జీతభత్యాలు, ఒనగూరే ప్రయోజనాలు మొదలైన వాటిని పారదర్శకంగా పేర్కొనాలి. పెన్షన్ లేదా ఇతర ప్రయోజనాలు తీసుకోవడానికి అర్హులు కారు.
* న్యాయస్థానాల్లో ఎటువంటి పదవులు చేపట్టడానికి అర్హులు కారు.
* వ్యవసాయ భూములు కొనడానికి అర్హత లేదు.
* భారతదేశంలో ఏ అంశాల మీదా పరిశోధనలు చేయకూడదు.

భారతదేశంలో నివశిస్తున్నప్పుడు తాము అమెరికా పౌరసత్వం కలిగి ఉన్నవారమని ఏ పోలీసు శాఖకు గాని, ఇతర విదేశీ సంస్థలకు గాని తెలియజేయవలసిన అవసరం లేదు.

అమెరికా పౌరసత్వం వదులుకోవడంలో ఉన్న విధివిధానాలు:

అమెరికాలో జన్మించిన పిల్లలకు – అప్రయత్నంగా అమెరికా పౌరసత్వం లభించే అవకాశం ఉన్నప్పటికీ, తల్లిదండ్రులు ఆ పిల్లలకు అమెరికా పౌరసత్వానికి బదులుగా భారత పౌరసత్వం ఎంచుకొనే అవకాశంఉంటుంది. ఉదాహరణకు - దంపతుల్లో, ఇరువురికీ కానీ లేదా వారిలో ఒక్కరికి కాని భారతీయ పౌరసత్వం ఉండి, వారికి అమెరికాలో పిల్లలు జన్మిస్తే ...

* జన్మించిన శిశువు ఒక సంవత్సరం లోపు వయస్సు కలిగిఉండి, ఏ దేశానికీ సంబంధించిన పాస్ పోర్ట్ లేకుంటే ఆ శిశువు భారత పౌరసత్వం పొందడానికి అర్హత ఉంటుంది.

* (పుట్టిన శిశువుకు ఒక సంవత్సరం వయస్సు దాటితే, ఆ శిశువు కు భారత పౌరసత్వం పొందటా నికై భారత ప్రభుత్వంనుండి ప్రత్యేక అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.)

అమెరికాలో పుట్టిన పిల్లలకు భారత పౌరసత్వం పొందటానికై ఈ క్రింది వివరాలతో కూడిన దరఖాస్తును అమెరికాలో ఉన్న భారత కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవలసింటుంది.

i. "Registration of Birth Application" తో పాటు Miscellaneous application form కూడా కొన్ని సందర్భాల్లో అమెరికాలో ఉన్న భారత కాన్సులేట్ కార్యాలయానికి పంపవలసి ఉంటుంది.

ii. ఈ దరఖాస్తులతో పాటు క్రింద పేర్కొన్న వాటిని కూడా పంపవలసి ఉంటుంది:

* తల్లిదండ్రుల పాస్ పోర్టులు అసలు మరియు జిరాక్స్ కాపీలు

* తల్లిదండ్రులకున్న వీసా లేదా గ్రీన్ కార్డు జిరాక్స్ కాపీలు

* జన్మించిన శిశువుకు ఏ దేశానికీ సంబందించిన పాస్ పోర్టు లేదని, ఆ శిశువు 18 సంవత్సరాల వయస్సు వచ్చే వరకు భారత పాస్ పోర్టు తప్ప ఏ ఇతర దేశపు పాస్ పోర్టు కలిగి ఉండదని హామీ ఇస్తూ తల్లిదండ్రులు నోట రైజ్ చేసిన పత్రం

* అమెరికా ప్రభుత్వ అధికారులు జారీ చేసిన జనన ధృవీకరణ పత్రం

* 27 డాలర్ల విలువైన మనీ ఆర్డర్ లేదా కాషియర్ చెక్ ను భారత కాన్సులేట్ కార్యాలయా నికి పంపవలసి ఉంటుంది.

* భారత కాన్సులేట్ అధికారుల నుండి తిరుగు టపాలో శిశువు యొక్క భారత పాస్ పోర్ట్ పొంద టానికై 20 డాలర్ల మనీ ఆర్డర్ లేదా క్యాషియర్ చెక్ ను పంపవలసి ఉంటుంది.

అమెరికా దేశంలో పుట్టిన పిల్లలకు అమెరికా పౌరసత్వం ఉంటే ఆ పిల్లలు 14 సంవత్సరాల వయస్సు దాటేవరకు అమెరికా పౌరసత్వాన్ని వదులుకోవడానికి వీలు లేదు.

అమెరికా పౌరసత్వం ఉన్న వారెవరైనా 14 సంవత్సరాల వయస్సు దాటిన తరువాత అమెరికా పౌరసత్వం వదులుకోవాలంటే -- ముందుగా భారత పాస్ పోర్టుకు దరఖాస్తు చేసుకొని, ఆ భారత పాస్ పోర్టు పొంది ఉండాలి.

1. భారత పాస్ పోర్టు పొందటానికి అర్హతలు:

పిఐఓ (పర్సన్ ఆఫ్ ఇండియన్ ఆరిజిన్) కార్డు కల్గిన వారైతే –

* వారు గత ఏడు సంవత్సరాలుగా భారతదేశంలో నివసించి ఉండాలి.

* ఈ ఏడు సంవత్సరాల కాలంలో దరఖాస్తుదారుడు దరఖాస్తు చేసుకొనే నాటికి కనీసం ఒక సంవత్సరం పాటు నిరాటంకంగా భారతదేశంలో నివసించి ఉండాలి

ఓసిఐ (ఓవర్ సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా) కలిగిన వారైతే –

* భారత పాస్ పోర్టు దరఖాస్తు చేసుకొనే నాటికి ఓసిఐ కార్డు పొంది 5 సంవత్సరాల కాలం గడిచి ఉండాలి.

* దరఖాస్తుదారులు దరఖాస్తుచేసుకొనే నాటికి కనీసం 1 సంవత్సరం పాటు నిరాటంకంగా భారతదేశంలో నివసించి ఉండాలి.

2. అమెరికా పౌరసత్వం వదులుకునే ప్రక్రియలో దరఖాస్తు చేసుకోవడానికి ఈ క్రింది సమాచారంతో సిద్ధంగా ఉండాలి—

* భారతదేశంలోని ప్రస్తుత చిరునామా, ఫోన్, ఈమెయిల్ అడ్రస్

( 25 వ పేజీ చూడండి )

# పమ్మి భారతీ శర్మ



## వేసవి విడిది

వసుంధర గారి ఆలోచన ప్రకారం కొడుకులు ఆన్ లైన్ లో ప్రకటన ఇచ్చారు.

పెద్దల కొరకు ఇలా:

వేసవిలో సరదాగా... కొత్త ఊరగాయల రుచి చూస్తూ, మామిడి పళ్ళను ఆస్వాదిస్తూ, మల్లెల పరిమళాలతో ఆరుబయట పక్కలతో వీధి సినిమాలను గుర్తు చేసుకుంటూ ... పల్లెల్లో ఉన్నట్టే ఆనందంగా గడపాలనే బామ్మలకు ... అమెరికాలో ఉన్న పిల్లలు, మనుమలు వేసవికాలం శెలవులకు రావడం కుదరదని, వెలితిగా ఉందని, కలత చెందే అమ్మమ్మలూ... కొత్త బంధాలను పెంచుకునే చక్కని అవకాశం! రండి, మాతో మా 'వేసవి విడిది'లో సేద తీరండి.... కొత్త సంబంధాలకు, అనుబంధాలకు పెన్నిధి మా విడిది...

పిల్లలూ... ఈ ఆహ్వానం మీకోసం:

'ఇద్దరివి బిజీ ఉద్యోగాలే.. అన్ని శెలవులు దొరకవు, పెట్టడం కూడా కుదరని పరిస్థితి మాది... వేసవిలో బామ్మలతో కబుర్లు.. నూతిగట్టున స్నానాలు.. వైకుంఠ పాళీ ఆటలు, కమ్మని వేడి వేడి రుచులు గల వంటలు... అన్నీ మా పిల్లలు మిస్ అవుతున్నారు. ఫోన్లలోనే ప్రపంచాన్ని వెతుక్కుంటున్నారు. అసలు ఈ పిల్లలు నలుగురితో కలుస్తారా? మాలా ఎప్పుడూ ఈ వేసవి శెలవలు ఓ తియ్యని అనుభూతిని పిల్లలకు మిగిల్చే అవకాశం ఉందా! అని ఆలోచిస్తున్నారా? మీ పిల్లలకు ఆత్మీయత, అనురాగం, ఆనందం ఇవ్వాలనే మా ప్రయత్నం. రండి మా వేసవి విడిదికి మీ చిరునవ్వులతో కొత్త అందాన్ని తీసుకురండి' అంటూ పూర్తి వివరాలు, కట్టవలసిన రుసుము, సంప్రదించవలసిన నంబర్లు ప్రకటనలో పెట్టారు.

సిటీకి దూరంగా కొత్త కొత్త కాలనీలు ఏర్పడుతున్న ప్రాంతం వసుంధర గారిది. పిల్లలు అమెరికాలో ఉంటారు... భర్త రిటైర్ అయ్యాక వారి అభిరుచికి తగ్గట్టుగా 350 గజాలలో కట్టుకున్న విశాలమైన ఇల్లు. ఇంటి వెనుక వైపు పెద్ద దొడ్డి. అందులో నుయ్యి ఆ బావిలో ఏ ముహూర్తాన జల పడిందో, మండు వేసవిలో కల్పతరువులాగా ఆ చుట్టుపక్కలవారి దాహం కూడా తీరుస్తోంది. ఇంటి ముందు రకరకాల పూల మొక్కలు. ఇంటి వెనుక మామిడి, సపోటా, కొబ్బరి చెట్లు... ఉదయం, సాయంత్రం వేళల్లో కూర్చోటానికి అరుగులు. మామిడిచెట్టుకి ముచ్చటపడి ఉయ్యాల కూడా కట్టుకున్నారు. ఎప్పటికప్పుడు వేయించుకుంటున్న పెయింటింగ్ ల కారణంగా ఇల్లు కట్టి 10 సం||లు అవుతున్నా కొత్తగా కళకళలాడుతూ ఉంటుంది. పైన రెండు వాటాలుగా కట్టి అద్దెకిచ్చారు. 3 సం||ల క్రితం పైన రెండు వాటాలు ఒకేసారి ఖాళీ అవడంతో ఆ కాలనీ పిల్లలకు నృత్యం, సంగీతం నేర్పే టీచర్లను మాట్లాడి సమ్మర్ క్యాంప్ నిర్వహించి ఆ డబ్బుతో వారికి దగ్గరలో ఉన్న ఒల్డేజ్ హోమ్ కి కూలర్ కొనిచ్చారు. వసుంధరా గారి ఇల్లు లాగా ఆమె ఆలోచనలు కూడా బావుంటాయి. ఈసారి కూడా రెండు వాటాలు ఒకేసారి ఖాళీ అవడంతో, మళ్ళీ స్కూళ్ళు తెరిచేవరకూ ఎవరూ రాకపోవడంతో ఈ 'వేసవి విడిది' 'సమ్మర్ క్యాంప్ ఫర్ ఆల్' అనే ప్రకటన ఇప్పిం-

చారు. పై వాటాలను శుభ్రం చేయించి వట్టివేళ్ళ చాపలను కిటికీలకు కట్టి కూలర్లు అమర్చారు. ఆవిడ ఆలోచనలను ఆచరణలో పెట్టే క్రమంలో, తన సలహాలను, సహకారాన్నీ అందిస్తూ మురిసిపోతున్నారు ఆమె భర్త.

10 రోజుల వేసవి విడిదికి ముందుగా దరఖాస్తు చేసుకుని, రుసుము చెల్లించిన 12 మంది పిల్లలు, పెద్దలు కలిపి పైన వాటాలలో ఉండేలా వారికి సౌకర్యవంతంగా ఉండే ఏర్పాట్లు చేస్తూ ... ఆ పది రోజులూ వండబోయే వంటలూ, టిఫిన్లూ, ఆడించబోయే ఆటలూ, చూపించబోయే సినిమాలు, వినిపించబోయే పాటలు, చెప్పబోయే కథలు... కాస్త వెరైటీగా, అలాగే సాంప్రదాయాలను పిల్లలకు పరిచయం చేసేవిగా, కూతుళ్ళు, కొడుకుల ఇళ్లకే పరిమితమైన బామ్మలు ఉత్సాహంగా వేసవి విడిదికి రాబోతున్నారు కాబట్టి వారికి ఎప్పటికీ గుర్తుండే చక్కని జ్ఞాపకాలని ఇవ్వాలని ... చేయవలసిన పనులన్నీ ... ఓ జాబితాగా రాసిపెట్టుకున్నారామె.

అనుకున్న రోజు ఉదయాన్నే వేసవి విడిదిలోకి పిల్లలు, పెద్దలూ చేరుకున్నారు. మొదటగా పరిచయ కార్యక్రమాలు పూర్తి అయ్యాక... అందరినీ ఉద్దేశించి ... మనకు దొరికిన ఈ పది రోజులు ఆనందంగా ఎప్పటికీ గుర్తుండే విధంగా గడుపుదాం. ఇక్కడ ఫోన్లు వాడడం తగ్గించాలి.. జంక్ ఫుడ్ దొరకదు... అర్ధరాత్రులు పడుకోవడం ... మిట్టమధ్యాహ్నం లేవడం కుదరదు...అర్ధమయ్యిందా పిల్లలూ... అంటూనే భోజనాలు ఏర్పాటు చేసారు. మామిడికాయ పప్పు, కొత్త ఆవకాయ, గుమ్మడి వడియాలు, దుంపల వేపుడు, పాయసం, అంటా కడుపు నిండా తిని విశ్రాంతి తీసుకున్నారు. ఇక అది మొదలు వసుంధర గారింట్లో సందడే సందడి. మొదట కొత్తగా, బెరుగ్గా ఉన్న పెద్దవాళ్ళు... వంటల్లో, పనుల్లో వసుంధర గారికి సహాయం చెయ్యడం... పిల్లలు ఉదయాన్నే లేచి నూతిగట్ల చుట్టుపక్కల, మొక్కల మధ్య కబుర్లు, ఆటలు..ఆ ఉదయపు మీటింగులు, పిల్లలకు ఆసక్తిగా ఉంది, బద్ధకం లేకుండా లేచేవారు. ప్రతి పనీ ఓ నిర్దుష్టమైన సమయంలో చెయ్యాలని చెపుతూనే వసుంధర గారు.. ఓ టైం ప్రకారం ... భోజనాలు... ఆటలు... స్నానాలు.. అన్నీ చక్కగా జరిగేలా చూసేవారు. కొత్త అమ్మమ్మలు చిన్ని మనవలతో ఆనందంగా గడుపుతున్నారు. మేడపైన తెర కట్టి, పిల్లలు తెచ్చిన ప్రొజెక్టర్ లో బాలభారతం, మాయాబజార్, మరో రెండు పిల్లలకు నచ్చే ఇంగ్లీష్ సినిమాలు చూపించారు. పూర్వం వీధి సినిమాలకు వెళ్ళిన అనుభూతి పెద్దలకు కలిగింది. చాపల మీద కూర్చుని .... బొమ్మలతో.. మామిడి ముక్కలు... పుచ్చకాయ ముక్కలు తింటూ పిల్లలు అలా సినిమా చూడడం చాలా బాగా ఎంజాయ్ చేస్తున్నారు.

ఈ పదిరోజులూ బామ్మల పాటలూ, కళ్ళగంతలాటలూ, చింత గింజలు, గవ్వలు, వైకుంఠ పాళీ, కాశీమజిలీ కథలు, పొడుపు కథలు, సామెతలు. ఒకటా రెండా ఎన్నో ఆనందాలు ఆ ఇంట్లో ... కొత్త పాటలకి పిల్లలు చేసే డాన్సులకు మురిసిపోతున్నారు బామ్మలు. ఎవ్వరూ అక్కడికి మొదటిసారి వచ్చి అందరినీ కలిసాం అని అనుకోవడం లేదు. వసుంధరగారు కోరుకున్నదీ అదే!

అది సమ్మర్ క్యాంప్ లో ఆఖరి రోజు. మళ్ళీ ఈ బామ్మల్ని ఎలా కలుస్తాం అని పిల్లలు... మా ఫోన్ నెంబర్లు తీసుకోండి ... వీలు కుదిరినప్పుడు ఈ అమ్మమ్మలకు ఓసారి హలో చెప్పండి... అంటూ నెంబర్లు ఇచ్చి పుచ్చుకున్నారు. ఆ పెద్దవాళ్ళలో ఒకామె వసుంధరగారితో అన్నారు: 'సమ్మర్ క్యాంప్ అంటే పిల్లలు నీడ పట్టున ఉండి ఏదో ఒకటి నేర్చుకోవాలని ... ఏర్పాటు చేస్తారు... మాలాంటి పెద్దలకు ఓ మార్పు కావాలని .... ఏదైనా కొత్త సంగతులు నేర్చుకోవడానికి, అనుభూతులు, అనుబంధాలు పెంచుకోడానికి వయస్సుతో పనిలేదని, ఎంత బాగా ఆలోచించి మమ్మలనంద-

రినీ ఓచోట కలిపారు.. ఎప్పుడూ మీరు ఇలాంటి మంచి పనులు చేస్తూ ఉండాలి...మీ ఆలోచన ఉన్నతంగా ఉంది కాబట్టే మా ఆలోచనల్లో మార్పు వచ్చి ..... ఈ వసుధైక కుటుంబంలో అందరూ మనవాళ్ళే అన్న భావంతో... ఎక్కడో ఉన్న మనవల గురించి బెంగ పడకుండా, ఈ పిల్లల్లో మా పిల్లల్ని చూసుకుని మురిసిపోతున్నాము... ఇంత మంచి అనుభూతుల్ని ఇచ్చిన మీరు .... మా అందరికీ ఆత్మబంధువు.... ఏమంటారు పిల్లలూ?'..... పిల్లలంతా ఆనందంగా తప్పట్లు కొట్టారు.

'అయ్యో, నేను చేసిన దానికన్నా మీ సహకారం ఎక్కువే ఉంది. చాలు చాలు పొగడ్తలు.. పిల్లలూ కుండలో నీళ్ళు పెట్టండి.... భోజనాలకు ఏర్పాటు చేస్తాను' అంటూ లేచారావిడ.

సాయంకాలం పిల్లలకోసం తల్లితండ్రులు, పెద్దల కోసం పిల్లలు ఒక్కొక్కరుగా రావడం మొదలయ్యింది... పిల్లలు, పెద్దలు.. వేసవి విడిదిలో వాళ్ళ అనుభవాలను విని చాలా సంతోషపడ్డారు.... అందరూ పదేపదే వసుంధరగారికి కృతజ్ఞతలు చెప్పడంతో... వసుంధరగారు అన్నారు..ఇప్పుడు మనమంతా బంధువులం... స్నేహితులం.. మన మధ్య కృతజ్ఞతలు ఎందుకు... ఈ వేసవి మనందరినీ కలిపి వెన్నెల కురిపించింది.... ఈ పిల్లలు గాడ్జెట్ లకోసం, ఏ సి ల కోసం ఆలోచించకుండా మా అందరితో చక్కగా కలసిపోయారు.... ఇక ఈ బామ్మలకు ఏ నొప్పులూ గుర్తుకు రాలేదు... ఉత్సాహంగా పిల్లలతో సమానంగా ఆడిపాడారు... పిల్లలైతే మా అందరి మనస్సు గెలుచుకున్నారు... మీరు అనుకున్నట్టు వాళ్ళు టెక్నాలజీ ఉచ్చులో బిగుసుకుపోతున్నారు అనేది కొంతే వాస్తవం... వాళ్ళతో కాస్త ఎక్కువ సమయం గడపడం ద్వారా... ఈ ఉద్యోగాల రీత్యా, పని ఒత్తిళ్ళ మధ్య కష్టమే గానీ, అసాధ్యం కాదు గదా! కాస్త ప్రయత్నిస్తే ... మన పిల్లలు ఆణిముత్యాలు అని మీరే అంటారు... అసలు మన దగ్గర సమయం, ఓర్పు లేక ... ఈ గాడ్జెట్ లు, ఫాస్ట్ ఫుడ్ లు, మనమే పిల్లలకి అలవాటు చేస్తున్నాము.... తరవాత మనమే ఇరకాటంలో పడుతున్నాము. పాపం... ఈ పది రోజులు నా చేతి వంట తప్ప వేరే దారి లేదు వీళ్ళకి అంటూ నవ్వారామె. వసుంధర ఆంటీ సూపర్ గా వంట చేస్తారు... పెరుగు అన్నంలో ముక్కల పచ్చడి చాలా టేస్టీ టేస్టీ అందో అమ్మాయి సొట్ట బుగ్గలతో. ... అలా అందరూ వారి అనుభవాలు, అనుబంధాలు గుర్తు చేసుకుంటూ ... ఒకరిని ఒకరు విడవలేక ... వేసవి విడిదికి టాటా చెప్పి బయలుదేరారు.

'మా విడిది ఓ అందమైన జ్ఞాపకం... చక్కని అనుభూతి... మంచి పనులు చెయ్యాలనే ఆలోచన మనకున్నా సహకరించే కుటుంబం, సదా ఆశీర్వదించే దైవం, నాతో ఉన్నారు... భగవంతునికి అనేక కృతజ్ఞతలు... వచ్చిన సొమ్ములో సగం ... ముందుగా అనుకున్నట్టు అనాథ శరణాలయంలో రేపు ఉదయమే ఇచ్చి వస్తాను' అనుకుంటూ తృప్తికి నిద్రకి ఉపక్రమించారు వసుంధర గారు.....

భారతీ శర్మ


చైతన్యం సంకల్ప బలం

చందా రేట్లు

| | |
|---|---|
| విడిప్రతి | రూ. 20.00 |
| సంవత్సరానికి | రూ. 200.00 |
| పోస్ట్ ద్వారా | రూ. 230.00 |

Please deposit your subscription in favour of

CHAITANYAM SANKALPABALAM

A/c No. 1626201002070 - Canara Bank

Kundanbagh Branch, Hyderabad

చందాలు పంపాల్సిన చిరునామా:

Chaitanyam Sankalpabalam,
45058, Janapriya Utopia,
Hyderguda, Attapur
Hyderabad - 500 048

Email: teega51@gmail.com

Visit: www.chaitanyam.net

# పాలెపు బుచ్చిరాజు



## బొమ్మలు చెప్పిన బాలల కథలు

(గత సంచిక తరువాయి)



ఇంత అవమానం జరిగాక బ్రతకడం వ్యర్థం అని పద్మావతి ఆత్మ హత్య చేసుకోబోయింది. ఇంత అవమానం జరిగాక బ్రత-కడం వ్యర్థం అని పద్మావతి ఆత్మ హత్య చేసుకోబోయింది. కాని, వజ్రముకుటుడు తన అసలు రూపం ప్రదర్శించి, ఆమెను తన రాజ్యానికి తీసుకుపోయా-డు. తరవాత నాలుగు రోజుల్లో దంతఘట్టకుడూ, అతని భార్యా దు:ఖంతో చచ్చిపోయారు. మరి, ఆ పాపం కాశీరాజు కుమారుడిదా? లేక ఆ రాజుదా? నీ తెలివితేటలతో చెప్పాలి. సరైన సమాధానం ఎరిగి ఉండి చెప్పకపోయావో, నీ తల ఇప్పుడే పది ముక్కలైపోతుంది." అని ముగించాడు.

విక్రమార్కుడు కొంచెంసేపు ఆలోచించి ఇలా సమాధానం చెప్పాడు. " అందమైన యువతిని ప్రేమించి పెళ్లి చేసు-కోవడం రాజకుమారుడికి సహ-జమైన ధర్మం అతనికి సహాయం చేయడం మంత్రి కుమారుడి సేవాధర్మం. ఎటు చూసి ఎలా

ఆలోచించినా నిజానిజాలు తెలుసుకోకుండా శిక్ష విధించిన రాజదే పాపం అవుతుంది."

అది విని భేతాళుడు అతని తెలివితేటల్ని మెచ్చుకున్నాడు. మహారాజుకు మౌనభంగం అయింది కాబట్టి, భేతాళుడు మళ్లీ చెట్టెక్కి కూర్చున్నాడు.

పట్టువదలని విక్రమార్కుడు మళ్లీ చెట్టెక్కి భేతాళుడిని భుజాల మీద మోసుకుంటూ దిగి నడవసాగాడు. తిరిగి భేతాళుడు మరొక కథ చెప్పాడు. విక్రమార్కుడు సమాధానం చెప్పడానికి నోరు విప్పగానే అతడు వెళ్లి చెట్టెక్కాడు. ఈ విధంగా ఇరవై అయిదు సార్లు జరిగింది. భేతాళుడికి విక్రమార్కుడి పట్టుదలా, వివేకమూ చాలా నచ్చాయి. అందువల్ల అతనికి సహాయం చేయాలనే ఉద్దేశంతో అసలు రహస్యాన్ని ఇలా చెప్పాడు.

"రాజా! అక్కడున్నవాడు నిజమైన సన్యాసి కాదు. నువ్వు సర్వ లక్షణ సంపన్నుడవని తెలిసి, నిన్ను దేవికి బలి ఇవ్వాలని నిన్ను ఈ పనికి నియోగించాడు. ఇప్పుడు మనం అక్కడికి చేరగానే, వాడు నిన్ను దేవికి సాష్టాంగ ప్రణామం చేయమని చెప్పుతాడు. కాని నువ్వు మహారాజువు కనుక అదెలాగో నాకు తెలియదు . నువ్వు చేసి చూపించమని అడుగు. అతను సాష్టాంగ ప్రణామం చేయగానే అతని తల గుండంలోని నిప్పుల్లో పడేలా తెగ నరుకు. అలా చేయడం వల్ల నీకు సకల సిద్ధులూ లభిస్తాయి. "

నిజం చెప్పి తన ప్రాణం కాపాడినందుకు భేతాళుడికి కృతజ్ఞతలు చెప్పి, విక్రమార్కుడు దొంగ యోగిని చంపి తాను దేవి వరాలు పొందాడు. భేతాళుడు, "నీకెప్పుడు అవసరం



వచ్చినా నన్ను తలచుకుంటే, వచ్చి సహాయం చేస్తా"నని మాట ఇచ్చి, మాయమయ్యాడు. దేవతలు సంతోషంతో విక్రమార్కుడిని దీవించారు.

కనుక భోజరాజా! నీలో ఇంతటి సాహసమూ, సామర్థ్యమూ ఎక్కడిదయ్యా!" అని బొమ్మ తన కథని ముగించింది.

భోజుడు నిరాశతో వెనుదిరిగాడు.

ముప్పై రెండో బొమ్మ కథ

ఆఖరికి ఆఖరి బొమ్మ అయినా తన కోరిక తీర్చకపోతుందా అనే ఆశతో భోజరాజు, తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి ఆఖరి ప్రయత్నం కూడా చేశాడు. అప్పుడు ఆ చివరి బొమ్మ ముసిముసి నవ్వులతో రాజును చూస్తూ ఇలా అంది. " రాజా! నీకిది ఒక అలవాటుగా అయిపోయింది. విక్రమార్కుడితో సరితూగలేనని నీకు తెలుసు. అయినా నీ ప్రయత్నం మానలేదు. సరే! సాహసవీరుడు తన పరాక్రమంతో తన శాశనకాలాన్ని ఒక శకంగానే మార్చాడు. అతనిలాగ ధర్మ పరిపాలన చేయగల మహారాజు మరొకడు లేదు. ఆ కథలెన్నో నువ్వు ఇంతవరకు వింటూ వచ్చావు. ఈ సారి మా కథ నీకు వినిపిస్తాను విను. నీ దర్శన భాగ్యం వల్ల మాకు శాపవిమోచనం అయింది. "

అది విన్న భోజుడు మరింత ఆశ్చర్యపోయాడు. "నువ్వు చెప్పేది ఏమిటి? అసలు మీ కథ ఏమిటి? మీకు శాపం ఎవరు ఇచ్చారు? నా ద్వారా శాపవిమోచనం జరగడం ఏమిటి? కాస్త వివరంగా చెప్పు." అని అడిగాడు.

బొమ్మ తమ కథని ఇలా చెప్పింది.

"ఓ మహారాజా! మేము పూర్వజన్మలో పార్వతీదేవి సఖులము. ఒకనాడు మేమంతా తోటలో పువ్వులు కోస్తూ ఉండగా పరమేశ్వరుడు అక్కడికి వచ్చాడు. అప్పుడాయన సుందరమైన విగ్రహాన్ని చూసి మేము నిగ్రహాన్ని కోల్పోయాము. ఆయనపై మరులుగొని, ప్రతిమల్లా నిలబడి పోయాము. అది చూసి అర్థం చేసుకున్న పార్వతి మా మీద కోపంతో భూమి మీద చైతన్యంలేని బొమ్మలుగా పడి ఉండండి అని శపించింది.

జరిగిన తప్పు తెలుసుకుని, మేము ఆమె పాదాల మీద పడడి శాప విముక్తికి మార్గం చెప్పమని వేడుకున్నాము.

దేవి దయామయురాలు కాబట్టి, మమ్మల్ని అనుగ్రహించి, "మీరు బొమ్మలుగా ఉండగా ఒకానొక పుణ్యవర్తనుడు మీ వద్దకు వస్తాడు. అప్పుడు మీకు శాపవిమోచనం కలుగుతుంది." అని చెప్పింది.

అదిగో! ఆనాటినుంచీ, ఈ ఇంద్ర సింహాసనాన్ని ఆక్రమించి, దీనితోబాటుగా భూలోకంలో ఉండసాగాము. విక్రమార్కుడి గొప్పతనాన్ని లోకంలో చాటేందుకు నీకు ఈ కథలన్నీ వినిపించాము. నాపేరు శృంగారతిలక. ఇక మిగిలినవారి పేర్లు, వరసగా, జయ, విజయ, మలయవతి, ఆనంద సంజీవని, గంధర్వ సేన, ప్రభావతి, సుప్రభ, సంభోగ నిధి, సభద్ర, చంద్రిక, కురంగ నయన, అనంగ ధ్వజ, ఇందు వదన, విలాస రసిక, కోమలి, సౌందర్యవతి, లావణ్యవతి, లజ్జావతి, ఇందుమతి, జనమోహిని, విద్యాదరి, హరిమధ్య, సుఖప్రదాయిని, ప్రబోధవతి, మలయవతి, హంస గమన, అంగ సుందరి, సుకేశి, చతురిక, వామాంగి, తలోదరి, నీ దర్శనం వల్లమా కష్టాలు గట్టెక్కాయి. నీ కోరిక తీరుస్తాము కోరుకో!"

ఆ బొమ్మ చెప్పిన కథకి భోజరాజు చాలా ఆనందించి, ,"మీ దయవల్ల నాకు సకల భాగ్యాలు ఉన్నాయి. ఇంక నాకేమీ అక్కరలేదు. " అన్నాడు.

బొమ్మలు ఆ మాటలు విని , "మహారాజువైన నీకు కోరికలు లేకపోవడం సహజం. కాని మాకు ప్రాణప్రదానం చేసిన నీకు తిరిగి ఉపకారం చేయడం మా ధర్మం. కనుక, ఎటువంటి వారికైనా నిన్ను దర్శించుకున్నంతలో సరస్వతీ అనుగ్రహం కలిగేలా వరం ఇస్తున్నాము. అంతే కాక, ఈ కథలు చదివిన వారికీ, విన్న వారికీ, ఔదార్యం సాహసం వంటి మంచి గుణాలు అలవడుతాయి. " అని చెప్పి వారంతా ఆకాశమార్గంలో అదృశ్యమయ్యారు.

ఆలోచించిన కొద్దీ భోజరాజుకి తనకా సింహాసనం ఎక్కే అర్హత లేదేమోననే శంక కలిగింది. అందువల్ల ఆ ఆసనం మీద ఈశ్వరుడిని ప్రతిష్టించి, ఆ దేవుడిని పూజిస్తూ కలకాలం రాజ్యం ఏలాడు. అదీ కథ!

అని చెప్పగా పార్వతీదేవి, చాలా సంతోషించి, "నాథా! నా కోరిక నెరవేరింది. ఈ కథలు కలియుగపర్యంతం ప్రసిద్ధమౌతాయి." అని ఆశీర్వాదం పలికింది.

**అయిపోయింది.**

శ్రీ కొరవి గోపరాజు రచించిన కావ్యం, 'సింహాసన ద్వాత్రింశిక' ఆధారంగా, పాలెపు బుచ్చిరాజు బాలలకోసం, తేలికైన భాషలో రాసిన కథలు.

(36-శంఖేశ్వర సొసైటీ, మకర్ పురా రోడ్డు, వడోదరా, గుజరాతు. 390009)



# పోడూరి శ్రీనివాసరావు




## 'రజని' అనే బాలాంత్రపు రజనీకాంతరావు


ఫోన్: 98494 22239


బహుముఖ ప్రజ్ఞాశీలి, గాయకుడు, వాగ్గేయకారుడు, స్వరకర్త, .... లలితా సంగీతమంటే గుర్తుకు వచ్చే ప్రథమ వ్యక్తి.... శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావు గారి ఆకస్మిక మరణానికి నివాళి గా ఈ వ్యాసం....

************

తొలి తరం సంగీత దర్శకుల్లో ఒకరిగా, పాటల రచయితగా, వాటికి అందమైన బాణీలు కట్టి ఆలపించే గాయకునిగా, ఆకాశవాణి కేంద్రంలో స్వరకర్తగా, గీత రచయితగా, సంచాలకునిగా, పలు బాధ్యతలు నిర్వహించిన వ్యక్తిగా, మహోన్నతమూర్తిగా ముందు గుర్తుకు వచ్చేది శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావు గారే!

జనవరి 29, 1920 వ తేదీన పశ్చిమ గోదావరి జిల్లా లోని నిడదవోలు అనే గ్రామంలో, కవిరాజ హంస శ్రీ బాలాంత్రపు వేంకట్రావు గారు, శ్రీమతి వేంకట రమణమ్మ దంపతులకు శ్రీ రజనీకాంతరావు గారు జన్మించారు. శ్రీ బాలాంత్రపు నళినీ కాంతారావు గారు రజనీకాంతరావు గారి అన్నగారే. వీరి తండ్రి గారు సాహిత్య వినీలాకాశంలో ధ్రువతారగా వెలసిన జంటకవులుగా పేరు ప్రఖ్యాతులు గడించిన వేంకట పార్వతీశ కవుల్లో ఒకరైన, 'ఆంధ్ర ప్రచారిణీ గ్రంథమాల' నిర్వాహకులైన, కవి రాజహంస శ్రీ బాలాంత్రపు వేంకట్రావు గారు. తల్లిగారైన శ్రీమతి వేంకట రమణమ్మగారు కూడా గొప్ప సాహితీ సంస్కారం గల వ్యక్తి. ఇంటిలో ఎపుడూ సాహితీ సౌరభాలు వెల్లివిరుస్తూండేవి. ఎందరో సాహితీ ప్రముఖుల ఇష్టాగోష్ఠులతో, సంభాషణలతో, ఆ ఇంటి వాతావరణం సాహితీ గుబాళింపులు వెదజల్లుతుండేది. దానికి తోడు తండ్రిగారు నడిపే గ్రంథమాలకు వస్తూ పోతూ ఉండే శ్రీ టేకుమళ్ళ రాజగోపాలరావు, శ్రీ తెలికచెర్ల వేంకటరత్నం, శ్రీ చిలుకూరి నారాయణరావు, శ్రీ గంటి సోమయాజి వంటి పండితులతో, సాహితీ స్రష్టలతో కళకళ లాడుతుండేది.

శ్రీ రజనీకాంతరావు బాల్యం లో పిఠాపురంలో పెరిగారు. బంధువైన పులుగుర్త లక్ష్మీ నరసమాంబగారి దగ్గర భక్తి సంగీతం, మేనమామ శ్రీ దుగ్గిరాల పల్లంరాజు వద్ద శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నారు. కాకినాడ లోని పి.ఆర్. కళాశాలలో ఇంటర్ చదువుతూ శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నారు. 1937 నుంచి 1940 వరకు ఆంధ్రా యూనివర్సిటీలో ఎం.ఎ తెలుగు చదివారు. ప్రఖ్యాత కవి శ్రీ పింగళి లక్ష్మీకాంతం వీరికి గురువర్యులు. ప్రఖ్యాత కవి శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి వీరికి ఆత్మీయ మిత్రులు.

1941 లో ఆకాశవాణి మద్రాసు (చెన్నై) కేంద్రంలో ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్ గా చేరారు. 1966 లో పదోన్నతిపై పశ్చిమ బంగాల్ లోని కర్సియాంగ్ రేడియో స్టేషన్ కు అసిస్టెంట్ డైరెక్టర్ గా వెళ్ళారు. అటుపిమ్మట డిల్లీ లోని ట్రాన్స్క్రిప్షన్ సర్వీస్ లో చేరారు. అక్కడ నుండి 1970 లో అహ్మదాబాద్ రేడియో స్టేషన్ డైరెక్టర్ గా వెళ్ళారు. 1971 నుంచి 1976 వరకూ విజయవాడ స్టేషన్ డైరెక్టర్ పనిచేసిన ఆయన, 1976 నుంచి 1978 వరకూ బెంగళూరు

కేంద్రం డైరెక్టర్ గా పనిచేసి, 1978 జనవరి 31 న పదవీ విరమణ చేసారు. ఆ తరవాత తెలుగు విశ్వ విద్యాలయంలో గౌరవాచార్యులుగా పనిచేసారు. 1979 నుంచి 1982 వరకు తిరుమల తిరుపతి దేవస్థానం వారి శ్రీ వేంకటేశ్వర కళాపీఠం డైరెక్టర్ గా వ్యవహరించారు. 1982 నుంచి 1985 వరకు ఆకాశవాణి, దూరదర్శన్ లకు ఎమెరిటస్ ప్రొడ్యూసర్ గా వ్యవహరించారు.

**సంగీత ప్రస్థానంలో కొన్ని ప్రముఖ ఘట్టాలు:**

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అర్ధరాత్రి శ్రీ జవహర్ లాల్ చేసిన 'our tryst with destiny' ప్రసంగం తర్వాత శ్రీ రజనీకాంతరావు గారు రచించి, స్వరపరచిన 'మాదీ స్వతంత్ర దేశం' గీతం ప్రసారమైంది.

1972 లో రజనీకాంతరావు రచించి స్వరపరచిన 'కొండ నుండి కడలి దాకా' రూపకం అంతర్జాతీయ ఖ్యాతి గడించింది. దీనికి జపాన్ దేశం వారి 'నిప్పన్ హోసొక్యో కాయ్' బహుమతి లభించింది.

శ్రీ కృష్ణశాస్త్రి గారి 'అతిథిశాల' సంగీత రూపకానికి, పర్షియన్ సంగీతం ఆధారంగా కూర్చిన సంగీతానికి మంచి పేరు వచ్చింది.

1981 రూపకానికి బెంగళూరు ఆకాశవాణి కేంద్రంలో పనిచేస్తుండగా ఉత్తమ సంగీత రూపక బహుమతి లభించింది.

ఉషశ్రీ గారితో ధర్మసందేహాలు కార్యక్రమం ప్రారంభించారు. ఆకాశవాణిలో భక్తిరంజని ప్రారంభించారు.

మధుర గాయకుడు ఘంటసాలను ఆకాశవాణికి పరిచయం చేసింది శ్రీ రజనీకాంతరావు గారే.

శ్రీ రజనీ తెలుగు లలిత సంగీత వికాసానికి ఎనలేని సేవ చేసారు. ఎన్నో గేయనాటకాలు, సంగీత రూపకాలు, రజని రసమధురంగా రచించి, స్వరపరచారు. రేడియో కోసం రజని వందలాది గీతాలను రచించారు. ఇతర రచయితల గీతాలకు కూడా స్వర రచన చేసారు. బాలల కోసం జేజి మావయ్య పాటలు రచించారు.

స్వరకర్తగా, గేయరచయితగా, సినీ గాయకుడిగా శ్రీ రజనీకాంతరావు సుప్రసిద్ధుడు. స్వర్గసీమ, గృహప్రవేశం, మొదలగు చిత్రాలకు వారు పాడిన పాటలు, ప్రసిద్ధ బహుముఖ ప్రజ్ఞాశాలి శ్రీమతి భానుమతితో కలిసి పాడిన పాటలు చిత్రసీమలో ప్రాచుర్యం పొందాయి.

వీరి రచనలు కోకొల్లలు - సుమధురమైనవి, అత్యంత ప్రజాదరణ పొందినవి, అందులో ప్రముఖమైనవి:

* 200 పైగా గీతాలున్న 'శతపత్ర సుందరి' గీతసంపుటి.(దీనికి 1953 లో తెలుగు భాషా సమితి పురస్కారం లభించింది)

* 1964 లో ప్రచురమైన 'విశ్వవీణ' రేడియో నాటకాల సంకలనం.

* 'ఆంధ్ర వాగ్గేయకారుల చరిత్ర' అనే పరిశోధనా గ్రంథం. దీనికి 1958 లో తెలుగు భాషా సమితి పోటీలలో బహుమతి లభించింది.

* తండ్రిగారి ఏకాంతసేవకు ఆంగ్లంలో అనువాదం Alone with spouse divine'

* క్షేత్రయ్య పదాలకు ఆంగ్లానువాదం - కేంద్ర సాహిత్య అకాడమీ వారికి చేసిన అనువాదం

* అదే విధంగా, కేంద్ర సాహిత్య అకాడమీ వారికి క్షేత్రయ్య, రామదాసు జీవిత చరిత్రలు కూడా రచించి ఇచ్చారు.

* ఆంధ్రప్రభ లో 'రజనీ భావతరంగాలు'

* క్షేత్రయ్య పదాలు, గాంధారగ్రామరాగాలు, గీతగోవిందం, భారతీయ సంగీతంలో ప్రాచీన రాగాలు మొదలైన వాటి మీద పరిశోధనా వ్యాసాలూ వ్రాసారు.

* ఇవేకాక జేజిమామయ్య పాటలు, మువ్వ గోపాల పదావళి, త్యాగరాజు, శ్యామశాస్త్రిల జీవిత చరిత్రలు, ఏటికి ఎదురీత పేరుతో కవితలు, 4 సంస్కృత నాటకాలకు తెలుగు అనువాదాలయిన 'చతుర్భాణీ' అనే రచన, అన్నమాచార్య కీర్తనలకు ఆంగ్లానువాదం, ఇలా ఎన్నో రచనలు రజనీకాంతరావు కలం నుంచి

జాలువారాయి.

శ్రీ రజనీకాంతరావు గారి గేయసంపుటిని మద్రాసు శ్రీ వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ వారు ప్రచురించారు.

ఇక రజని గారు రచించిన నృత్య, సంగీత రూపకాల విషయానికి వస్తే - చండీదాసు, మేఘసందేశం, సంధ్యాదీపకళిక, మధురానగరి గాథ, సుభద్రార్జునీయం, గ్రీష్మఋతువు, శ్రీకృష్ణశరణం మమ, మేనకావిశ్వామిత్ర, క్షీరసాగరమధనం, విప్రనారాయణ (స్వర రచనలు), దివ్యజ్యోతి (బుద్ధుడు), విశ్వవీణ (ఓర్ఫియస్) కళ్యాణ శ్రీనివాసం, నమోస్తుతే హరి, మొదలైన అనేక నృత్య-సంగీత రూపకాలు, రచించారు. వీరు బాణీ సమకూర్చి,స్వరరచన చేసిన కృష్ణశాస్త్రి గారి అతిథిశాల (ఉమర్ ఖయ్యాం) సంగీత రూపకానికి చాలా మంచిపేరు వచ్చింది. దీనికి పర్షియన్ బాణీలో సంగీతం సమకూర్చారు శ్రీ రజనీకాంతరావు.

వీరు సాధించిన బహుమతులు, వీరికి లభించిన పురస్కారాలు, బిరుదులూ అనేకం.

విశ్వకవి రవీంద్రనాథ్ టాగోర్ 150 వ జయంతి సందర్భంగా సంగీత నాటక అకాడమీ వారు శ్రీ రజనీకాంతరావుకి 'టాగూర్ అకాడమీ రత్న' బిరుదును ప్రదానం చేశారు.

ఇదే కాక ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు 1981 లో బహూకరించిన గౌరవ డాక్టరేట్ 'కళా ప్రపూర్ణ', 1961 లో 'ఆంధ్ర వాగ్గేయకారుల చరిత్ర' ఉత్తమ సాహిత్య పరిశోధనా గ్రంథానికి 'సాహిత్య అకాడమీ పురస్కారం', ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం 2007 లో ఇచ్చిన పురస్కారం - కళారత్న అవార్డ్, అమెరికా లోని అప్పాజోశ్యుల విష్ణుభొట్ల ఫౌండేషన్ వారి ప్రతిభామూర్తి జీవితకాల సాఫల్య పురస్కారం, మద్రాసు మురళి రవళి ఆర్ట్ అకాడమీ వారి 'నాద సుధార్ణవ' పురస్కారం, 'పుంభావ సరస్వతి' బిరుదు, 'నవీన వాగ్గేయకార' బిరుదు ప్రధానమైనవి. క్లుప్తంగా చెప్పాలంటే, నేటికీ తెలుగు ప్రజలకు మేలుకొలుపు పాడుతున్న ఆకాశవాణి భక్తిరంజని కార్యక్రమానికి రూపకర్తగా, నవీన వాగ్గేయకారునిగా, స్వరకర్తగా, రచయితగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా, ఆగస్ట్ 15 న స్వాతంత్ర్యం సాధించుకున్న వెంటనే, ప్రధాని నెహ్రూ జెండా ఎగరవేసిన అనంతరం ప్రసారమయిన టంగుటూరి సూర్యకుమారి గారు ఆలపించిన 'మోగించు జయభేరి' రచయిత మరియు కంపోజర్ గా ఆయన ఖ్యాతి పొందారు. అంతే కాక ఎంతో ప్రాచుర్యం పొందిన, ఎందరినో ఉత్తేజపరచిన, టంగుటూరి సూర్యకుమారి గారు ఆలపించిన 'మాదీ స్వతంత్ర దేశం ... మాదీ స్వతంత్ర జాతి..' గీతాన్ని కూడా రజని గారే స్వరపరిచారు.

అలాగే 1956 లో భక్తిరంజనిలో ప్రసారమయిన 'శ్రీ సూర్యనారాయణా... మేలుకో..హరి సూర్యనారాయణా..'వంటి భక్తిగీతాలను అతిశ్రావ్యంగా శ్రోతలకు వినిపించిన ఘనత శ్రీ రజనీకాంతరావు గారిదే.

రజనిది సంగీత సాహిత్య సమ్మిళిత జీవితం. లలిత సంగీతంలో ఆయన ముద్ర అజరామరం. ఐదేళ్ళకే కల్యాణి రాగాన్ని ఆలపించిన రజని, తన 16 వ ఏట తొలిపాట వ్రాసి, బాణీ కట్టి పాడారు.

స్వర్గసీమ సినిమాలో శ్రీమతి భానుమతి పాడిన 'ఓహో.. పావురమా..' మొదలు, రాజమకుటం సినిమాలోని 'ఊరేది పేరేది ఓ చందమామా' వరకు ఎన్నో సినీగీతాలను అందించారు. ఏడెనిమిది సినిమాలకు పాటలు స్వరపరిచారు.

ఆ మహనీయుడు, 98 ఏళ్ల వయసులో 22-4-2018వ తేదీ తెల్లవారుఝామున తన ముగ్గురు కుమారులను, ఇద్దరు కుమార్తెలను, ఎందరో సంగీతాభిమానులను శోకసముద్రంలో ముంచి దివికేగారు శ్రీ రజనీకాంతరావు గారు. ఆయన సరస్వతీ దేవి ముద్దుబిడ్డ, సంగీత సాహిత్యస్రష్ట. ఆ మహానుభావునికి నావంతు నివాళిగా ఈ వ్యాసం. ■

-పోడూరి శ్రీనివాసరావు

# నండూరి సరోజాదేవి




సీరియల్

## మిస్ మేఘమాల IAS

( గత సంచిక తరువాయి)




"అమ్మాయిని ఎంతో పద్ధతిగా పెంచారు అన్నయ్యగారూ? నిజంగా ఆ మాటల తీరు, తన నడవడి చూస్తుంటే నాకు చాలా ఆశ్చర్యంగా అనిపిస్తోంది" అంటూ శ్రీనివాసరావు గారికి,-తన సంతోషాన్ని తెలియచేస్తూ చెప్పింది అన్నపూర్ణమ్మగారు.

"అవునమ్మా! అంత పెద్ద బాధ్యతలో ఉన్నా, ఏ మాత్రం గర్వం అన్నది లేకుండా ఎప్పుడు ఒకే విధమైన రీతిలో మెలుగుతూ వుంటుందీ. అదంతా మాత్రం పూర్తిగా నారాయణ పోలికే వచ్చిందేమో అనుకుంటూ వుంటాను" శ్రీనివాసరావుగారు బదులిస్తూ, కూతురు గురించి చెప్పారు.

"బావుంది డాడీ! మీరిద్దరూ ఇలా నాగురించి పొగుడుతూ మాట్లాడడం మీరునూ? వింటుంటే నాకే ఏదో సిగ్గుగా అనిపిస్తోంది" అంటూ మేఘమాల తల్లి భుజం మీదికి తల వొంచేసుకుంది.

"అంతే కాదు!నువ్వు కనిపించాక,అమ్మకి నన్నసలు పట్టించుకోవడం కూడా తగ్గిపోయింది"హాస్యమాడుతూ అంది మాలతి.

"బావుందే,నీ వేళాకోళం నువ్వునూ?" చిన్నగా నవ్వుతూనే, కూతుర్ని మందలించింది అన్నపూర్ణమ్మగారు.

వాళ్ళ సంభాషణలను తను కూడా హ్యాపీగా గమనిస్తూ కూర్చున్న వినోద్, శాస్త్రి ప్రశ్నతో ఇటు తిరిగి..ఏంటిరా?" అన్నట్టు చూశాడు.

"అదే! ఆ గిరి సంగతి ఏమయ్యిందీ? జైలు శిక్ష ఆగిందా, లేదా?" సీటు చివరిలో కూర్చుని, శాస్త్రి అలా గిరి గురించి అడుగుతుంటే..

"ఒరేయ్,ఒరేయ్! ఇక్కడేంటిరా ఆ అడగడం? పద ఆ ముందుకి వెడదాం" చిన్నగా మందలిస్తూ, తన సీట్లోంచి లేచి నిలబడ్డాడు వినోదు.

"ఏంటి బావా! ఏమైనా కావాలా?"భర్తను చూసి అడిగింది మాలతి.

"నాకేం వద్దు కానీ, కాసేపు అలా కేబిన్ లో నిలబడి వస్తాం" అంటూ వినోద్, శాస్త్రితో ఆ ఏసీ డోర్ తీసుకుని బయటకి వెళ్లి ఒక పక్కగా నిలబడ్డాడు.

"వాళ్ళక్కడ వున్నారని మర్చిపోయి, ఆ గిరి గురించి ఏదో ఆత్రుతతో అడిగేసాను ఏమనుకోకు వినోద్" గిల్టీనెస్ తో చెప్పాడు శాస్త్రి.

"ఏం పర్వాలేదులే, ఏదో కాస్త సంతోషంగా గడుపుతున్న వాళ్ళ దగ్గర..గిరి విషయం మాట్లాడి,-మళ్ళీ దాన్నో పెద్ద ఇష్యూ చేయడం

ఇంతకీ గిరి సంగతి ఏమైంది?"

"గిరి వాళ్ళు కలెక్టర్ని దృష్టిలో పెట్టుకుని కిడ్నాపింగ్ చేసినా, తీసుకు వెళ్ళింది నా భార్యనే కనుకా.. నిన్న మధ్యాహ్నం పోలీస్ స్టేషన్ కి వెళ్లి, 'ఈ సారికి అతని తప్పుకి క్షమించి, నా బాధ్యత మీద వదిలేయమని' అక్కడి అధికారిని కోరాను. అయినా, దానికి వారు ఏ మాత్రం అంగీకరించలేదు. అవసమైతే జరిమానా ఎంతైనా కడతానని, నా పరంగా ఒక లెటర్ రాసిచ్చి ఇంకా ఇంకా బ్రతిమాలడంతో ఆ S.I శ్రీధర్ గారికి ఫోన్ చేసి, నా విషయం అంతా చెప్పారు".

"పాపం!మరి కొంత సేపటికి శ్రీధర్ గారు కూడా స్టేషన్ కి వచ్చి, నాతో మాట్లాడారు!"

"సారీ సర్, నా అంతగా నేను ఏదో ప్రయత్నం చేద్దామనుకుంటే, వీరి వల్ల అనవసరంగా మీరు ఇన్వాల్వ్ అవ్వాల్సి వచ్చింది. గిరి చేసిన దుర్మార్గపు పనికి, మొదటి రోజున నాకు చాలా కోపం వచ్చింది. పోలీస్ అరెస్ట్ ద్వారా తగిన శాస్తి అయ్యిందనుకున్నాను కూడా.

కానీ! ఆలోచించిన కొద్దీ..గిరి మీదే ఎంతో ప్రేమ, ఆశలు పెంచుకున్న మా పిన్ని, బాబయ్యలను తలచుకుంటే చాలా భయం అనిపించింది. అంతే కాదు, దగ్గర కుటుంబాలన్నీ తీరని వ్యధకి లోనవుతాయి.మేఘమాల అనుకుని కిడ్నాపింగ్ జరిగినా, ఆ పరిస్థితికి లోను అయ్యింది నా భార్యే కదా? అందుకే వాడికి ఏ శిక్ష పడనీకుండా, క్షమించి వదిలేయమని S.I గారిని కోరాను."

సార్! "ఎలాగూ ఈ విషయం మీ దాకా వచ్చింది కాబట్టీ ఏమీ అనుకోకుండా, కాస్త దయ చూపి.. S.I గారితో మాట్లాడి ఈ సహాయాన్ని కూడా మీరు చేసి పెట్టండి" అని శ్రీధర్ గారిని,నేను వేడుకున్నాను.

"ఓకే,ఓకే మీరు చెప్పడం అయ్యింది కదా, దీని గురించేం ఇంక ఆలోచించకండి,నేను చూస్తాను. మీరు మాత్రం ఇక్కడే కూర్చోండి" అంటూ శ్రీధర్ గారు లోపలికి వెళ్లి, లాయర్ ద్వారా S.I తో మాట్లాడించి,ఆ పూటే గిరి కేసుని పూర్తిగా క్లోజ్ చేయించేసాడు.

గిరికి చాలా గట్టి వార్నింగ్ ఇచ్చి మాత్రం వదిలారు!

"మరి! ఆ గిరికి పశ్చాత్తాపం ఏమైనా వచ్చిందా,లేదా?" శాస్త్రి అడిగాడు.

"తన మనసులో ఏముందో తెలీదు కానీ, చేసిన పనికి సిగ్గుతో తల ఎత్తుకోలేక పోతున్నాడని మాత్రం అనిపించిందీ..నన్ను చూసిన వెంటనే, నా కాళ్ళు రెండు పట్టేసుకుని "క్షమించు అన్నయ్యా, మరింకెప్పుడు ఇలాంటి తప్పుడు పనులు చేయనూ. మాలతిని కూడా క్షమించమని చెప్పు" అంటూ తెగ కన్నీళ్లు కార్చాడు.

"సర్లే ! ఇంటికి వెళ్ళు, బాబయ్యగారు కూడా ఈ ఊళ్లోకి వచ్చారు. ఇకనైనా వాళ్ళకి నచ్చినట్టు నడుచుకో అని ఓదార్చి వాడిని బయటికి పంపించేశాకా, నాకైతే మంచిపనే చేశానని ఎంతో తృప్తిగా అనిపించిందీ" అని వినోద్, శాస్త్రితో అంటుండగా ..

"నువ్వు చేసే పనులన్నీ మంచివేగా? మేం దేశోద్ధారకుడు పుట్టాడు అనుకుంటాంల్లే" అని నవ్వుతు ఆంటూ, మేఘమాల కూడా వాళ్ళిద్దరి పక్కకి వచ్చి నిలబడింది.

"అరే, నువ్వెప్పుడిలా వచ్చావ్?" ఆశ్చర్యంగా అడిగాడు వినోద్.

"జస్ట్,ఇంతకు ముందేలే. మీరిద్దరూ ఏమైపోయారా అనుకుంటూ వచ్చాను, ఇక్కడే కనిపించారు"

"అదే! గిరి విషయం అడుగుతూంటే, అత్తయ్య వాళ్ళు వినకుండా శాస్త్రిని ఇక్కడికి తీసుకు వచ్చి చెప్తున్నాను" ఆమె అడక్కపోయినా, వినోద్ చెప్పాడు.

"అది అయిపోతే రండి ఇంకా, గౌరి ఫుడ్ రెడీ చేస్తోంది"అంటూ చెప్పి, మేఘమాల కంపార్ట్మెంట్ లోకి వెనుతిరిగింది.

వినోద్! "గిరిని వదిలేసిన విషయం..ఈవిడకి కూడా అప్పుడే తెలిసిందా,ఏంటీ?" శాస్త్రి కుతూహలంగా అడిగాడు.

"నాకైతే చెప్పడానికి ధైర్యం చాల్లేదు కానీ.. శ్రీధర్ గారు ఏ విషయం అయినా, మేఘమాలకి ముందు చెప్పకుండా చేయడు

కదా? తన పర్మిషన్ తోనే గిరిది అంతా క్లియర్ అయ్యిందిటా! ఇంటికి వచ్చాక మాత్రం, నన్ను చాలా గట్టిగానే కేకలు వేసింది కూడా."

అయితే! "మొదటి నుండీ ఎన్నో విధాల శ్రీనివాసరావు గారిని బ్లాక్ మెయిల్ చేయడమే కాకా, జైలు నుండి కూడా తప్పించుకు తిరుగుతున్న సీతాపతిని మాత్రం వదలద్దని చెప్పిందిట."

"మంచిదయ్యిందిలే, అటువంటి ప్రమాదకర వ్యక్తులకి తప్పకుండా అలా శిక్ష పడాల్సిందే! ఆ గిరి అదృష్టం బాగుండి,నీ మంచితనంతో జైలు శిక్ష నుండి బయట పడ్డాడు" అంటూ, లోపలి వెళ్ళిన వినోద్ ని అనుసరించాడు శాస్త్రి.

గౌరీ అందిస్తున్న ప్లేట్ లోకి చూస్తూ "అబ్బో! మాలతికి ఎంతో ఇష్టమైన పులిహోర, దద్దోజనం చేసి తీసుకొచ్చావే?" అన్నాడు వినోద్.

"వారికి ఏది ఇష్టమో అడిగి చేయమని, అమ్మగారి ఆర్డర్" నవ్వుతు చెప్పింది గౌరీ.

"అయితే! మరి మా ఇష్టాలు అడగలేదే నువ్వూ?" గౌరిని వేళాకోళం పట్టిస్తూ అడిగాడు శాస్త్రి.

"మీకు నచ్చే ఆంధ్ర స్వీట్స్ 'బొబ్బట్లు, కాజాలు' కూడా మా అమ్మగారు తెప్పించారు లెండి" తడుముకోకుండా బదులిచ్చింది గౌరి.

"నిజంగానా? అవి తిని చాలా రోజులు అయ్యింది..చెబుతుంటేనే నాకు నోరూరి పోతోందీ, ముందు అవే పెట్టు" అంటూ ఏ మొహమాటం లేకుండా శాస్త్రి అలా అడిగేస్తోంటే, అందరు గట్టిగ నవ్వేశారు.

"సందడి అంతా ఈ గౌరీ,-శాస్త్రి మూలంగానే వస్తుందీ. గౌరిని కూడా తీసుకు వచ్చి చాలా మంచిపని చేసావ్, మేఘమాలా?" వెంటనే అన్నాడు వినోద్.

"గౌరీ రావడంలో నా కంటే, అమ్మ పట్టుదలే ఎక్కువుంది" మేఘమాల చిరునవ్వుతో చెప్పింది.

"మా పెద్దమ్మ గారు,ఎంతో మంచావిడా" అంటూ అన్నపూర్ణమ్మ మోకాళ్లని పట్టేసుకుని, ఆనందం వ్యక్తం చేసింది గౌరి.

"నువ్వు మా వూరు చూడాలి కదా, అందుకే నిన్నూ తప్పక తీసుకు రమ్మని అమ్మాయికి గట్టిగా చెప్పాను" గౌరి తల మీద చెయ్యి వేసి, నవ్వుతూ చెప్పింది అన్నపూర్ణమ్మ గారు.

అలా వాళ్ళందరూ సరదాగా ఏవో ఒక కబుర్లు చెప్పుకుంటూ.. నెమ్మదిగా ఒక గంటకి, తెచ్చిన పదార్థాలన్నీ తినడం పూర్తి చేసారు!

"డాడీ! మీరు తిని చాల సేపు అయ్యింది కదా..ఇంక పడుకుంటానంటే, మీ బెర్త్ మీద దుప్పటి వేసేస్తాను" అని మేఘమాల,శ్రీనివాసరావు గారితో అంది.

"నువ్వెందుకు,మేమున్నాం కదా?" అంటూ ఒక సైడు లోయర్ బెర్త్ పై, ఆయన పడుకోవడానికి రెడీ చేసేశాడు వినోద్.

"అమ్మా! ఇంకెంత సేపు కూర్చుంటావ్? 11 గంటలు కావొస్తోంది,నువ్వూ పడుకో" అని మేఘమాల, ఆవిడ పక్క వేయించేయగానే.. అలసిపోయి వున్న కారణంగా, మిగిలిన వాళ్ళూ తమ తమ బెర్తులు వాల్చుకుని వాటి మీద హాయిగా వాలిపోయారు.

00000000000000

రాజమండ్రి ఒక గంటలో వస్తుంది అనగా....... వినోద్ తన వాళ్ళని నిద్ర లేపేయడంతో, అందరు మొహాలు కడిగేసుకుని రెడీ అయిపోయారు!

మేఘమాల కి మాత్రం.. వూరు దగ్గరకి వచ్చేస్తోంది అనగానే, వెళ్లి తండ్రిని కలవబోతున్నందుకు సడెన్ గా మనసులో ఏదో తెలియని ఎక్సయిట్మెంటు, టెంక్షను మొదలయ్యాయి. తల్లి అరచేతిని గట్టిగా పట్టేసుకుని,-తన బుగ్గకి ఆన్చుకుంది!

గోదావరి బ్రిడ్జి దాటిన మరికాసేపటికి స్టేషన్ రాగానే, రైలు నెమ్మదిగా స్లో అవుతూ ఆగడం మొదలు పెట్టింది!

సరిగ్గా AC ఫస్టు క్లాస్ బోగీ ఆగే చోట కింద నిలబడి వెయిట్ చ్చేస్తున్న అసిస్టెంట్ కిరణ్, సెక్యూరిటీ విల్సన్..వినోద్ వాళ్ళని

చూస్తూనే చెయ్యి ఊపారు!

ఆ కుటుంబం అందరితో పాటుగా దిగిన మేఘమాలని చూస్తూనే.. "నమస్తే మేడం,గుడ్ మార్నింగ్ మేడం!" అంటూ వాళ్లిద్దరూ విష్ చేసేశారు.

"మీరు వచ్చి ఎంత సేపు అయ్యిందీ?" నవ్వుతూ అడిగింది మేఘమాల.

"ఒక ఆఫ్ ఏన్ అవర్ అయ్యింది మేడం!" చెప్పాడు కిరణ్

"కూలీ దొరుకుతారేమో చూడండి, లగేజ్ తీసుకు వస్తారు" చెప్పింది మేఘమాల.

"ఎందుకు మేడం! మేం తీసుకు వచ్చేస్తాం" అంటూ కిరణ్ వాళ్ళు, ఆ సామాను తీసుకోబోయేరు.

"ఉండండి,మేము ఉన్నాం కదా?" అంటూ వినోద్, శాస్త్రి కొంత సామాను పట్టుకోగా..అందరు నెమ్మదిగా స్టేషన్ బయటకి చేరారు.

మేఘమాల కారుతో బాటుగా-,మరొక ఓలా క్యాబ్ ని మాట్లాడగానే.. అందరికి ఏ ఇబ్బంది లేకుండా సరిపోవడంతో, ఆ వెహికిల్స్ కూడా "రాజవోలు" గ్రామం వైపుకి రోడ్డు దారి పట్టాయి!

కారు ఎక్కే ముందు,మేఘమాల సెల్ ఫోన్ తీసుకుని.. గ్రామానికి బయలుదేరుతున్నట్టు వినోద్ ముందుగా రాముకి తెలియ చేసేశాడు!

( ఇంకా వుంది )

---

## ఉన్న అమెరికా పౌరసత్వాన్ని వదులుకోవడం ఎలా?

(12 వ పేజీ తరువాయి)

* అమెరికా పాస్ పోర్టులో ఉన్న విధంగా పూర్తి పేరు
* గతంలో ఏవైనా ఇతర పేర్లు వాడి ఉంటే, ఆ పేర్లు
* పూర్తి చేసిన DS-4080 దరఖాస్తు (సంతకం పెట్టకుండా)
* పూర్తి చేసిన DS-4081 దరఖాస్తు (సంతకం పెట్టకుండా)
* అమెరికా పౌరసత్వం పొందిన విధానం
* పుట్టిన తేది మరియు వివరాలు
* అమెరికా పాస్ పోర్టు నంబర్
* సోషల్ సెక్యూరిటీ నంబర్
* అమెరికాలో గతంలో ఉన్న చిరునామా
* ఇతర జాతీయత
* ఆ జాతీయతకు సంబంధించిన పాస్ పోర్టు
* ఆ జాతీయత పొందిన తేది
*ఆ జాతీయత పొందిన విధానం
* అమెరికాలో గతంలో నివసించిన తేదీలు, కాల పరిమితులు

3. పూర్తి చేయవలసిన దరఖాస్తులు:

* DS-4079
* DS-4080 (సంతకం చేయకుండా)
* DS-4081 (సంతకం చేయకుండా)

4. ఈ దరఖాస్తులతో పాటు 2,350 డాలర్ల రుసుమును డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా అమెరికన్ కాన్సులేట్ కార్యాలయానికి చెల్లించవలసి ఉంటుంది.

5. భారతదేశంలో ఉన్న సంబంధిత అమెరికన్ కాన్సులేట్ కార్యాలయంలో అపాయింట్మెంట్ తీసుకోవడానికి ఈమెయిలు చేయాలి –

* న్యూ ఢిల్లీ – acsnd@state.gov
* చెన్నై - chennaics@state.gov
* హైదరాబాద్ - hydacs@state.gov
* ముంబై – mumbaiacs@state.gov
* కోల్ కత్తా - kolkataacs@state.gov

6. నిర్ణీత సమయానికి హాజరయి అమెరికన్ కాన్సులేట్ అధికారుల ఎదురుగా అమెరికా పౌరసత్వాన్ని వదులుకుంటున్నట్టుగా ప్రకటించవలసి ఉంటుంది.

7. ఈ ప్రక్రియలో చివరి ఘట్టం - అమెరికాలో ఉన్న ఆదాయపు పన్ను (ఐఆర్ఎస్) శాఖకు Form - 8854 నింపి పంపాలి.

పూర్తి వివరాలకు www.prasadthotakura.com ను చూడండి

(ఈ వ్యాస రచయిత డాక్టర్. ప్రసాద్ తోటకూర గత మూడు దశాబ్దాలుగా అమెరికాలో స్థిర పడి పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న ప్రముఖ ప్రవాస భారతీయ నాయకుడు)

# శ్రీనాధుని కాశీ ఖండం

## (వచనానుసరణం)




## పోచినపెద్ది మురళీ కృష్ణ


### ముందు మాట

కాశీ క్షేత్రంతో భారతీయులకు ఎంతో విడదీయరాని అనుబంధం ఉంది.. జన్మించినా, మరణించినా కాశీ క్షేత్రంలోనే జరగాలని భారతీయులు భావిస్తారు. అంతటి పవిత్ర క్షేత్ర వైభవాన్ని వర్ణించని భారతీయ సాహిత్యం లేదు. స్కాంద పురాణంలో వ్యాసుడు కాశీ వైభవాన్ని విస్తృతంగా వర్ణించాడు. తెలుగు సాహిత్యంలో శ్రీనాధుడు ప్రప్రధమంగా ప్రబంధ రీతిలో కాశీ క్షేత్రాన్ని వర్ణించాడు. ఈ కాశీ ఖండాన్ని మా పాఠకులకు పరిచయం చేయడానికి డా. పోచినపెద్ది వెంకట మురళీ కృష్ణ గారిచే సరళ వ్యావహారిక భాషలో, యధా మూలానుసారంగా అనుసరించిన కాశీ ఖండాన్ని, నెలనెలా అందిస్తున్నాము.

ఈ వ్యాస పరంపర ఆధ్యాత్మిక వేత్తలకు భక్తీ తత్వాన్ని, విద్యార్థులకు శ్రీనాధుని తత్వాన్ని అందించగలదని భావిస్తున్నాము.

- సంపాదకురాలు.


(గత సంచిక తరువాయి)


శివలింగంనుండి కాంతి కిరణాలు వెలువడుతున్నాయి. మొదటి వెలుగునందు విష్ణువుయొక్క ఆకార రేఖతో " అ" కారము కనబడినది. తరువాత బ్రహ్మరూపము దాల్చిన " ఉ" కారము ప్రత్యక్షమయినది. అటుతరువాత శివుని రూపముదాల్చిన " మ" కారము ప్రత్యక్షమయినది. తరువాత శబ్ద బ్రహ్మ నాదము వినబడింది. ఆ నాదమునందు భువనసృష్టి హేతువయిన బిందువు కనబడింది. ఆ స్వరూపములు అన్నికలిసి " ఓం" కార స్వరూపము ప్రత్యక్షమయినది.

ఆ ప్రణవ నాదము సంసార బాధలనుండి తరింప చేయుటవలన " తారక మంత్రము" అయినది. ప్రణవము నిత్యమయి, పరమానంద ప్రకాశమయి, నిత్య నూతనమయి, పరబ్రహ్మమునకు వాచకము అగుట వలన " ప్రణవము" అని పేరును పొందినది. ప్రణవములో ఉన్న అకార, ఉకార, మకార, బిందు, నాదము, అనెడి ఐదు అవయములనుండి ఏబది వర్ణములు ఉద్భవించాయి. ఈ ప్రణవమునందు ఋగ్యజుస్సామవేదములు, తురీయము, తురీయాతీతములకు ఆత్మ అయినది. ప్రణవము నాలుగు శృంగములు, ఏడు చేతులు, రెండుతలలు, మూడు తలలు కలిగి ఉండి మూడు స్వరూపములుగా బంధించబడి ఉన్న వృషభ స్వరూపముతో మ్రోగుతూ ఉంది. ప్రణవము అన్ని లోకములలోను లీనమయి ఉన్నది. ప్రణవము నాలుగు వేదముల స్వరూపము. గార్హపత్య, దక్షిణ ఆవహనీయము, సంవర్తకము, అనెడి అగ్ని స్వరూపము. పృధివి, అంతరిక్షము, ద్యులోకము, సోమ లోకముల స్వరూపము ప్రణవములో ఉన్నది. ప్రణవము ఉదాత్త అనుదాత్తే, స్వరిత, ప్రచయము




చైతన్యం సంకల్ప బలం

అనెడి స్వరూపములు ప్రణవమునందు కలవు. భూత, భవిష్తత్, వర్తమానములలో ఉన్న కాల స్వరూపము పనవమునందు ఉన్నది. " ఆద్గుణః" అను పాణిని సంధి సూత్రములోని " ఓ" కారము మంత్ర రూపమయి, దివ్య లింగాకరమయి ఆవిర్భవించింది. బ్రహ్మ ఓంకార స్వరూపమయిన లిం గమును ఈ విధముగా స్తుతించినాడు.

" నమ ఓంకార స్వరూపాయ. నమస్సర్వరూప స్వరూపిణే , నమో రుద్రాయ, నమో భవాయ, నమ శ్శర్వాయ, నమో నాదాత్మనే, నమో బిందు కళాత్మనే, నమో నమో బిందు కళాత్మనే, నమో&లింగాయ, నమో లింగస్వరూపాయ, నమో భీమాయ, నమః పశుపతయే, నమ స్తారస్వరూపాయ, నమశ్శివాయ, నమః కపర్దినే, నమ శ్శితి కంఠాయ, నమో మీఢుష్టమాయ, నమో గరిష్ఠాయ, నమ శ్శిపి విష్టాయ, నమో హ్రస్వాయ, నమో బృహతే, నమో వృద్ధ రూపిణే, నమః కుమార గురవే, నమ శ్వేతాయ, నమః కృష్ణాయ, నమః పీతాయ, నమో &రుణ మూర్తయే, నమో ధూమ్ర వర్ణాయ, నమః పింగళాయ, నమః కిర్మీర వర్చసే, నమః పాటల వర్ణాయ, ...........

అకార, ఉకార, మకార, నాద, బిందువులు ఐదు రూపములు విడి విడిగా లింగ రూపముగా ఆవిర్భవించినవి.



ఓంకార స్వరూపమైన శివ లింగముకూడా ఆవిర్భవించినది. వీటిని దివ్య లింగములు అని పిలుస్తారు.

కాశీ నగరములో భరద్వాజ గోత్రుడైన దమనుడు అను బ్రాహ్మణుడు పాశుపత దీక్ష తీసుకొని కైవల్యాన్ని పొందాడు.

అవిముక్త క్షేత్రానికి ఉత్తర సరిహద్దునందు భారభూతేశ్వరుడు, తూర్పు సరిహద్దునందు మణి కర్ణేశ్వరుడు, దక్షిణ సరిహద్దునందు బ్రహ్మేశ్వరుడు, పడమటి సరిహద్దునందు గోకర్ణేశ్వరుడు ఉన్నారు.

అట్టహాసుడు అను ప్రమధుడు తూర్పు ద్వారాన్ని, భూత ధాత్రీశ్వరుడు అను ప్రమధుడు దక్షిన ద్వారాన్ని, గోకర్ణుడు అను ప్రమధుడు పడమర ద్వారాన్ని,ఘంటా కర్ణుడు అను ప్రమధుడు ఉత్తర ద్వా, ద్వారాన్ని, రక్షిస్తూ ఉంటారు.

ఛాగవక్త్రుండు ఈశాన్య కోణాన్ని, భీషణుడు ఆగ్నేయ కోణాన్ని, శంకు కర్ణుడు నైరుతి కోణాన్ని, ధృమి చండుడు వాయువ్య కోణాన్ని, రక్షిస్తూ ఉంటారు. కాలాక్ష, రణ భద్ర, కౌలేయ, కాల కంపన అను ప్రమధులు గంగానదికి అవతలి వైపున కాపలా కాస్తూ ఉంటారు. వీరభద్రుడు, నభస్సు, కర్దమాలిప్త విగ్రహుడు, స్థూల కర్ణడు, మహా బాహుడు అను ప్రమధులు అసి నదీ తీరాన్నికాపలా కాస్తున్నారు. విశాలాక్షుడు,మహా భీముడు, కుండోదరుడు, మహోదరుడు అనువారు దేహళీ తీరాన్ని కాపలా కాతున్నారు. నందిషేణుడు, పాంచాలుడు, ఖరపాదుడు, కరంటకుడు, ఆనందుడు, గోపకుడు, బభ్రుడు అనువారు వరుణా నదీ తీరాన్ని కాపలా కాస్తున్నారు.

(ఇంకా వుంది)

# వేదుల సుబ్రహ్మణ్యం



## అప్పుల తిప్పలాష్టకం

తే. గీ. అప్పులంజేసి వ్యాపారమందు బెట్టి
గోప్యముగ కంపెనీలను గుల్ల జేసి
సొమ్ములన్ స్వంత ఖాతాల జొన్పి పూడ్చు
ఇంటి దొంగల బట్టంగ నేరి తరము! 1

తే. గీ. బ్యాంకు లిచ్చిన పత్రాలు పణము పెట్టి
దేశదేశాల నప్పుల దెచ్చి పూడ్చి
అవకతవకల వ్యాపారమంట గట్టి
తోకముడిచిన మొనగాళ్ళు లేకపోరు 2

తే. గీ. అప్పులిచ్చిన బ్యాంకులే తిప్పలుపడి
సొమ్ము లెగవైచి తిరుగాడు సోకుగాళ్ళ
నెంతలో కొంత రాబట్ట నిరికునపడి
కొట్టుమిట్టాడు దుస్థితి కోరుకొనరె! 3

తే. గీ. గగనమున దేలు వ్యాపార ఘనుడొకండు
వజ్రవైడూర్యరత్నవ్యాపారి యొకడు
క్రీడలందున వ్యాపారక్రీడి యొకడు
దేశమున్ వీడిపోదురె ధిక్కరించి! 4

తే. గీ. మిన్నకుండిన లోకము మేలుకొనదె?
ప్రజల సొమ్ములు కావె యీ పణము లన్ని?
ఋజువు లేకుండ నేబ్యాంకు ఋణము లిచ్చు?
వేరు నియమము లుండునే వెర్రి వార్కి? 5

తే. గీ. ఇపుడు కాకున్న తగులు రేపెదురు దెబ్బ
చట్టమును దాట నేరికి సాధ్యమౌను?
మూలమూలలు వెదికి యా మోసగాళ్ళ
బట్టి శిక్షించు సంస్థలుద్భవము గావె! 6

తే. గీ. సగటు మనిషిని నాకేల వెగటనంచు
మోసగాళ్ళను నమ్మిన దోసమునకు
విసిగి వేసారి పోవుచో వెతలె మిగులు
చేయిగలిపిన గలుగు నిశ్చితము నయము 7

తే. గీ. సంఘ సంక్షేమ కార్యార్థ సాధనమున
దుష్టశక్తుల నరికట్టి కష్టమోడ్చి
ముక్తి కల్గించు సంస్థల శక్తి పెంచు
నూతన యుగంబు కోరి చేయూత నిమ్ము 8

# తుమ్మూరి రాంమోహన్ రావు



## మన విద్యా వ్యవస్థ

శ్లో. విద్యానామనరస్స్యరూపమధికం ప్రచ్ఛన్న గుప్తం ధనమ్
విద్యాభోగకరీ యశస్సుఖకరీ విద్యా గురూణాం గురుః విద్యా
బంధుజనే విదేశగమనే విద్యపరాదైవతా
విద్యా రాజ్య సుపూజ్యతే నహి ధనం విద్యా విహీనః పశుః

\- భర్తృహరి

దీనిని ఏనుగు లక్ష్మణ కవి ఇలా తెనిగించారు.

**ఉ. విద్య నిగూఢ గుప్తమగు**
**విత్తము రూపము పూరుషా-**
**ళికిన్**
**విద్యయశస్సు భోగకరి విద్య-**
**గురుండు విదేశబంధుడున్**
**విద్య పరాధదైవతము**
**విత్తము గాదది చూడగాని**
**లన్**
**విద్యనృపాల పూజితము**
**విద్యనెరుంగనివాడు మర్త్యుడే**

విద్య ప్రాశస్త్యాన్ని గురించి వందల సంవత్సరాల క్రిందనే మన పూర్వీకులు తెలియజెప్పినా మనం ఇంకా విద్య గురించిన అవగాహనలో వెనుకబడే ఉన్నామని చెప్పక తప్పదు.

ముందుగా మనకు విద్య అనగానే కేవలం పాఠశాలలో చదువుకునే అక్షరాస్యత లేక అక్షరబద్ధమైన చదువు గురించే దృష్టి పోతుంది. అక్షరాస్యులు కాని వారు ఎందరో అనేక విద్య లలో ఆరితేరిన వారున్నారు.ఎందరో కర్షకులు వ్యవసాయరంగంలో నిష్ణాతులై మంచి పంటలను పండిస్తున్నారు.కుమ్మరి కుండలు చేసినా.కమ్మరి కర్రులు చేసినా,-కంసాలి నగలు చేసినా,మంగలి కేశసౌందర్యాన్ని ఇనుమడింపజేసినా,గాయకుడు తీయగా పాడినా,వంటవారు కమ్మని పదార్థాలు వండిపెట్టినాచిత్రకారుడు బొమ్మలుగీసినా ఇవన్నీ విద్యలే. ఇలాంటి విద్యలు ప్రపంచ వ్యాప్తంగా కోకొల్లలు.చేపట్టిన వృత్తి ఏదైనా దానిలో పరిపూర్ణతను సాధించటం గమ్యమైతే,వానిలో అక్షరాస్యులై పండితులై జ్ఞానం సంపాదించే అవకాశం కలిగిన విద్య యొక్క పరమార్థం మాత్రం పరిపూర్ణ మానవుడుగా రూపొందించటమే.

ప్రముఖ తత్త్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి విద్యగురించి మాట్లాడుతూ - మనం డాక్టర్లను,ఇంజనీయర్లను,న్యాయవాదులను,ఉపాధ్యాయులను తయారు చేస్తున్నాం కానీ వారిని మానవులుగా మార్చటం లేదని ప్రస్తుత విద్యా వ్యవస్థను సునిశితంగా విమర్శించారు.

ఒకప్పటితో పోలిస్తే నేడు పాఠశాలలు,కళాశాలలు,విశ్వవిద్యాలయాల సంఖ్య గణనీయంగా పెరిగినా చదువుల వల్ల ఒనగూడే ప్రయోజనం మాత్రం రోజురోజుకూ దిగజారి పోతుం దనేది కాదనలేని సత్యం.

ఎక్కడుంది లోపం?అందరం ఎవరికి వారు వేసుకోవలసిన ప్రశ్న.ప్రభుత్వాలు ప్రాజెక్టుల నిర్మాణంకన్నా అతిముఖ్యమైన సమస్యగా పరిగణించాల్సిన విషయం.

మధ్యాహ్న భోజన పథకాలో,ఉపకారవేతనాలో,మంచి వసతిగృహాలో,అత్యాధునిక పాఠశాలభవనాలో, ఉచిత దుస్తులు,పుస్తకాల సరఫరాలో ,కోట్లరూపాయలు వేతనాలుగా చెల్లించి ఉపాధ్యాయనియామకాలు చేపట్టడమో చేసి చేతులు దులుపుకుంటే సరిపోదు.సరియైన విద్య అంది స్తున్నామా లేదా అనేది ముఖ్యమైన అంశంగా పరిగణించాలి. కేవలం పొందిన మార్కులతో,ఉత్తీర్ణతా శాతంతో విద్యా స్థాయిని అంచనావేయటం వెర్రితనమే అవుతుంది.

ప్రభుత్వంతో పాటు పిల్లల తల్లిదండ్రులు పాఠశాలల పని చేసే ఉపాధ్యాయులు, యాజమాన్యాలు ఈ విషయం గురించి పూర్తి స్థాయిలో అవగాహనకు రాకపోతే పెను ప్రమాదం తప్పదు.

అసలు బళ్లలో కాని కాలేజీల్లోగాని ఏం జరుగుతుంది? ఒక బడినుంచి వచ్చిన విద్యార్థి నడవడిక ఎలాఉంది? విషయ పరిజ్ఞానం ఎంతవరకుంది? ఒక్కసారి నిశితంగా ఆలోచించండి. బాగా డబ్బులు ఖర్చుపెట్టి ఖరీదైన పాఠశాలల్లో చదివిస్తున్నామని సంబరపడే సగటు తల్లిదండ్రులు అన్ని వసతులూ సమకూరుస్తున్నామనే ప్రభుత్వ ప్రభత్వేతర యాజమాన్యాలు ఒక్కసారి ఆత్మవిమరశ చేసుకోవాలి. కువిద్య కన్నా అవిద్య నయం అనే కఠోర సత్యాన్ని చెప్పక తప్పదు.విద్యార్థిని ఉత్తమ మానవునిగా తీర్చి దిద్దాల్సింది పోయి గొప్పమరబొమ్మలుగా తయారు చేసి తలలు పట్టుకుంటున్నాం.

ప్రస్తుత విద్యా వ్యవస్థను పరిశీలించి చూసినట్లయితే అనేక లోపాలు కొట్టవచ్చినట్లు కనిపిస్తాయి. ముఖ్యంగా విద్యార్థుల అవగాహన స్థాయిని చూసినట్లయితే ప్రైవేటు పాఠశాలలు లేదా కాన్వెంటు బళ్లు రాకపూర్వం సర్కారు బళ్లలో చదువుకున్న విద్యార్థులు ఇప్పటి విద్యార్థుల కంటే చాలా మెరుగుగా కనిపి స్తారు. అప్పుడు అరపై శాతం మార్కులు రావటమంటే గగనం గా ఉండేది. కాని నేర్చుకున్న విష యాల పట్ల మంచి అవగాహన ఉండేది. ఇప్పుడు తొంభైతొమ్మిది శాతం వచ్చినా అవగాహనా రాహిత్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది.

ఇందుకు ముఖ్యంగా రెండు కారణాలు చెప్పుకోవచ్చు. మొదటిది మాధ్యమిక భాష, రెండవది డిటెన్షన్ విధానం. అప్పట్లో అన్ని పాఠశాలల్లో మాతృభాషలోనే బోధన జరిగేది. తగినన్ని మార్కులు రాకపోతే అదే తరగతిలో చదవాల్సి వచ్చేది.నా కంటే రెండు మూడు తరగతులపైనున్నవారికి నేను సహాధ్యాయుడిగా చేరటం స్వానుభవం.

ఇప్పుడన్నీ ఆంగ్లమాధ్యమంలో నడిచే పాఠశాలలే సర్కారు బళ్లు తప్ప.వాటిల్లో కూడా జనాల వ్యామోహాన్ని చూసి ఇటీవల ఆంగ్ల మాధ్యమంలో తరగతులను ప్రవేశపెట్టడం జరిగిన సంగతి అందరికీ తెలిసిందే.విచిత్రమైన విషయమేమిటంటే ఇవే ప్రభుత్వాలు ఒకప్పుడు మాతృభాషలో బోధనకై అంతవరకు ఆంగ్లమాధ్యమాల్లో నడుస్తున్న కళాశాలలన్నిటిని మాభాషలో స్నాతకోత్తర స్థాయికి తీసుకుని వెళ్లాయి.వాటి కోసం కళాశాల స్థాయి పుస్కాలు తయారు చేయడానికి అకాడమీలు పారిభాషిక పదాలకు మాతృభాషలో పదాలు సమకూర్చడానికి తెలుగు అకాడెమీ వంటి సంస్థలు పూనుకొని ఆతరువాత పుస్తకాలు కూడా ప్రచురించాయి. అన్ని కళాశాలల్లో మాతృభాషలో బోధన జరిగి అనేక మంది విద్యార్థులు తెలుగు మీడియంలో చదివి పట్టభద్రులయ్యారు. ఇంతలో అకస్మాత్తుగా కార్పొరేట్ కళాశాలల ఉప్పెన వచ్చింది.

దాంతో అంతవరకు చేసిన ప్రయత్నాలన్నీ వృథా అయినాయి.ఇంజనీరింగు కళాశాలలు-,వైద్య కళాశాలలు విపరీతంగా పెరిగి పోయి అది విద్యార్జన కాకుండా స్టేటస్ సింబల్ గా మారిపోయే స్థితికి చేరటం శోచనీయం.అందునా డబ్బున్న వాళ్ల దృష్టంతా పిల్లల వ్యక్తిగత ఆసక్తి,బౌద్ధిక స్తోమత లెఖ్ఖచెయ్యక బలవంతంగా పిల్లలపై చదువు ను రుద్దే ప్రయత్నాలు మొదలయ్యాయి.దానిని వ్యాపారాత్మక ధోరణితో నడిపే కళాశాలల

యాజమాన్యాలు ఇబ్బడి ముబ్బడిగా ఫీజులు పెంచి సొమ్ములు చేసుకోవటం మొదలు పెట్టాయి. ఇప్పుడు తల్లిదండ్రుల దృష్టి,-విద్యార్థుల దృష్టి,విద్యాలయాల దృష్టి కేవలం ఎక్కువ మార్కులు సంపాదించటం పైనే కేంద్రీకృత మైంది. చదవగలిగిన వారిని మరబొమ్మల్లాగా తయారుచేసి అవగాహనను తుంగలో తొక్కి, కంఠస్థ పద్ధతి లేదా యాంత్రిక పద్ధతులవలంబించి గొప్ప ఫలితాలు సాధించామని చంకలు గుద్దుకోవటం, స్వంత డప్పు కొట్టుకోవటం మొదలయ్యింది.చదవలేని విద్యార్థులు మార్గాంతారాలు వెతికి అవినీతి మార్గంలో కాపీ కొట్టడం, పేపరులీకేజీలకు పాల్పడటం,పరీక్షకేంద్రాల్లో పరీక్షాపత్రాలు దిద్దేవారిని డబ్బుతో లొంగదీసి మార్కులు వేయించుకోవడం మనందరికీ తెలిసిందే. ఈ విషయంలో పెద్ద పెద్ద స్కాండల్స్ జరిగిన విషయంకూడా రహస్యమేమీ కాదు.చేతిలో డిగ్రీ ఉన్నా విషయ పరిజ్ఞానం-లేని యువకులు ఎంతమందో చెప్పలేం. దేశప్రగతి ముఖ్యభూమిక యైన విద్యా వ్యవస్థ ఇంతగా భ్రష్టు పడితే భవిష్యత్కాలపు పరిస్థితి ఏమిటి అనేది ఆలోచించ వలసిన విషయం. విద్యా దదాతి వినయం అని ఒకప్పుడనుకునే వాళ్లం. సక్రమమైన పద్ధతిలో చదివినప్పుడే అది సాధ్యమౌతుంది.చదువుతో పాటు సంస్కారంకూడా అత్యంత ముఖ్యమైనదని, ఇంకా చెప్పాలంటే చదువుకంటే కూడా సంస్కారానికే ఎక్కువ ప్రాధాన్యతనివ్వాలి అని చెప్పటం ఇప్పుడు అరణ్యరోదనే.స్వార్థపు పునాదుల మీద పెరుగుతున్న విద్యావిధానపు అనేక దుషఫలితాలను అనేకం చూస్తున్నాం.అది మనం పెంచి పోషించిందే కనుక మిన్నకుంటున్నాం.నెత్తీ నోరూ బాదుకుంటున్నాం.ఈ విష సంస్కృతి ఆక్టోపస్ లాగా వ్యాపించి దేశవినాశనానికి దారితీస్తువ్నదనేది కాదనలేని సత్యం.

ఇక మరో కోణంలో ఆలోచిస్తే బళ్లు, పంతుళ్లు, పంతులమ్మలు,నియామకాలు,బదిలీలు,పదోన్నతులు,పాఠశాల వసతులు, పల్లెలు,పట్నాలు వాటి భౌగోళిక సామాజిక పరిస్థితులు,విద్యావిధానం,పాఠ్యాంశాలు,పాఠ్య ప్రణాళికలు,విద్యార్థుల నమోదులు, నిలకడలు,రాజకీయజోక్యాలు మొదలైనవన్నీ పరిశోధనలు చేసి పరిష్కారాలు వెదుక వలసిన జటిల సమస్యలు.వీటికి తోడు విద్యార్థి సంఘాలు,ఉపాధ్యాయసంఘాలు, బందులు,రాస్తారోకోలు,ర్యాగింగులు,స్ట్రైకులు, సరేసరి.

ఇన్ని లోటు పాట్లతో వున్న మన విద్యా వ్యవస్థ పునరుద్ధరించబడాలంటే ఎంత కష్టమో మనం ఆలోచించాలి.

---

## దొంగ పిల్లి

(7 వ పేజీ తరువాయి)

దా. దా. వంక విచిత్రంగా చూసి మళ్ళీ ఏడుపు మొదలెట్టాడు మూడో పి. బా.

ఈ దొంగ పిల్లి ఎవరో కాదు. 'కాలం'అనే పిల్లి. ఆయుష్షని తాగి పోతూనే వుంటుంది. అందుకే నిన్నటి 'పాల' గురించో, రేపటి 'పాల' గురించో ఆలోచించకండి. 'నిన్న' మళ్ళీ తిరిగిరాదు. రేపటి సంగతి రేపు చూసుకోవచ్చు.

'ఇవ్వాల్టి' పాలు పిల్లి తాగిపోతుందని ఏడవకుండా, నేటి జీవితాన్ని మనమే తాగటం (జీవితాన్ని) మొదలెడితే ప్రతి క్షణమూ ఓ అద్భుతమైన ఆనందాన్నే ప్రవిస్తుంది.

కనుక ప్రియ మిత్రులారా ... జీవితం క్షణికం గనకనే, క్షణాల్ని క్షణికాలన్నారు. క్షణాన్ని ఆ క్షణంలోనే అనుభవంగా మార్చుకున్న ఆ క్షణం నుంచే ఆనందం సిద్ధిస్తుందని స్వామీజీ చెప్పి, కథ ముగించారు.

శ్రీ గురుభ్యో న్నమః

మళ్ళీ కలుద్దాం.

మీ

భువనచంద్ర

# చిలకమర్తి దుర్గా ప్రసాదరావు





# SPOKEN SANSKRIT

+91 9897959425

## (సంభాషణ సంస్కృతం -17)

**Unit I.** अपेक्षया అపేక్షయా (comparatively) పోల్చిచూస్తే

ఒక వస్తువును మరొక వస్తువుతోనో లేక ఒకవ్యక్తిని మరొక
వ్యక్తి తోనో పోల్చవలసి వచ్చినప్పుడు మనం అపేక్షయా అనే పదం ఉపయోగించాలి .

**1.** विन्ध्यपर्वतस्य अपेक्षया हिमालयपर्वत: उन्नत:
**The Himalaya Mountain is comparatively taller than Vindhya Mountain.**
వింధ్యపర్వతంతో పోలిస్తే హిమాలయపర్వతం ఎత్తైనది .

**2.** रामायणस्य अपेक्षया महाभारतं बृहत्
**The Mahabharata is comparatively larger than the Ramayana.**
రామాయణంతో పోలిస్తే మహాభారతం పెద్దది .

**3.** यमुना नद्या: अपेक्षया गङ्गानदी दीर्घा
**The river Ganges is comparatively longer than the river Yamuna**
యమునానదితో పోలిస్తే గంగానది పొడవైనది

**4.** श्रव्यकाव्यस्य अपेक्षया दृश्यकाव्यं रमणीयतरम्
**Drama is comparatively more aesthetic than kavya (treatise).**
శ్రవ్య కావ్యంతో పోలిస్తే నాటకం చాల రసవంతమైనది

**5.** कार्यकरणस्य अपेक्षया कार्यकारणं कठिनम्
**Getting things done by others is comparatively more difficult, than doing things on their own.**
పని చేయడం కన్న పని చేయించడం చాల కష్టం

6. मम अपेक्षया मम मित्रं बुद्धिशाली
**నాకంటే నా స్నేహితుడు తెలివైన వాడు**

## Unit- II

तुमुन् **ఇది హేతువును సూచించే ప్రత్యయం. ఇందులో 'తుం' అనునది మిగులును మనం ప్రతిరోజూ ఎన్నెన్నో పనులు చేస్తూ ఉంటాము. ఏ పని ఎందుకు చేస్తున్నామో మనం చెప్పవలసి వచ్చి నప్పుడు మనం ఈ ప్రత్యయాన్ని ఉపయోగిస్తాము. ఉదాహరణకు కొన్ని పరిశీలిద్దాం**

1. पठति- पठितुम् **పఠతి-పఠితుం ( to read) చదువుటకు**
मीनाक्षी पुस्तकं पठितुं ग्रन्थालयं गमिष्यति ||

2. लिखति – लेखितुम् **(లిఖతి – లేఖితుం) ( to write) వ్రాయుటకు**
महिला परीक्षां लेखितुं कलाशालां गमिष्यति

3. पिबति – पातुम् **-పిబతి -పాతుం (to drink) త్రాగుటకు**
लता क्षीरं पातुं गृहं गतवती ||

4. खादति –खादितुम् **ఖాదతి – ఖాదితుం (to eat) తినుటకు**
बालिका अन्नं खादितुं गृहं गमिष्यति
**A girl is going home to eat food.**

5. मिलति – मेलितुम् **మిలతి- మేలితుం (to meet) కలుసుకొనుటకు**
अहं मम मित्रं मेलितुं कार्यालयं गच्छामि
**I am going to the office to meet my friend.**

6. भवितुम् **అగుటకు ( to become)**
स: वैद्य: भवितुं वैद्यशास्त्रं पठति ||
**He is studying medicine to become a doctor.**

7. क्रीडति-क्रीडितुम् **(to play)ఆడుటకు**
बालक: क्रिकेट क्रीडितुं क्रीडाङ्गणं गतवान् ||

8. त्यजति –त्यक्तुम् **త్యజతి -త్యక్తుం (to leave /to give up) విడుచుటకు**
देशभक्त: राष्ट्रहिताय स्वप्राणानपि त्यक्तुं संसिद्धो भवति ||
**A patriot is ready to give up his life for the welfare of his country**

5. जानाति –ज्ञातुम् **జానాతి -జ్ఞాతుం ( to know ) తెలుసుకొనుటకు**
बालक: शब्दस्य अर्थं ज्ञातुं निघण्टुं पठति
**A boy is reading dictionary to know the meaning of a word.**

6. करोति –कर्तुम् **కరోతి -కర్తుం ( to do ) చేయుటకు**

माता पाकं कर्तुं पाकशालां गतवती

**Mother went to kitchen to cook food.**

7. प्रक्षालयति –प्रक्षालयितुम्  ప్రక్షాలయతి –ప్రక్షాలయితుం (to clean) శుభ్రము చేయుటకు

पिता पादौं प्रक्षालयितुं स्नान गृहं गत्तवान् |

**Father went to bathroom to wash his feet.**

8. प्रेषयति –प्रेषयितुम्  (to send) పంపుటకు

सेवक: पत्रं प्रेषयितुं पत्रालयं गच्छति

**Servant went to the post office to send a letter.**

9. ददाति –दातुम्  దదాతి –దాతుం (to give) ఇచ్చుటకు

पिता पुत्राय धनं दातुं गृहम् आगच्छति

**Father is coming to the house to give money to his son.**

10. शृणोति- श्रोतुम् శృణోతి-శ్రోతుం (to hear / to listen to ) వినుటకు

माता उपन्यासं श्रोतुं देवालयं गतवती ||

**Mother went to temple to listen to a discourse.**

11. करोति---कर्तुम् కరోతి – కర్తుం (to do) చేయుటకు

ललिता  कार्यं कर्तुं गृहं गच्छति |

**Lalitha is coming to the house to do work.**

12. ददाति--- दातुम् దదాతి –దాతుం (to give) ఇచ్చుటకు

माता धनं दातुं भिक्षुकम् आह्वयति |

**Mother invites a beggar to give money.**

13. नयति---नेतुम् నయతి – నేతుం ( to take) తీసుకొనిపోవుటకు

बालिका पुस्तकं नेतुं ग्रन्थालयं गतवती ||

**A girl went to library to take a book.**

14. नृत्यति---नर्तितुम् నృత్యతి –నర్తితుం (to dance) నాట్యం చేయుటకు

नर्तकी नर्तितुं देवालयं गमिष्यति ||

**A dancer will go to temple to perform a dance programme.**

15. गायति---गातुम् గాయతి –గాతుం (to sing)పాడుటకు

मम मित्रं देशभक्तिगीतं गातुं जनानां पुरत: तिष्ठति |

**My friend is standing in front of audience to sing a patriotic song**

16. पृच्छति--- प्रष्टुम् పృచ్ఛతి –ప్రష్టుం (to ask) అడుగుటకు

छात्र: प्रश्नं प्रष्टुम् अध्यापकस्य समीपं गतवान् ||

**A student approached teacher to ask a question.**

17. प्रेषयति --- प्रेषयितुम् ప్రేషయతి - ప్రేషయితుం (to send) పంపుటకు

18 . मापयति--- मापयितुम् మాపయతి –మాపయితుం ( to measure)

मालाकार: मालां मापयितुं मापिकां स्वीकरोति||
**A garlander is taking a scale to measure the garland**

**19 .** तोलयति--- तोलयितुम् **తోలయతి –తోలయితుం (to weigh)**
वर्तक: वस्तूनि तोलयितुं तुलाम् आनयति||
**The business man is taking balance to weigh the commodities.**
**20 .** ज्ञापयति--- ज्ञापयितुम् **జ్ఞాపయతి –జ్ఞాపయితుం ( to remind)**
प्रधानाध्यापक: परीक्षायां तिथिं ज्ञापयितुं छात्रान् आह्वयति
**The principal is inviting students to remind/announce the date of the examinations.**
**21.** प्रक्षालयति– प्रक्षालयितुम् **ప్రక్షాలయతి –ప్రక్షాలయితుం ( to clean/wash)**
माता गृहं प्रक्षालयितुं जलं नयति || **Mother is taking water to clean the house.**
**22.** पूजयति—पूजयितुम् **పూజయతి-పుజయితుం (to worship)**
भक्त: देवं पूजयितुं पुष्पाणि क्रीणाति ||
**The devotee is purchasing flowers to worship God.**

महिला शिशुन् पोषयितुम् उद्योगं करोति||
**A lady is doing job to feed children.**
**13 .** आनयति--- आनेतुम् **(to bring)**
माता जलम् आनेतुं नदीतीरं गतवती
**Mother went to riverbank to bring water.**

**Unit III . A.** किन्तु **(but) nevertheless**

अहं चलनचित्रं द्रष्टुम् इच्छामि किन्तु मम समपे धनं नास्ति ||
मम बुभुक्षा अस्ति किन्तु न खादामि ||
पुस्तकम् अस्ति किन्तु पठितुं समय: नास्ति ||

**B.** किल **verily, 2. Likely hood (probably, possibly) 3. Conciliatory, 4. Assertion, certainly (indeed, verily, assuredly**
**5. False hood.**
या पाणिनिसूत्राणि संपूर्णतया रटनम् अकरोत् सा पञ्चवर्षीया बालिका स्यात् किल | **పాణిని సూత్రములను వల్లె వేసిన ఆమె ఐదు సంవత్సరముల పిల్లట కదా !**
य: भगवद्गीतास्पर्धायां विश्वविजेता अभतत् स: दशवर्षीय: बालक: किल| **గీతాస్పర్ధలో విశ్వ విజేత యైన ఆ వ్యక్తి పది ఏండ్ల పిల్లవాడట కదా !**

**C.** निश्चयेन = **undoubtedly , decisively, certainly**
स: निश्चयेन विजयं प्राप्नोति
**(He will definitely win)**

**D.** बहुश: **probably, many times, in many ways.**
मम पुत्र: गृहं आगच्छति बहुश: तस्य विराम: दत्त: भवेत् || **My son came to see me; probably holidays might have been given to him.**

## Unit IV-गृहे केषाञ्चन वस्तूनां नामानि

द्वारम्=**door** ताल:= **lock** कुञ्चिका =**key** वातायनम्=**window**
कवाटम्=**door** शौचालय:= **lavatory** स्नानालय:= **bathroom**
वस्त्र क्षालकम् = **washing machine** सोपानानि=**steps** कपाटिका= **cupboard** वस्तुधानी= **almairah** आसन्द:= **chair** उत्पीठिका= **table**
संगणकयन्त्रम् = **computer**
दूरवाणी =**phone** दूरदर्शिनी= **Television** पिञ्ज:= **switch**
व्यजनम् =**fan** दण्डदीप:= **tube light**

## UnitV-वाहनानां नामानि

कार यानम् – मम पिता कारयानेन कार्यालयं अगच्छत् | **మా నాన్న గారు కారులో ఆఫీసుకు వెళ్ళీరి .**
स्कूटरयानम् – अहं स्कूटर् यानेन कळाशालां गच्छामि |
**నేను స్కూటరు పై కాలేజికి వేళ్ళుచున్నాను**
विमान यानम्- मुख्यमन्त्री विमान यानेन विदेशं गमिष्यति – **ముఖ్య మంత్రి విమానంలో విదేశాలకు వెళ్ళెదరు**
इत्यादि

**subhaashitam:**

घर्मं धत्ते भरं कुसुमपत्र फलावालीनां
व्यथां वहति शीतभवां रुजं च
यो देहमर्पयति चान्यसुखस्य हेतो:
तस्मै वदान्य गुरवे तरवे नमोऽस्तु ||

**A tree always bears the load of flowers, leaves and fruits , it suffers from the diseases caused by heat and cold and sacrifices the entire body for giving comforts to all. It is indeed the best among donors . I salute the tree .**

**చెట్టు పువ్వులు , ఆకులు ,పండ్ల యొక్క భారాన్ని తనే మోస్తుంది . ఎండ బాధను తట్టుకుంటుంది. చలి, చలివలన కలిగే రోగాలను స్వంయంగా అనుభవిస్తుం ది. తన శరీరాన్ని ఇతరులప్రయోజనానికే అంకితం చేస్తుంది. దాతలలో కెల్ల దాతయైన ఆ చెట్టుకు నమస్కారం.**

# నందుల ప్రభాకర శాస్త్రి



## మా ఊరి నందుల ఆత్మీయ కథ

(గత సంచిక తరువాయి)

ఇంటికి చేరుకున్నాక గాటికి కట్టేయాలంటే, అటువైపు, ఇటు వైపు ఇనుప ముకుతాడుకు పగ్గం గాటికి కట్టేసేవాడు. కొమ్ముల దగ్గర నుండి ఇంకో తాడు రెండువైపులా కట్టి, ఆ మధ్యను చెండుకు తగిలించేవాడు. అంటే కుడి ఎడమలకు గాని, కిందకు పైకీ గానీ తల ఆడించకుండా. ఆడిస్తే 'ముక్కుతాడు' విపరీతంగా నొప్పి పుడుతుంది.

గాట్లో గడ్డి తినేటప్పుడు మాత్రం దూలం పైకి ఎక్కి చెండు తాడు తీసేవాడు. బయటకి తీసుకు రావాలంటే మళ్ళీ అన్నివైపుల తాడు బిగించేవాడు. ఎన్ని రోజులనుండి దాని కడుపులో ఈ ఆవేదనను దాచుకుందో, ఒకరోజు పొలం దున్నటానికి అన్ని జాగ్రత్తలు తీసుకుని, పొలం దున్నటం అయిపోగానే కాడి విప్పటం కోసం కాడిమాను ముందుకు వచ్చాడట.

చెండు తాడు లేదు కాబట్టి తల కిందికి పైకి ఆడించగలదు. ఈ అదును చూసి ముందుకు వచ్చిన వాడిని కసిగా కొమ్ములతో ఒక్క పోటు పొడిచిందట. విషయం తెలిసినవాడు కాబట్టి పరిగెత్తి పోకుండా అక్కడే బోర్లా పండుకున్నాడట. ఇంక పొడవటానికి అవకాశం లేక రెండు కాళ్ళు పైకెత్తి దభ దభ మని తొక్కుతుందంట. ఈ విషయాన్ని గమనించిన చుట్టుపక్కల రైతులందరూ అరుస్తూ... కర్రలతో బెదరగొట్టేటప్పటికి తగ్గిందట. దీని జత ఎద్దు మాత్రం బిక్కుబిక్కు మంటూ నిలుచుండిపోయిందట.

మనిషి తానే చాలా తెలివైనవాడినని, ఇతరుల బలాలను, బలహీనతలను వాడుకుని పైకి వద్దామనుకుంటాడు.

### కత్తెర గాడు

ఆ ప్రాంతంలో ఎద్దుల గురించి చెప్పినప్పుడు 'కత్తెరగాడి' గురించి చెప్పకుంటే అది సమగ్రంగా ఉండదు. ఈయన అసలు పేరేంటో ఎవరికీ తెలియదు. మనిషి నాలుగున్నర అడుగుల ఎత్తుంటాడు. పీలగా, గుబురు మీసాలతో, ఎప్పుడూ ఎద్దుల చుట్టూ తిరుగుతూనే ఉంటాడు. అట్లాగని వాటితో వ్యవసాయం చేయడు. ఒక విధంగా చెప్పాలంటే బ్రోకర్. కొనేవారికి అమ్మేవారికి సంధానకర్త. ఆ రోజుల్లో 'బ్రోకర్' అనే మాట చాలా నీచంగా ఉండేది. అందుకే అతనిని 'కత్తెరగాడు' అనేవారు.

అమ్మేవాడి దగ్గర, కొనేవాడి దగ్గర ఇద్దరి దగ్గరా కమీషన్ కొట్టేస్తాడు. అమ్మేవాడికి దగ్గర చెప్పే మాటలు అమ్మేవాడికి, కొ-





నేవాడికి చెప్పాల్సిన మాటలు కొనేవాడికి చెప్పుతాడు. అమ్మేవాడెంతకు అమ్ముతాడో కొనేవాడికి తెలియదు. ఒకే విషయాన్ని అనుకూలంగానూ, ప్రతికూలంగానూ చెప్పి వొప్పించగలడు. ఉదాహరణకు పొడిచే ఎద్దుల విషయమే తీసుకోండి. నందుల సుబ్బయ్యతో పొడిచే ఎద్దు గురిచి భయంకరంగా చెప్పి భయపెడతాడు. 'ఇంట్లో పిల్లలు, ఆడాళ్ళు తిరుగుతుంటారు. ఎప్పుడైనా కోపమొచ్చి కొమ్ము విసిరితే... గతేంటి? అజాగ్రత్తగా ఉన్నపుడు నీ మీదికే కొమ్ము విసిరిందనుకో ... ఏదో ఒక రేటుకు అమ్ముకో..' అంటూ సముచిత సలహా ఇస్తాడు. ప్రాణంపై ఆశ వున్న ఎవరైనా ఇంత మంచి మాట చెప్పినందుకు అభినందించి.. నీ ఇష్టం... అంటూ చేతులెత్తేస్తారు.

కొనేవాడి దగ్గరకెళ్ళి, 'నీకు మంచి ఎద్దు పనికి అవసరముందని తెలుసు. పదెకరాలైనా, నిలబడకుండా దున్నే శక్తిసామర్థ్యాలు ఉండే మంచి కోడెను చూసిపెట్టా. అగ్గువగా వస్తుంది. అది నీకైతే సరిపోతుంది. కాదంటే కొంచెం కొమ్ము ఇసిరే అలవాటు వుంది. నీలాంటి వాడికి అదేం లెక్కలోనిది కాదు. నువ్వయితే దాని పొగరు, వగరు కసి వంచి పని చేయించుకోగలవు. నీలాంటి మొగాడి చేతిలో ఎంత పెద్ద ఎద్దయినా గంగిరెద్దులా తల ఆడించాల్సిందే. నీ గదమాయింపుకే దడుసుకుంటాయి ఎద్దులు, చూడు మరి... ధైర్యం చేశావంటే... ఏనుగంటి ఎద్దు.... తక్కువ బేరానికే కుదిరిస్తా. కాదంటే చెప్పు, దానిని అణగదొక్కి పనిచేయించుకునే 'మొగాళ్ళు' చాలామంది వున్నారు...' అంటూ బయలుదేరతాడు.

కొట్టాల్సిన చోట, మగతనం మీద కొడ్తే... ఏ మగాడు ఊరుకుంటాడు... కొంటాడు అంతే.... అయిదు వందలకు కొని పదిహేను వందలకు అమ్ముతాడు..అదీ కత్తెరగాడి దెబ్బ అంటే..

(ఇంకా వుంది)

# ఎలక్ట్రాన్



# డిజైనర్ గెడ్డం

బాల్యంలోంచి కౌమారంలోకి అడుగుపెట్టేనే వయసుకు చెందిన వికారాలు నెమ్మది నెమ్మదిగా మనసుల్ని సతాయిస్తాయి. అయితే వాటి వేగాన్ని చలనచిత్రాలు, అంతర్జాల నీలి దృశ్యాలూ పెంచేస్తున్నాయన్నది సత్యదూరం కాదు.

కులపతి ప్రథమ వీక్షణంలోనే నీలవేణి అంటే వెర్రి వ్యామోహంలో పడిపోయాడు. పెద్దగా నేపథ్యం వివరించనవసరం లేదు కాని, సంగతిలోని క్లిష్టత ఏమిటంటే కులపతి బి.ఏ. స్టూడెంట్. నీలవేణి బదిలీ మీద మరో ఉరునుంచి వచ్చి, కొత్తగా కాలేజీలో చేరిన బోటనీ ఉపన్యాసకురాలు. పేరుకి తగ్గవర్ణమన్నా, లేదా వర్ణానికి తగ్గ పేరన్నాఆకృతిలో మట్టుకు అప్సరస. మతులు పోగొట్టే మీన నేత్రి. నవ్వుతూ సమ్మోహనపరిచే సుదంతి. కేవలం కులపతినే ఆడిపోసుకోవడం సవ్యం కాదు. ఎందుకంటే ఆ కాలేజీలోని మగపురుగులందరూ వయో, స్థాయీ భేదాలు లేకుండా నీలవేణిని అంతరంతరాల్లో కేవలం కవుల, చిత్రకారుల ఊహా వర్ణనలకీ, రూపాలకీ పరిమితమైన రంభా, మేనకా, ఊర్వశీ, లేదా తిలోత్తమల్తో కాకుండా, కంటికెదురుగా రంగుల తెరలమీద కనిపించే శృంగారనాయికలతో పోల్చి,‘అబ్బే! నీలవేణి నల్లటి అందాల ముందు వీరందరూ దిగదుడుపే!’ అన్న ధోరణిని భరిణెల్లాంటి మనస్సుల్లో పదిలంగా దాచేసుకొని మూతలు బిగించేసుకొన్నారు.

అయితే అందరూ ఆశపడడం మానసికమే అయినా, కొందరు బ్రహ్మచారులకు మట్టుకు నీలవేణిని ఆకర్షించుకొనే అర్హతా, ధైర్యమూ, అవకాశమూ ఉందని చెప్పుకోవచ్చు. ఈ బ్రహ్మచారి మూకల్లో ఉపన్యాసకులది స్వల్పశాతమైతే, విద్యార్థులది అధికశాతం. అయితే అధికశాతం విద్యార్థుల్లో, అధికశాతం వారివి ఇంకా నూనూగు మీసాలూ, గెడ్డాలే కానీ రాటుదేలిన మొహాలు కావు. అదీకాక చేతిఖర్చులకోసం అమ్మానాన్నల వెనక పడాల్సిందే. ఈ విధంగా ఆలోచిస్తే ఉపన్యాసకులది పై చెయ్యే! మధ్యాహ్న విరామసమయంలో కళాశాల ప్రాంగణంలో మర్రి చెట్టునీడ కింద ప్రతిరోజూ జరిగే నీలవేణి పురాణంలో ఎవరో ఈ మాటంటే కులపతి అరిచి, కరిచినంత పని చేశాడు. “మొన్న తకుల్, రమన్నాల సినిమాలు మల్టీప్లెక్స్ లో ఒకేసారి ఆడుతున్నప్పుడు వాళ్ళూ, మనమూ కూడా క్యూ కట్టేశాం కదా? అలాంటిదిప్పుడు నీలవేణి విషయంలో మనం ఎందుకు పోటీ పడకూడదని?”

“నిజమేనబ్బీ! వాళ్ళయితే మహామాల్ ఫుడ్ కోర్టులో నూట యాభై రూపాయలు పెట్టి జంబో కాంబోలిప్పించగలరు. వందరూపాయలు టికెట్ కొనుక్కోడానికే మనలో చాలమందికి తల ప్రాణం తోకకి వచ్చింది! నీకు డబ్బుకొరత లేదుకాబట్టి నాకూ కొన్నావ్! ఇకపోతే అసలు విషయానికొస్తే వాళ్లలోని బ్రహ్మచారులు వివాహయోగ్యులు. నీలవేణి కనికరించి ఎవరో తనకి నచ్చినవాడి మెడలో వరమాల వేయొచ్చు! మనమూ వయసొచ్చిన యోగ్యులమే కావొచ్చు. కానీ చదువు పూర్తికాని కుర్రవెధవలం. సంపాదనలేని పరాధీనులం. పూర్వకాలంలో ఎకరాలుంటే చదువులు లేకపోయినా

పర్వా ఉండేది కాదు. ఇప్పుడలాకాదు, ఎకరాలున్నా చదువూ, ఉద్యోగమూ లేకపోతే, కుంపట్ల బరువులు తొందరగా దించేసుకొందామనుకునే తల్లిదండ్రులు కూడా వెయ్యి విధాలా ఆలోచిస్తారు. అందుకని అందని నల్ల ద్రాక్షపళ్లమీద ఆశలు పెంచుకోకుండా చదువు మీద శ్రద్ధపెట్టి అఘోరించు. పెళ్ళంటే పెద్దవాళ్లు మూతి పళ్లు రాలగొడ్తారు!" అన్నాడు వేదాంతం అనే ఓ స్నేహితుడు ఓ ఆంతరంగిక ప్రత్యేక సంభాషణంలో.

"నువ్వన్నమాట బాగు బాగు! కానీ పేజీ తెరిస్తే తెల్లటి కాయితం మీది నల్లటి అక్షరాల పంక్తుల మధ్య నీలవేణే దర్శనమిస్తోంది. ఇక చదువెలా కొనసాగేది? దారి చూపమంటే సోది చెబ్తే ఎలా?"

"కావాల్సినవాడివి కాబట్టి చదువు మీద తట్ట బోర్లించుకోవద్దని చెబ్తున్నాను. సరే! నీ కోరిక తీరడానికి ఉన్న మార్గాలు, కలిగే అవరోధాలు గురించి ఆలోచిద్దాం. మీ నాన్నది లక్షల్లో కొనసాగుతున్న చింతపండు వ్యాపారం. అందుకని డబ్బుకి కొదవలేదు. నీకు చదువు అబ్బకపోతే ఎలాగూ చింతపండు వ్యాపారమే చేసేవాడివి. పోతే ఎండు మిరపకాయలూ, పసుపు కొమ్ములూ వ్యాపారానికి జోడించే వాడివి. నీ రంగు ఉమేష్బాబు రంగు. పాలమీగడ భామలు కూడా ఆగి నీ రంగు చూసి అసూయపడేలాంటి రంగు. అయితే నీ డి.ఓ.బి ఎప్పుడు?"

"డి.ఓ.బి యా, అదేమిటి?"

"డేట్ ఆఫ్ బర్త్! పుట్టినతేదీ? సరే! మనందరం ఇంచుమించు ఒకే వయసు వాళ్ళం కాబట్టి 19 లేక ఇరవై. ప్రస్తుతానికి ఇంకా చేతికందని బోడి బి.ఎ. డిగ్రీ గాళ్ళం. ఆమె ఎం.ఎస్సి. పి'హెచ్. డి. డొంకాడ ప్రభుత్వకళాశాలలో మూడేళ్లు పనిచేసి ఇక్కడకు బదిలీ మీద వచ్చింది. అంటే కనీసం ముప్పై! నీలవేణి కన్న మనందరం పదేళ్ళు చిన్న. వరహీనం అన్నమాట. అమ్మానాన్నలు ఒప్పుకోనే విషయం కాదు!"

"ఏమిటి వేదాంతం! మాటల్లో మనం అని కలిపేస్తున్నావ్?" కులపతి చికాకుగా అన్నాడు.

"ఏదో మాటవరసకి అలా వచ్చేసింది. మానాన్నకి వ్యాపారమూ లేదు, చెప్పుకోతగ్గ ఉద్యోగమూ లేదు. నాకు రంగూ లేదు, కండలూ లేవు. రెడీమేడ్ దుస్తులు నాకు నప్పవు. అందుకని నేను నీకు పోటీ కాదు. బెంగపెట్టుకోకు!"

"సమసమాజంలో స్త్రీ పురుషులకు సమాన హక్కులుండాలి. మొగపురుగులు ముప్పై ఏళ్ల వయోబేధంతో పెళ్లిళ్లు చేసుకోవటల్లేదా ఏమిటి? సినిమా హీరోలు, రాజకీయ నాయకులు -కళ్లెదుటగానే ఎన్నో దృష్టాంతాలు! అలాంటిది స్త్రీలకీ అలాంటి వెసులుబాటు ఉండాలి కదా?"

"లక్షలకి లక్షలుంటే... కాదు, కాదు, ఈ కాలప్రమాణాల బట్టి కోట్లకి కోట్లుంటే ఇరుపక్షాలా ఏజీ, గీజీ అన్నీ రాజీయే!"

"మా నాన్నకి లక్షలున్నాయి. నువ్వన్నట్టుగా నేను వ్యాపారంలోకి దిగితే కందులూ గిందులూ, పెసలూ గిసలూ అన్నీ జోడించి కనీసం కోట్ల బరిలోకి ఎదిగిపోతాను!"

"చూడు కులపతీ! ఆడది మగసిరి కూడా చూస్తుంది. అది ..."

"నాకేం తక్కువ?"

"తక్కువని కాదు. ప్రస్తుతానికి మనది ..కాదు, కాదు, నీది ఇంకా పరిపక్వత గోచరించని రూపు. ఈ కాలంలో ఆడవాళ్లు డిజైనర్ కంచుకాలు అంటే రవికలు, మగవాళ్ళు డిజైనర్ గెడ్డాలూ పరస్పరాకర్షణకోసం సాధనాలుగా, విధానాలుగా ఉపయోగించేసుకొంటున్నారు. దూరదర్శన్ ప్రసారవాహినుల పలు కార్యక్రమాల్లో యాంకర్ల, గాయకుల, ఇతర కళాకారుల ఆహార్యాల తీరు గమనిస్తే ఈ విషయం స్పష్టంగా కనిపిస్తుంది. నీదింకా బాల గెడ్డం. కాసిన్నైనా మొరటు అందాలు లేనిదే పురుషుల్ని స్త్రీలు అంతగా ఇష్టపడరట? దీనికీ చాలా దృష్టాంతాలు లేకపోలేదు. 'అయ్యో! వాళ్ళో ఏం చూసి ఆ గెడ్డాల బూచిని చేసుకుంద'ని మనం ఎన్నో సందర్భాల్లో వాపోయిన రోజులు లేవూ?"

"అంటే నేనిప్పుడు డిజైనర్ గెడ్డాన్ని, మీసాన్ని పెంచాలన్నమాట?" అడిగాడు కులపతి.

"అన్నమాటే కదా? ఇదివరలో సినిమాల్లో కేవలం విలన్లకే గెడ్డాలు, మీసాలు, బుట్టజూట్లు ఉండేవి. కానీ ఈ మధ్య ఏ సినిమాలో చూడు! హీరోలందరూ డిజైనర్ గెడ్డాలతోటి, మీసాలతోటీ, రకరకాల కొప్పు జుట్లతోటీ దర్శనమిచ్చేస్తున్నారు. అందరూ అని కాదుకాని, కొందరు హావభావ ప్రకటనా సామర్థ్యం లేనివాళ్ళని ఈ డిజైనర్ గెడ్డాలు ఆదుకొంటున్నాయి. గెడ్డం ఉంటే తెలివైన ఘట రూపం అంటే ఇంటెలిజెంట్ అప్పియరెన్స్ వచ్చేస్తుందని విద్యార్థులుకూడా ఈ మధ్య గెడ్డాలూ, మీసాలూ పెంచేస్తున్నారు." వేదాంతి అన్నాడు, లేని గెడ్డాన్ని దువ్వుకుంటూ.

"నన్నేం చెయ్యమన్నావ్? ఉమేష్ బాబుది బాల అందమే! గెడ్డాలూ, మీసాలూ అతగాడికి నప్పవు! అయినా ఎంతమంది స్త్రీ హృదయాల్ని దోచేసుకొన్నాడు!"

"నీదీ అలాంటి అందమే నంటావు, కాదనను. కానీ నీలవేణి మొరటు అందాల ముందు నువ్వు తేలిపోకుండా ఉండాలంటే ప్రయత్నం చెయ్యాలి మరి!"

"బట్టతలకి తైలాలంటూ చాలా చాలా ప్రకటనలు చూశాను కానీ, గెడ్డాలు, మీసాలు త్వరగా పెంచే క్రీముల గురించి కానీ, తైలాల గురించి కానీ ప్రకటనలు చూడలేదు," అన్నాడు కులపతి కాస్త విచారంగా.

" అవును, అతినున్నగా గెడ్డం గీసుకోడానికి మల్టీబ్లేడ్ రేజర్లు, షేవింగ్ క్రీములూ, పెరిగిన గెడ్డాల్ని కావల్సిన తీరులో షేప్ చేసుకోడానికి ట్రిమ్మర్లూ మార్కెట్లను ముంచెత్తుతున్నాయి కానీ, ఇవిమట్టుకు కాదు. బహుశా దీనికి హార్మోన్ ట్రీట్మెంట్ తీసుకోవాలనుకొంటాను," అన్నాడు వేదాంతి తన అభిప్రాయం చెబ్తూ.

"నీకు తెలుసున్న డాక్టరెవరైనా ఉంటే చెప్పు. వెళ్ళి కలుద్దాం."

కాలేజీకి మూడు సెలవుదినాలు కలిసివస్తే వేదాంతాన్ని తోడుగా తీసుకు పోయి నగరంలోని ఓ హార్మోన్ వైద్యుణ్ణి కలిశాడు కులపతి. అయిదువందలు కన్సల్టేషన్ ఫీజు, పదిహేనువందలు టెస్ట్ల ఫీజు సమర్పించుకొని చక్కని కబురు విన్నాడు. సలహా అందుకొన్నాడు. "నీకు మగసిరికి లోపం లేదు. చక్కగా చంద్ర బింబంలాంటి మొహం ఉండగా, ఈ బెడద ఎందుకు? కొంచెం ఆలశ్యమైనా గెడ్డం రాక చస్తుందా ఏమిటి? శుభ్రంగా చారులో, పులుసులో, సాంబారులో, కూరల్లో ములక్కాడ తింటూ ఉండు. గుణం కనబడుతుంది."

కులపతి అలా కాదన్నాడు.

"కాదూ, కూడదూ అంటే వైద్యం చేస్తాను. కానీ ఫుల్ కోర్సు ట్రీట్మెంట్ కి రెండు లక్షలౌతుంది. దీనికి నీ పేరెంట్స్ అంగీకారం కూడా అవసరం!"

కులపతి నిట్టూరుస్తూ వెనుదిరిగాడు. స్నేహితుడి తిక్క వైద్యుడు కుదిర్చాడని వేదాంతి లోలోన సంతోషించాడు. తిరుగు ట్రైన్ ఎక్కేముందు, కులపతి నగరంలో పేరొందిన ఓ బ్యూటీ సెలూన్ లోకి దారితీశాడు. మీస, గెడ్డాలు త్వరగా పెరిగే మార్గాలు ఓ ప్రొఫెషనల్ గా సలహా ఇమ్మన్నాడు.

"ఆట్టే మొలవటల్లేదు కదా అని షేవ్ చేసుకోవడం మానకండి. ప్రతిరోజూ ఉదయం ఏ రకమైన క్రీమూ వాడకుండా కేవలం చన్నీళ్ళతో గెడ్డం మర్దనా చేసుకొని, మామూలు బ్లేడు బిగించిన రేజరుతో బరబరా గెడ్డం గీసుకోండి. నెమ్మదిగానైనా గెడ్డం మొరటుగా గరుక్కాయితంలా మొలుస్తుంది." అన్నాడు ఛీఫ్ హైర్ డ్రెస్సర్ కేశానంద్.

"అంత వ్యవధిలేదు!" మా స్నేహితుడు సహజసిద్ధంగా మొలిచిన గెడ్డంతో ఓ నెలరోజుల్లో మా కాలేజీ డ్రామాలో నటించాలి!"అన్నాడు వేదాంతం ఓ చిన్న బొంకు బొంకుతూ.

"ఓ! దానికీ పద్ధతి ఉంది. అదో పెద్ద సమస్య కాదు. మీకిప్పుడు మధ్యస్థమైన క్షవరం చేస్తాను. ఓ పల్చటి సింథటిక్ పొరమీద ఆ కత్తిరించిన కేశాల్ని ఒక ప్రత్యేకమైన పద్ధతిలో అతికించి, మీ గెడ్డం కొలతల ప్రకారం, మీకు కావల్సిన డిజైన్ ప్రకారం కృత్రిమ

గెడ్డం తయారు చేస్తాను. అది ఓ స్పెషల్ సోల్యూషన్ తో అతికించుకొంటే అస్సలు ఎవరికి తెలియదు. ఎంతకాలమైనా చెక్కు చెదరకుండా అలానే ఉంటుంది.ఎంత పీకినా ఊడదు. తీసేయాలనుకొన్నప్పుడు వేన్నీళ్లలో మరో సొల్యూషన్ కలిపి రుద్దుకుంటే సులువుగా ఊడి వచ్చేస్తుంది. ఒకసారి తీసేసిన తర్వాత అది మరి ఉపయోగంలోకి రాదు. ఇంకోటి వాడాల్సిందే. అంతేకాదు ఇప్పుడు చేసే క్షవరం తాలూకు కేశాలతో రెండు కృత్రిమ గెడ్డాలు తయారు చెయ్యగలను. మీరు రెండూ వేరు వేరు డిజైన్లలో కావాలన్నా చేసేస్తాను. ఇదిగో డిజేన్ల కేటలాగ్ చూడండి....ఇది టెలివిజన్లో మహిళాకార్యక్రమాల్ని దిగ్విజయంగా నిర్వహించే సందీప్ కుమార్ .. ఇది పాటల ప్రోగ్రాం లో పాడే తరుణ్ కుమార్- ఇది మమతా గారేజ్ లో వాగ్ధాటిరాజా- ఇది తమిళ సింహం ఆర్య..... “

“బాగానే ఉంది. టైమెంతకావాలి? ఖర్చెంత అవుతుంది.”

“క్షవరం చేయించుకొన్న తర్వాత, తయారీకి రెండు రోజులు వ్యవధి కావాలి. మా సెలూన్ లో ఉత్తి క్షవరానికి మూడొందలు. కృత్రిమ గెడ్డం తయారీకి పదివేలు. అతికించే సోల్యూషన్ అయిదు వేలు. ఊడదీసే సొల్యూషన్ పది వేలు. కృత్రిమ గెడ్డం చేయించుకొంటే క్షవరం మూడొందలూ ఫ్రీ. తయారీకి అడ్వాన్స్ పదివేలు! రెండు డిజైన్లలో చేయించుకోవాలంటే మొత్తం యాభైవేలమీదా అయిదు శాతం రాయితీ! అడ్వాన్స్ మట్టుకు ఇరవై వేలు.”

“సరే! ఆలోచించుకొని మళ్ళీ వస్తాం. కాలేజీ డ్రామాలో గెడ్డాలంకారం కోసం ఇంతఖర్చంటే మా ఔత్సాహిక ముఠా ఒప్పుకోదు.” అన్నాడు కులపతి ఏడుపు మొహంతో.

“క్షవరమైనా చేయించుకోకుండా నా టైమ్ వేస్ట్ చేశారు. నూట యాభై ఇచ్చి కదలండి!” అన్నాడు కేశానంద్.

“మీకు నూటయాభై యిస్తే మేము నూటయాభై కిలోమీటర్లు నడిచి వెళ్ళాలి! చిన్న సలహా కోసం వస్తే ఇలా దోచుకోవడం భావ్యం కాదు!” అన్నాడు కులపతి. తెచ్చుకొన్న డబ్బులో అధికభాగం హార్మోన్ డాక్టరు హరించేశాడు మరి!

“పర్వాలేదు. టిఫిన్లు మెక్కి బిల్లు చెల్లించకపోతే హోటలు వాళ్ల లాగే నాకు ఓ పద్ధతి ఉంది. సలహాకోసం వచ్చినా, క్షవరంకోసం వచ్చినా నేను వెచ్చించిన కాలానికి విలువ ఉంటుంది కదా? ఇది వృత్తిధర్మo. నాదగ్గర ఎప్రెంటిస్ చేసే ఇద్దరు కుర్రాళ్ళున్నారు. వాళ్ళకి ప్రథమ సోపానంగా గుళ్లు గీకడం నేర్పుతున్నా. మీరిద్దరు గుండు గీయించుకొని వెళ్ళాల్సిందే! ఉచితమే కాబట్టి, ఉన్న డబ్బుల్తో మీ ఊరు రైలుమీదే పోదురుగాని!” అంటూ కేశానంద్ తన శిష్యులకు వీళ్ళ తలల్ని అందించేశాడు.

తలనీలాలస్వామికి మొక్కు పెట్టుకొని, ముందస్తుగానే తీర్చుకొని వచ్చేశామని ఇద్దరూ ఇళ్ళలో చెప్పారు. గుండు సాక్ష్యంగా ఉంది కాబట్టి పాపం వాళ్ళు నమ్మేశారు.

“ఏరా మీరిద్దరూ పరీక్షలకి ముందుగానే మొక్కు పెట్టేసుకొని, గుండు గీయించుకొని వచ్చేశారా? మాతో చెబ్తే మేమూ వచ్చేవాళ్లం కదా?” అన్నారు కొందరు స్నేహితులు.

కోరి సలహా తీసుకొన్నందుకు కులపతీ, బోడి సలహా యిచ్చినందుకు వేదాంతి, గుళ్ళు తడుముకుంటూ క్లాసులకు వెళ్లారు. అటుపైన కులపతి నీలవేణిని గురించి మరి ఆలోచించ లేదు! ఎంతయినా కుర్రవాళ్ళకి పంతులమ్మలమీద వ్యామోహం పనికిరాదు! బ్రహ్మచారి పంతుళ్లమీద మనసులు పారేసుకొనే అమ్మాయిలకున్న ఈ వెసులుబాటు అబ్బాయిలకుండదు. ఉండకూడదన్నా వయసూ, మనసూ ఊరుకోవు!

****

హనమకొండ

29-03-2018

పి.వి.రమణ రావు

# ప్రహేళిక

## జవాబు చెప్పగలరా?

ఈ క్రింది వాక్యములలోని ప్రతి అక్షరము, అసలు అక్షరమునకు బదులు వేరే అక్షరము వాడబడినది. ఉదాహరణకు, 'క' అనే అసలు అక్షరం బదులు 'ర' అనే అక్షరం వాడారని మీరు అనుకుంటే, ఈ వాక్యములలో ఎక్కడ 'ర' వచ్చినా దాని అసలు అక్షరం 'క' మాత్రమే అవుతుంది. వత్తులు, గుణింతాలు అన్నీ అన్వయిస్తాయి.

మీరు చెయ్యవలసినదల్లా అసలు వాక్యాన్ని కనుక్కోవడమే. ప్రయత్నించండి.

( ఆధారం : ణ = అసలు అక్షరం 'ల' )

**సూనజ నాను బశాళ్ళుణు**

**గా నఖబుణ టింర్ణజరజు గప్పుమ ణెణ్ణం**

**తానలబు బంతవబుణజు**

**యూ నాజ దుఛంచు బాజు యిహబు బశాళ్ళా !**

(మీ జవాబు teega51@gmail. com కి పంపించండి.)

**గతనెల జవాబు :**

చేతులారంగ శివుని బూజింపడేని
నోరు నొవ్వంగ హరికీర్తి నుడువడేని
దయయు సత్యంబు లోనుగా దలపడేని
గలుగ నేటికి దల్లుల కడుపు జేటు

ఏప్రిల్ నెల ప్రహేళికకు సరియైన జవాబు పంపినవారు: శ్రీ వేదుల సుబ్రహ్మణ్యం, బెంగళూరు

# కొత్త రామానందం



## అధిక జ్యేష్ఠ మాసం

చాంద్రమానం ప్రకారం మూడు సంవత్సరాలకు ఒకసారి అధిక మాసం వస్తుంది. ఈ సంవత్సరం అధిక జ్యేష్ఠ మాసం ది. 16 మే 2018 న ప్రారంభమై జూన్ 13 వ తేదీ వరకు ఉంటుంది. తర్వాత నిజ జ్యేష్ఠమాసం ప్రారంభమవుతుంది.

* ఏ నెలలో సూర్య సంక్రమణం జరగదో ఆ నెలను అధికమాసంగా పరిగణిస్తారు.

* సాధారణంగా గతంలో వచ్చిన అధిక మాసం నుంచి 30 మాసాల అనంతరం 8 వ మాసం లేదా 9 వ మాసం అధిక మాసం అవుతుంది.

* అధికమాసం శుభ కార్యాలకు పనికిరాదు. ఎందుకంటే అధిక మాసం శూన్య మాసం.

* వివాహాలు, ఉపనయనాలు, తీర్థయాత్రలు, గృహప్రవేశాలు, నూతన వస్త్రాలను ధరించడం వంటివి అధిక మాసంలో చేయరాదు.

* నిత్యపూజలు, పునః ప్రతిష్టలు వంటివి జరుపవచ్చును.

* మరణించినవారి ఉత్తరక్రియలు అధికమాసంలో చేయవచ్చు.

* ఒకవేళ పితృదేవతల ఆబ్ధికం జ్యేష్ఠమాసంలో ఉన్నట్లయితే అధికమాసంలో, నిజమాసంలో రెండుసార్లు జరపాలి.

* అధిక మాసంలో ఏకాదశి వ్రతం, మాసశివరాత్రిలను యధావిధిగా నిర్వహించుకోవచ్చు.

అధికమాసంలో శుద్ధ ఏకాదశికి 'సర్వ ఏకాదశి' అని పేరు. ఈరోజు మహావిష్ణువు పూజ, ఏకాదశి వ్రతం ఉపవాసం జాగరణలను పాటించాలి.

మే నెల 11 వ తేదీ శుక్రవారం సర్వ ఏకాదశి రోజు నుంచి నిజ కర్తరి ప్రారంభమవుతుంది. మే నెల 29 వ తేదీ మంగళవారంతో అంతమవుతుంది. సూర్యుడు భరణీ నక్షత్రంలోని మూడు, నాలుగు పాదములలోనూ, కృత్తిక నక్షత్రంలోని నాలుగు పాదాలలోనూ, రోహిణి నక్షత్రంలోని మొట్టమొదటి పాదములో సంచరిస్తున్న కాలానికి 'కర్తరి' అని పేరు.

ఈ కర్తరికాలంలో ఉపనయనములు, వివాహములు, గృహప్రవేశాలు యజ్ఞయాగాదుల నిర్వహణ, మండప నిర్మాణాల వంటివి నిర్వహించుకోవచ్చు. చెట్లు నరకడం, భూమిని త్రవ్వడం, విత్తనములు వేయడం, బావులు చెరువులు తవ్వడం, నార తీయడం, కొత్త ఇల్లు, గ్రామాన్ని నిర్మించడం, కొత్త వాహనాలను అధిరోహించడం, క్షురకర్మ చేసుకోవడం చేయరాదు.

### భజే వాయుపుత్రం

శ్రీ సీతారాముల అనన్య భక్తుడైన హనుమంతుడు అఖండ బ్రహ్మచర్య వ్రత పాలకుడు. వీరత్వ, శూరత్వ, బుద్ధిమత్వ దక్షత్వాది సద్గుణములకు అతను నిధి. జీవన సర్వస్వాన్నీ రామాంకితమొనర్చినవాడు. అతని రోమరోమమూ రామమయము. ఆయన దాస్య భక్తికి ప్రతీక. రామభక్తునిగా దాసత్వం నిర్వహిస్తూనే, స్వయంగా అనిర్వచనీయ శక్తి మహిమకు ఆరాధ్యునిగా నిలిచినవాడు హనుమంతుడు. హనుమకు మంత్రశాస్త్రంలో విశేషమైన స్థానం ఉంది. వానర, సింహ, గరుడ, వరాహ, ఆశ్వముఖాలతో అలరాడే పంచముఖ

హనుమ భక్తులకు అభయ ప్రదునిగా పూజలందుకుంటున్నాడు. హనుమంతుని కంటే గొప్ప దైవం లేడని మహర్షులందరూ నిర్ణయించారంటుంది వానరగీత. కలియుగంలో హనుమను ఒక్కడిని సేవిస్తే సకల దేవతలనూ ఉపాసించినట్లే అని ఈశ్వరుడే స్వయంగా చెప్పాడు. హనుమజ్జయంతి నాడు ఆంజనేయుని పూజిస్తే సకల శుభాలూ లభిస్తాయి.

తెలుగువారి దేవుడని మనం ఘనంగా చెప్పుకోగలిగిన వాడు శ్రీ హనుమంతుడు. అంజనాదేవి, కేసరి దంపతులకు చిరకాలం సంతానం కలుగలేదు. భర్త అనుమతి తీసుకుని అంజన వెంకటాద్రి వెళ్లి శివుని కోసం తపస్సు చేసింది. వాయువు ఆమెకు రోజూ ఒక ఫలం ఆహారంగా అందించేవాడు. ఆమె వేయి సంవత్సరాలు తపస్సు చేసినట్లుగా పరాశర సంహిత చెబుతోంది. అంజన తపస్సు చేయడంవల్ల ఏడు కొండలలో ఒక కొండకు అంజనాద్రి అని పేరు వచ్చినట్టు బ్రహ్మాండ పురాణం లోని తీర్థ ఖండంలో ఉంది.

అంజనాదేవి తపస్సుకు మెచ్చి ఆదిదంపతులు భూలోకానికి వచ్చారు. అప్పుడు పరమశివుడు గతంలో తనకు శ్రీమన్నారాయణుడు ప్రసాదించిన దివ్యతేజస్సును పార్వతీదేవికి ఇచ్చాడు. ఆ తేజస్సును భరించలేకపోయిన పార్వతీదేవి, దానిని అగ్నికి అందించింది. దానిని భరించలేకపోయిన అగ్నిదేవుడు దానిని వాయుదేవునికి అందించాడు. వాయుదేవుడు పుత్రభిక్షకై తనను ప్రార్ధిస్తున్న కేసరి భార్యయైన అంజనీదేవికి ఆ దివ్య తేజస్సును ఫలరూపముగా అందించాడు. దానిని తిన్న అంజనా దేవికి వైశాఖ బహుళ దశమి, శనివారం , పూర్వాభాద్ర నక్షత్రం మధ్యాహ్నవేళ ఆంజనేయస్వామి ఉద్భవించారు.

భక్తవత్సలుడైన ఆంజనేయుని లీలలు అనేకం. ఆ స్వామి బాలప్రాయంలో ఉదయిస్తున్న సూర్యబింబాన్ని చూసి, దాన్నొక పండుగా భావించి మింగబోయాడు. దాన్ని చూసిన ఇంద్రుడు తన వజ్రాయుధాన్ని ప్రయోగించాడు. అప్పుడు ఆంజనేయుని దవడ, అంటే హనుమ, వంకరబోయింది. అప్పట్నుంచి ఆంజనేయుడు హనుమంతునిగా పిలువబడ్డాడని ప్రతీతి. ఇంద్రుని వజ్రాయుధం దెబ్బకు ఆంజనేయుడు మూర్ఛపోగా దానిని చూసిన వాయుదేవుడు కోపంతో స్తంభించిపోయాడు. అప్పుడు దేవతలంతా దిగి ఒక్కొక్క వరాన్ని హనుమకు ప్రసాదించారు.

సువిశాల భారతదేశంలో 'ఆంజనేయస్వామి' లేని గ్రామమే లేదు. అటువంటి స్వామి మనకు ప్రసన్నాంజనేయునిగా, దాసాంజనేయునిగా, వీరాంజనేయునిగా, సీతారామ లక్ష్మణ భరత శత్రుఘ్న సమేతంగా ఇలా పలురూపాలలో దర్శనమిస్తారు. ఆ స్వామి వేంచేసియున్న ప్రతి చోట ఒడలి నిండా ఆపాదమస్తకం సిందూరపు పూతతో దర్శనమిస్తూ వుండటం విశేషం. సాక్షాత్తు శివుడే, దుష్ట శిక్షణకై, శిష్ట రక్షణకై రామకార్యార్థ సిద్ధికై హనుమంతునిగా అవతరించాడని పరాశర సంహిత చెబుతుంది. ఆయన సూర్యుని వద్ద సకల శాస్త్రాలు అభ్యసించాడు.

ఆ స్వామి అత్యంత బలసంపన్నుడు, విష్ణుభక్తి పరాయణుడు, సర్వదేవతా రూపుడు, త్రిమూర్త్యాత్మకుడు, వేదవేదాంగ తత్వజ్ఞుడు, సర్వ విద్యా విశారదుడు, సర్వ లక్షణ సంపన్నుడు, సర్వ మంగళ స్వరూపుడు, బ్రహ్మ జ్ఞాన కోవిదుడు, ఆపత్సమయాలలో అందరికి అండగా నిలిచి, కాపాడే దయామయుడు హనుమ!

హనుమంతుని స్మరించడంవల్ల తెలివితేటలు అంటే విచక్షణా జ్ఞానం లభిస్తుంది. బలం. కీర్తి, దేనికైనా చలించని ధైర్యం లభిస్తాయి. భయం తొలగిపోతుంది. శారీరక, మానసిక రోగాలు తొలుగుతాయి. అజాడ్యం అంటే చురుకుగా పనిచేసే శక్తి అందరినీ ఆకట్టుకునేలా మాట్లాడే శక్తి లభిస్తుంది.



సహజంగా వానరవదనం, శత్రువుల్ని చెండాడునపుడు సింహముఖం, వేగంలో సాక్షాత్తు గరుత్మంతుడు, ఉద్ధరించడంలో ఆది వరాహ సదృశుడు, వేదాది సమస్త విద్యలమూర్తిగా హయగ్రీవుడు (అశ్వముఖం) అలా అయిదు లక్షణాలను రామాయణంలో ప్రదర్శించిన ఆంజనేయుని మంత్రమూర్తిని పంచముఖ ఆంజనేయునిగా దర్శనమిస్తున్నాడు. 'హనుమాన్' అనే నామానికి యోగ జ్ఞాన స్వరూపమైన పరమేశ్వర తత్వమే హనుమత్స్వరూపం.

యుద్ధ కాండలో హనుమద్విజృంభనని వాల్మీకాదులు అద్భుతంగా వర్ణించారు. శివప్రసాదమైన కాలయాస త్రిశూలాన్నీ కుంభకర్ణుడు రామాదులపై ప్రయోగించగా, దానిని మధ్యలోనే అడ్డుకుని, అవలీలగా విరిచి విసిరిపారేశాడు. శివావతారమైన హనుమ సంజీవిని తెచ్చి మూర్ఛితుడైన లక్ష్మణునికి ప్రాణదానం చేశాడు. ఇంద్రజిత్తు ప్రయోగించిన బ్రహ్మాస్త్రం వల్ల దెబ్బతిన్న వానరాదులకు ఓషధి పర్వతం ద్వారా ప్రాణరక్షణగావించాడు. సీత జాడను హనుమంతుని ద్వారా విన్న శ్రీరామచంద్రుడు వెనువెంటనే ఆంజనేయుని ప్రశంసిస్తూ కౌగలించి హృదయానికి హత్తుకుని తన ఆనందాన్ని ఎరుకపరిచాడు. పట్టాభిషేక సందర్భములో సీతామహాదేవి పరమ వాత్సల్యంతో ఆంజనేయస్వామికి రత్నాలహారం ప్రసాదించింది. సగం జంతువూ, సగం నరుడు అయిన ఆకృతులు జగతత్త్వ, ఈశ్వర తత్త్వ సమన్వయ రూపాలుగా మంత్రశాస్త్రం చెబుతోంది.

నేటికీ హిమాలయాల్లో స్వామి తపస్సు చేసుకుంటున్నట్టు భక్తుల నమ్మకం, ఆర్తితో, స్వచ్ఛమైన మనస్సుతో తనను కొలచిన భక్తులకు ఇప్పటికీ సాక్షాత్కరిస్తారు. ఇందుకు నిదర్శనం మహాభక్తుడైన తులసీదాసుకు స్వామి దర్శనమిస్తాడు. ఆ కారణంగానే తులసీదాసు కాశీలో హనుమదాలయాన్ని నిర్మించి చాలీసాతో కీర్తించాడు. ద్వాపరయుగంలో అర్జునుడికి రథ రక్షకుడిగా, గంధమాదన పర్వతం మీద వృద్ధ వానరరూపంలో భీమునికి దర్శనమిచ్చాడు, మరియు తన రుద్రతేజ ప్రసారంతో దివ్యశక్తినిచ్చాడు. కలియుగ దైవంగా ప్రాతః స్మరణీయ చిరంజీవులలో ఒకరై 'భవిష్యత్ బ్రహ్మ' గా కీర్తింపబడ్డాడు స్వామి.

శ్రీ హనుమంతునికి సంబంధించిన ముఖ్యమైన పర్వదినాలు ముచ్చటగా మూడు ఉన్నాయి మొదటిది వైశాఖ బహుళ దశమి నాడు వచ్చే హనుమజ్జయంతి. రెండోది జ్యేష్ఠ శుద్ధ దశమి నాటి హనుమత్ కల్యాణం. మూడోది మార్గశిర శుద్ధ త్రయోదశి నాటి హనుమత్ వ్రతం.

హనుమజ్జయంతి:

వైశాఖ మాసంలో హనుమంతుడు జన్మతిథి అయిన బహుళ దశమినాడు సూర్యోదయానికి ముందు లేచి స్నానం చేసి హను-

మంతుని పూజిస్తే యావజ్జీవితం సకల శుభాలు కలుగుతాయి. హనుమంతుని పూజావిధానం పరాశర సంహితలోను, శౌనక సంహితలోనూ ఉన్నది.

మన్యుసూక్తం చదువుతూ లేదా పురోహితుని ద్వారా చదివించుకుంటూ శుద్ధ జలాలతో స్వామివారి విగ్రహాన్ని అభిషేకించాలి. తరువాత ఆ విగ్రహాన్ని పూజామందిరంలోనే ఒక పళ్ళెంలో పెట్టుకోవాలి, ఆంజనేయుడి అష్టోత్తర శతనామాలు చదువుతూ తమలపాకులతో హనుమంతుని పూజించాలి. అప్పాలు, వడపప్పు, గారెలు, కొబ్బరికాయ, అరటిపండ్లు మన ఇచ్ఛానుసారము నైవేద్యంగా పెట్టాలి. ఆ నైవేద్యాన్ని ప్రసాదంగా ఇంటిల్లిపాది తినాలి. ఈ పుణ్యదినం నాడు సుందరకాండ పారాయణ చేసినవారికి లేదా స్వామికి 108 ప్రదక్షిణలు చేసినవారికి స్వగృహం లభిస్తుంది. పెళ్లికానివారికి పెళ్లి అవుతుంది.

హనుమత్ వ్రతం:

మార్గశిర శుద్ధ త్రయోదశి (ఆంగ్ల మాసం డిశంబరు నెలలో) వస్తుంది. ఈ వ్రతమాచరించినవారి సమస్త కోరికలు నెరవేరతాయి. పూర్వం విభీషణుడి కుమారుడు నీలుడు, మాహిష్మతీ రాజు సోమదత్తుడు వ్రతాలు భక్తితో నిర్వర్తించి ధర్మ బద్ధంగా, కష్టాలు లేకుండా రాజ్యాలను ఏలారు.

హనుమద్దీక్ష:

సాధారణంగా చైత్ర పౌర్ణమి లేదా వైశాఖ బహుళ దశమి లేదా మార్గశిర త్రయోదశి రోజున స్వామివారి కృపా కటాక్షాలు నిమిత్తం దీక్ష కొనసాగిస్తారు.

హనుమంతుడు కల్పవృక్ష సమానుడు. అష్ట సిద్ధులు, నవవిధులు ఆయనను పూజిస్తేనే లభ్యమవుతాయి. హనుమత్ మంత్రం కోరినవన్నీ ఇచ్చే చింతామణి. ఆయనను ఆశ్రయిస్తే ఎటువంటి అభయం, ఆరోగ్యం, వాక్పటుత్వం, బుద్ధి కుశలత వంటివన్నీ సిద్ధిస్తాయి. నిత్యం తప్పనిసరిగా తలస్నానం చేసి, 108 సార్లు హనుమత్ దీక్షా మంత్రాన్ని జపించి, ఆలయదర్శనం చేసుకొని, సాత్వికాహారం తీసుకోవాలి. పాదరక్షలు ధరించరాదు. ధూమపానం, మాంసాహారం, మద్యపానం నిషేధం. సింధూరం నొసటను ధరించి 41 వ రోజు లేదా 21 వ రోజు ఉదయకాలం దీక్షా విరమణ చేయాలి. అర్చక స్వాముల ద్వారా దీక్ష విరమించాలి. అయిదు సార్లు దీక్ష స్వీకరించినవారు ఇతరులకు దీక్షనివ్వడానికి అర్హులు.

హనుమంతుడు సూర్యుని వద్ద విద్యాభ్యాసం చేశాడు. హనుమంతుని బుద్ధి విద్య బల పరాక్రమాలు చూచి మెచ్చిన సూర్యుడు తన కుమార్తె అయిన సువర్చలను హనుమంతునకు ఇచ్చి జ్యేష్ఠ శుద్ధ దశమినాడు కల్యాణం చేశాడు. రామాయణంలో ఈ కల్యాణం విషయం వ్రాయబడలేదు. హనుమంతుడి చరిత్ర పరాశర సంహిత అనే గ్రంథంలో ఉన్నది. హనుమంతుడు 'భవిష్యత్ బ్రహ్మ'. ఆయన బ్రహ్మ స్థానం పొందినవాడు. సువర్చలాదేవి సరస్వతీ స్థానం పొందుతుంది. దేవతల భార్యలంటే వారి శక్తులే. బ్రహ్మచర్య నిష్ఠా గరిష్ఠునికి ఉండే శక్తి వర్చస్సు. సువర్చస్సు ఆమెయే సువర్చలాదేవి.

స్వామివారు, సుగ్రీవునికి ఒక మంత్రిగా, విభీషణునికి సలహాదారుగా, వారసేనకు సేనానాయకునిగా, రాయబారం జరిపిన దౌత్యవేత్తగా, మహాబలవంతునిగా, ఒక కార్యశీలిగా, కార్య నిర్వహణ సమర్థునిగా, ఆర్థిక వేత్తగా, ఆడినమాట తప్పనివాడుగా మెలిగిన వినయశీలి, మహాతపస్వి, స్థిత ప్రజ్ఞుడు, నిస్వార్ధజీవి ఆంజనేయుడు.

'హనుమత్ చాలీసా' పారాయణం చేస్తే సాధకుల జ్ఞాపక శక్తి వృద్ధి చెంది చదువు బాగా వస్తుంది.

నమస్తేస్తు మహావీర నమస్తే వాయునందన
విలోక్య కృపయా నిత్యం
త్రాహిమాం భక్తవత్సలా!

అని మారుతికి మనసారా నమస్కరిద్దాం.

**ది. 10 - 5 - 2018 న హనుమజ్జయంతి.**

# జనార్ధన ఠాకూర్

## మే 2018 లో మీ రాశి ఫలాలు



9963933371, 9490189713

మే నెలలో : రవి 15 వరకు మేషంలో, తదుపరి వృషభంలో; బుధుడు 9 వరకు మీనంలో, తదుపరి 27 వరకు మేషంలో,తదుపరి వృషభంలో; కుజుడు 2 వరకు ధనస్సులో, తదుపరి మకరంలో ; శుక్రుడు 14 వరకు వృషభంలో, తదుపరి మిథునంలో; గురుడు వక్ర స్థితిలో తులలో; శని ధనస్సులో; రాహువు కర్కాటకంలో; కేతువు మకరం లో సంచారం

**మేష రాశి:**

ఈ రాశివారికి అనవసరపు ఖర్చులు పెరిగినా ఆదాయం బాగుండును. కంటి సమస్యల మినహా ఆరోగ్యము బాగుండును. గృహంలో పెద్దవారి ఆరోగ్య విషయమై వైద్యుని సంప్రదించవలసిరావచ్చును. మానసిక ప్రశాంతత వుంటుంది. వృత్తి మరియు వ్యాపార రంగములవారికి బాగుంటుంది. దూర-ప్రయాణం చేసే అవకాశం కలదు. దానివల్ల లబ్ధి పొందుతారు. సాంకేతిక రంగంలో ఉన్న విద్యార్థులకు మంచి సమయం.

1 వ తేదీ నుండి 3 వరకు మరియు 28 నుండి 31 వరకు ముఖ్యమైన పనులు వాయిదా వేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన:

1) సోమవారం నాడు పచ్చి పాలు శివాలయంలో సమర్పించాలి.

2) మంగళవారం నాడు ఆంజనేయస్వామికి బూందీ నివేదించి భక్తులకు పంచిపెట్టండి.

**వృషభరాశి:**

ఈ మాసంలో అధిక ఖర్చుల వలన ఇబ్బందిపడతారు. అవివాహితుల వివాహం గురించి చర్చ జరుగును. సన్నిహిత బంధువును కలవటం జరుగును. వైద్యసలహా వల్ల దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి కొంత ఉపశమనం కలుగును. వైవాహిక జీవితంలో ఒత్తిడి వుంటుంది. మీరు పనిచేయుచున్న కార్యాలయంలో మీ ముద్ర బలంగా ఉండును. స్థలం మార్పు జరుగు సూచనలు కలవు. వ్యాపారస్తులు నూతన పెట్టుబడులు పెట్టే అవకాశం కలదు. రాజకీయ కార్యాల్లో విజయం లభిస్తుంది. నిరుద్యోగులకు నూతన అవకాశం లభించును. పరిశోధనా రంగంలోని విద్యార్థులకు మంచి సమయం.

3 - 6 వ తేదీల మధ్య మరియు 31 వ తేదీన ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేయుట మంచిది.

వైదిక సూచన:

1) రామాలయ సందర్శన

2) తెల్ల జిల్లేడు వేరును బుధవారం నాడు తెచ్చి, ఆకుపచ్చని దారంలో కట్టి భుజానికి ధరించిన ఆర్థిక ఇబ్బందులు తొలగును.

**మిధున రాశి:**

ఈ రాశివారికి ఆర్థికంగా అత్యంత అనుకూల సమయం. గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. స్థిరాస్తిపై పెట్టుబడు లు పెడతారు. మీ మరియు మీ కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించవలెను. గృహంలో శుభకార్యాల ప్రయత్నాలు సఫలం అవుతాయి. ఉద్యోగస్తులకు పదోన్నతి కాని ఇంక్రిమెంట్ కానీ లభించును. వ్యాపారస్తులకు అనుకూలసమయం. విద్యార్థులకు మంచి కాలం. నిరుద్యోగులు ఇంటర్ వ్యూ కి హాజరైనచో ఉత్తీర్ణులు కాగలరు.

6- 8 తేదీల మధ్య ముఖ్యమైన పనులు వాయిదా వేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన:

1) ముఖ్యమైన పనులలో ఆకుపచ్చ రంగు ధరిస్తే

విజయం తథ్యం.
2) బుధవారం నాడు గణపతి దేవాలయ సందర్శన చేసిన శుభ ఫలితాలు కలుగుతాయి.

### కర్కాటక రాశి :

ఈ రాశివారికి అధిక ఖర్చులు మరియు నష్టాల వలన ఆర్ధిక లోటు కనబడును. అప్పులు చేయు అవసరం కలుగును. ఆహార విషయంలో జాగ్రత్త వహించవలెను. తీర్థయాత్రలు చేస్తారు. వాహనము నడుపునప్పుడు జాగ్రత్త వహించవలెను. ఉద్యోగస్తులకు నూతన బాధ్యతలు అప్పగించుట కానీ అనుకూల స్థలముకు వెళ్ళుట కానీ జరుగును. స్నేహితులు తమ సహకారం అందిస్తారు. వ్యాపారస్తులు లావాదేవీలలో జాగ్రత్త వహించవలెను. విద్యార్థులు పై చదువుల నిమిత్తం ధన సహాయముకై చేయు ప్రయత్నములు లాభించును. 8 - 11 తేదీల మధ్య ముఖ్యమైన పనులను వాయిదా వేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన:
1) రావిచెట్టు వద్ద 5 వత్తుల దీపము వెలిగించండి.
2) సోమవార నియమం పాటించండి.

### సింహ రాశి:

ఈ రాశివారు మంచి ఆర్ధిక ప్రణాళికతో ముందుకు సాగవలెను లేనిచో ఆర్ధిక ఇబ్బందులు తప్పవు. స్పెక్యులేషన్ విషయంలో జాగ్రత్త వహించవలెను. సకాలంలో వైద్య పరీక్షలు జరిపించుకొనుట మంచిది. ఉద్యోగస్తులకు అనుకూల సమయం. మేధావుల పరిచయం కలుగును. వ్యాపారస్తులకు అత్యంత అనుకూల సమయం. స్థిరాస్తి విషయంలో మేలు జరుగును. ఉద్యోగస్తులకు స్థల మార్పునకు అవకాశం. 11 -13 వ తేదీల మధ్య ముఖ్యమైన పనులు వాయిదా వేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన:
1) బుధవారం ఆవుకి పచ్చగడ్డి తినిపించుట
2) నూనెతో తయారు చేసిన రొట్టెలు నల్ల కుక్కకు తినిపించిన శుభఫలితాలు కలుగుతాయి.

### కన్యారాశి:

ఈ రాశివారికి ఆర్ధిక విషయంలో అత్యంత జాగ్రత్త అవసరం. ఖర్చులు తగ్గించుకొనుట మరియు స్పెక్యులేషన్ కు దూరంగా ఉండుట మంచిది. అపనిందకు గురి అయ్యే అవకాశం కలదు. ఉద్యోగస్తులకు పై అధికారుల సహాయ సహకారాలు లభిస్తాయి. రచయితలకు, పబ్లికేషన్ మరియు మేధావులకు అనుకూల సమయం. విద్యార్థులకు పై చదువులకు మార్గం సుగమం అగును. 13 -15 తేదీల మధ్య ముఖ్యమైన పనులు వాయిదా వేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన:
1) ఆవుపాలతో శివునికి అభిషేకం చేయుట
2) తులసి మాల ధరించుట మరియు హనుమాన్ చాలీసా చదువుట ద్వారా ఉపశమనం లభించును.

### తులా రాశి:

ఈ రాశివారికి ఆర్ధిక కష్టములు ఉండును. ఖర్చులు అదుపులో ఉంచుకోవలెను. బంధుల తాకిడి అధికముగా ఉండును. వాహనప్రమాదం జరిగే సూచన కలదు. ఉద్యోగ స్థలములో అతి జాగ్రత్త వహించవలెను. చేయు పనియందు మార్పు కలుగు అవకాశం కలదు. విద్యార్థులకు మంచి సమయము. 15 - 17 తేదీల మధ్య ముఖ్యమైన పనులను వాయిదా వేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన:
1) ఎర్రని గుడ్డలో కొన్ని రూపాయలు వుంచి మూట కట్టి దేవుని గదిలో ఉంచండి.
2)శుక్రవారం నాడు ఇంటిగుమ్మం ముందు గోధుమపిండి మరియు ఆవునెయ్యి కలిపి ప్రమిద చేసి దీపం వెలిగించండి.

### వృశ్చిక రాశి :

ఈ రాశివారు సకాలంలో డబ్బు చేతికి అందక ఇబ్బంది పడుదురు. అకాల భోజనం వల్ల ఆరోగ్య సమస్యలు కలుగును. మీరు అనుకున్న కోరికలు తీరుట వలన మీ ఆత్మస్థైర్యం పెరుగును. ఉద్యోగస్తులకు అత్యంత అనుకూల సమయం. రచ-

యితలు మరియు పత్రికా రంగంలో ఉన్నవారికి అనుకూల సమయం. వ్యాపారస్తులకు విదేశీ లావా-దేవీలు అనుకూలించును. విద్యార్థులకు అత్యంత అనుకూల సమయం. పై చదువులకై ప్రయత్నించు-వారికి ఆశాజనకంగా ఉండును. 17-19 తేదీల మధ్య ముఖ్యమైన పనులు వాయిదా వేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన:

1) శనివారం నాడు హనుమాన్ చాలీసా పారాయణ చేయుట

1) కనకధారా స్తవం పారాయణ చేయుట ద్వారా ఉత్తమ ఫలితాలు పొందగలరు.

**ధను రాశి :**

1) ఈ రాశివారికి ఆర్థిక విషయాలలో అనుకూలత. ఆరోగ్య విషయంలో శ్రద్ధ తీసుకోవలెను. గృహంలో అనుకూల వాతావరణం ఉండును. బద్ధకం పూర్తిగా విడిచిపెట్టవలెను. వ్యాపారస్తులకు గడ్డు కాలం. ఇతరుల సమస్య పరిష్కరించవలసి వచ్చినప్పుడు జాగ్రత్త వహించవలెను.19-21 తేదీల మధ్య ముఖ్య-మైన పనులు వాయిదా వేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన:

1) నవగ్రహ ప్రదక్షిణం చేయుట

2) ప్రతి సోమవారం నాడు రుద్రాభిషేకం చేయుట ద్వారా శుభ ఫలితాలు పొందగలరు.

**మకర రాశి:**

ఈ మాసంలో ఆర్థిక స్థితి అనుకూలంగా వుండదు. ఆరోగ్యము సామాన్యముగా ఉండును. అప్పుడప్పుడు వైరల్ జబ్బులతో సతమతమౌదురు. ఉద్యోగస్తులకు ఆటంకాలు మరియు పైవారి వలన బెదిరింపులు. కాంట్రాక్టులు మరియు ప్రాజెక్ట్ పనులు ముందుకు సాగవు. విద్యార్థులకు ఏకాగ్రత అవసరం. 21-23 తేదీల మధ్య ముఖ్యమైన పనులు వాయిదా వేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన:

1) హనుమాన్ ఆలయ సందర్శన

2) శ్రీరామ రక్షా స్తోత్రం పారాయణ చేయుట ద్వారా శుభఫలితాలు పొందగలరు.

**కుంభ రాశి:**

ఈ రాశివారికి ఆర్థిక స్థితి అనుకూలంగా ఉండును. ఆరోగ్య పరిస్థితి బాగుండును. ఆధ్యాత్మికం పై దృష్టి సారిస్తారు. కుటుబ సౌఖ్యం లభించును. దూర ప్రయాణం చేస్తారు. తద్వారా మంచి ఫలి-తాన్ని పొందుతారు. ఉద్యోగస్తులకు అనుకూల సమయం. న్యాయ సంబంధిత విషయాలలో విజయం సాధిస్తారు. పరిశోధనా రంగంలో ఉన్న-వారికి అనుకూల సమయం. 23-26 తేదీల మధ్య ముఖ్యమైన పనులు వాయిదా వేయుటమంచిది.

వైదిక సూచన:

1) రామాలయ సందర్శన

2) విష్ణు సహస్ర నామ పారాయణ చేయుట ద్వారా శుభఫలితాలు పొందగలరు

**మీన రాశి :**

ఈ రాశివారికి ఆర్థిక స్థితి అనుకూలంగా ఉండదు.ఆరోగ్య పరిస్థితి బాగుండును కానీ ప్రమాదాలకు గురి అయ్యే అవకాశం కలదు. ఇంటివారితో ప్రయాణము చేయుదురు. ఒక స్నేహితుడు మీకు దూరమగును. మీరు చేయు వృత్తిలో మంచి గుర్తింపు పొందెదరు. కొత్త అవ-కాశములు లభించును. వ్యాపార లావాదేవీలలో కొంత జాప్యం జరుగును. స్థిరాస్తి విషయంలో లాభం కలుగును. దూరప్రయాణం వలన లాభం కలుగును. విద్యార్థులకు శుభసమయం. పోటీ పరీక్షలలో విజయం.

26- తేదీల మధ్య ముఖ్యమైన పనులు వాయిదా వేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన:

1) పవిత్రమైన గంగాజలం ఇంటిలో ఉంచుట

2) శుక్రవారం నియమం పాటించినచో శుభ ఫలితాలు పొందగలరు.

**సర్వే జనాస్సుఖినో భవంతు**



హనుమజ్జయంతి శుభాకాంక్షలు

RNI No. APTEL/2011/39497 MAY 2018 Postal No. HSE/1043/2017-19

Date of Publishing: 1st May Date of Posting: 8th May




Published, Edited and Printed by T.Shanti at Flat no. 45058, Janapriya Utopia, Hyderguda, Attapur, Hyderabad - 500 048, Phone: 94905 71297 / 94401 47993 email: teega51@gmail.com (www.chaitanyam.net) Printed at Planographers, 5-8-300, Chirag Ali lane, Abide, Hyderabad-500001